ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 2-8-2017 బుధవారం సిటీ సంపుటి 43 సంచిక 354

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

2 లో

రాజీనామా



'నీతి ఆయోగ్' పదవి నుంచి వైదొలగనున్న పనగడియా

- ప్రధానికి లేఖరాసినట్లు వెల్లడి
- సెలవు పొడిగించని కొలంబియా వర్సిటీ
- అందుకే తిరిగి వెళ్లిపోవాలంటూ నిర్ణయం

మార్పు



కుంతియా

దిగ్విజయ్ 'వ్యవహారాలకు' కత్తెర!

- పార్టీ తెలంగాణ బాధ్యతల నుంచి తప్పించిన ఏఐసీసీ
- ఇక ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం!
- ఆయన స్థానంలో కుంతియా

ఎన్నిక



పాకిస్థాన్ ప్రధానిగా అబ్బాసీ

విషాదం



మల్లిక్

కాటేసిన కాల'చక్రం'

- పాఠశాల బస్సు కింద పడి రెండేళ్ల బాలుడి మృతి
- అక్కకు టాటా చెప్పేందుకొచ్చి మృత్యు ఒడికి

కరీంనగర్‌కు చెందిన యాదగిరి తన కుమార్తె పెళ్లి సందర్భంగా రూ.10 లక్షల బంగారం పెడతానని మగపెళ్లివారికి మాటిచ్చాడు. అయితే రూ. రెండు లక్షలు దాటితే నగదు రూపంలో లావాదేవీలు చేయకూడదని కేంద్రం పెట్టిన కొత్త నిబంధన గురించి వ్యాపారి చెప్పడంతో అంత సొమ్ము తెలుపు (వైట్)లో లేదని ఆయన వివరించారు. దీంతో ఒక్కో కుటుంబ సభ్యుడి పేరిట రూ. 1.90 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రసీదు ఇచ్చారు.

నల్లధనం పుష్కలంగా ఉన్న ఓ పెద్ద మనిషి నగదును బంగారంలోకి మార్చాలనుకున్నాడు. మార్కెట్ ధరపై అయిదారు శాతం మొత్తాన్ని అదనంగా తీసుకుని ఆ పెద్దమనిషికి బంగారాన్ని బిస్కెట్ల రూపంలో విక్రయించారు. ఇలా ఆయన కాగితపు సొమ్ము బంగారంగా మారింది. అటు వ్యాపారికీ అదనపు ఆదాయం లభించింది. ప్రభుత్వానికి జమ కావాల్సిన పన్నుకు గండిపడింది.




జీరో బేరం

రూ. 2 లక్షల నిబంధనకు అడ్డదారులు

సవాలక్ష నిబంధనలు.. జీఎస్టీలు.. ఐటీ నిఘా.. ఇవన్నీ నల్లధనాన్ని ఎంతవరకు కట్టడి చేయగలుగుతున్నాయి? దేశంలో నల్లధనం ఎక్కువగా ప్రవహిస్తున్న రంగాలు రెండే. ఒకటి స్థిరాస్తి రంగమైతే.. రెండోది బంగారం. అందుకే ప్రభుత్వం రకరకాల నిబంధలను తీసుకువచ్చింది. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు తర్వాత కుదైలైన వాటిలో ఈ రంగాలే ప్రధానమైనవి. అయితే.. వ్యాపారం తగ్గిందేమో కాని అక్రమ లావాదేవీలు మాత్రం తగ్గకపోవడం ఇక్కడి విశేషం. ట్యాక్స్ తగ్గడం కోసం కొన్ని చెప్పుల కంపెనీలు రూ. 199, రూ. 299 అని ధరలు పెడుతుండడం తెలిసిందే. ఇది ఇప్పుడు బంగారంలో కూడా మొదలైంది. రూ. 2 లక్షలు దాటితే నగదు లావాదేవీలు జరపకూడదన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన నుంచి తప్పించుకోవడం కోసం కొనుగోలుదారులు, వ్యాపారులు కలిసి రూ. 1.90 లక్షలకే బిల్లు పరిమితమయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారు. లేదంటే ఇద్దరు ముగ్గురి పేర్ల మీద బిల్లు రాస్తున్నారు.

- ప్రత్యేక కథనం 2 లో





భద్రాద్రి ఆలయ తుది నమూనా సిద్ధం

- బృహత్‌ప్రణాళికపై చినజీయర్ స్వామి సంతృప్తి
- ముఖ్యమంత్రి ఆమోదమే తరువాయి

- వివరాలు 3లో

సీసీఎంబీ వ్యవస్థాపకుడు పి.ఎం.భార్గవ కన్నుమూత



- భారతదేశ ఆధునిక జీవశాస్త్ర రూపశిల్పిగా గుర్తింపు
- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సుదీర్ఘ సేవలందించిన భార్గవ
- 40 ఏళ్ల క్రితమే బయోటెక్నాలజీ విభాగం ఏర్పాటుకు కృషి
- పద్మభూషణ్ సహా అనేక అవార్డులు

-14లో

శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం

- రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టు పునరాకృతి, కాలువల ఆధునికీకరణ
- 14.5 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరివ్వడమే లక్ష్యం
- 10న పోచంపాడు వద్ద సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి



ఈనాడు – హైదరాబాద్

ప్రభుత్వం రూ.2 వేల కోట్లతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకానికి శ్రీకారం చుట్టబోతోందని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ప్రాజెక్టు పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీరందించడమే దీని లక్ష్యమని తెలిపారు. ఈ నెల 10వతేదీన ఉదయం 11 గంటలకు పోచంపాడు వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంగళవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు సమైక్య పాలకులు అన్యాయం చేశారు. సీఎం కేసీఆర్ ఆ తప్పిదాలు సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఎస్సారెస్పీ 112 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల అతిపెద్ద ప్రాజెక్టు. ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యం కారణంగా దాని సామర్థ్యం 80 టీఎంసీలకు తగ్గింది. ఈ ప్రాజెక్టు కింద కాలువలను 8,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో రూపొందించినా.. 6,500 క్యూసెక్కులు కూడా ప్రవహించడం లేదు. జయశంకర్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు పారలేదు. డోర్నకల్ నియోజకవర్గంలోనూ కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పునరాకృతి ద్వారా ఆయకట్టు స్థిరీకరణకు కృషిచేస్తున్నారు. మేడిగడ్డ వద్ద గోదావరి ఇప్పుడు మూడు లక్షల క్యూసెక్కులతో ప్రవహిస్తోంది. శ్రీరాంసాగర్‌కు మాత్రం గోదావరి నుంచి చుక్కనీరు రావడం లేదు. పునరుజ్జీవన పథకం కింద కాళేశ్వరం నుంచి నీటిని తరలించి శ్రీరాంసాగర్‌ను నింపి, తెలంగాణలోని అయిదు జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం. ఇందులో భాగంగా ప్రాజెక్టు పునరుజ్జీవన పథకానికి రూ. 1000 కోట్లు, కాలువల ఆధునికీకరణకు మరో రూ.1000 కోట్లు ఖర్చు

(మిగతా 2లో)

లష్కరే అగ్ర నేత హతం

కశ్మీరులో పకడ్బందీ ఆపరేషన్

- ఇంటిని చుట్టుముట్టి అబు దుజానాను మట్టుబెట్టిన భద్రతా దళాలు
- అతని సహాయకుడినీ తుదముట్టించిన బలగాలు
- ఉగ్రవాదుల ఏరివేతలో కీలక విజయం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు పెద్ద విజయాన్ని సాధించాయి. పుల్వామా జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో.. 'మోస్ట్ వాంటెడ్' ముష్కరుడు, లష్కరే తొయిబా అగ్ర కమాండర్, పాకిస్థాన్ జాతీయుడు అబు దుజానాను తుదముట్టించాయి. అతడి సహాయకుడు ఆరిఫ్ నబీ దార్ అలియాస్ రెహాన్ కూడా హతమయ్యాడు. ఎన్‌కౌంటర్ సమయంలో నిరసనకారులు వచ్చి, భద్రతా దళాలపై రాళ్లు రువ్వారు. వీరిని కట్టడి చేయడానికి భద్రతా దళాలు చేపట్టిన చర్యల్లో ఒక ఆందోళనకారుడు చనిపోగా... పలువురు గాయపడ్డారు. మరోపక్క.. దుజానాను హతమార్చిన భద్రతా దళాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా కొనియాడారు.

భార్య కోసం వచ్చి..

దుజానా.. భార్య కోసం క్రమం తప్పకుండా వస్తుంటాడని పోలీసులు కనుగొన్నారు. అతడు రావడానికి ముందు అక్కడ నెలకొనే వాతావరణాన్ని గుర్తించారు. భార్య కోసం తాజాగా హకిర్‌పొరలోని ఒక నివాస ప్రాంగణానికి రాబోతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో రహస్యంగా నిఘా పెట్టారు. సోమవారం రాత్రి అతడి ఉనికిని నిర్ధారించుకున్నాక.. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే జమ్మూకశ్మీర్ పోలీసులకు చెందిన ప్రత్యేక కార్య విభాగం (ఎస్‌వోజీ), సైన్యం, సీఆర్పీఎఫ్ దళాలు రంగంలోకి దిగాయి. ఆ ప్రాంతంలో దుర్భేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశాయి. గాలింపు చర్యలు చేపట్టాయి. ఉగ్రవాదులు దాగిన ఇల్లు.. దట్టమైన జనావాసాల మధ్య ఉండటంతో పరిసరాల నుంచి పౌరులను ఖాళీ చేయించారు.

భద్రతా దళాలను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. దీంతో

(మిగతా 2లో)

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ తీర్పులు

- ఆన్‌లైన్‌లో సమాచారం లభ్యమయ్యేలా చర్యలు
- అవసరమైన వాటికి విధిగా ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

-2లో

మహిళా అధ్యాపక పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి

- సింగిల్ జడ్జీ ఉత్తర్వుల అమలు నిలిపివేత
- భర్తీ తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టీకరణ
- మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు ధర్మాసనం

-2లో

'ఆర్టికల్ 170' సవరణతోనే సీట్ల పెంపు

- లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ
- తక్షణం నిర్ణయం తీసుకోవాలి: మురళీమోహన్
- చట్ట స్ఫూర్తిని అమలుచేయాలి: హరిబాబు

-12లో

ఇదీ సంగతి!



విద్యార్థుల జీవితాలతో ఆటలు

- వర్సిటీ అధికారుల చెలగాటం
- పరీక్షలు, మార్కుల్లో ఇష్టారాజ్యం
- మార్కుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది
- ఆరోపణలు వెల్లువెత్తుతున్నా తీరు మారని విశ్వవిద్యాలయాలు
- అధికారుల నిర్లక్ష్యం, అక్రమాలతో విద్యా సంవత్సరం అస్తవ్యస్తం
- కమిటీలు వేస్తూ కంటితుడుపు చర్యలకు పరిమితం

-5లో



పీహెచ్‌డీ, ఎంఫిల్ మార్కుల్లో అవకతవకలపై కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి సాయన్న ఛాంబర్‌లో ధర్నాకు దిగిన విద్యార్థులు(పాత చిత్రం)

పూర్తయిన మత్తుమందుల విచారణ



నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సినీనటుడు నందు

- చివరిగా నటుడు నందు హాజరు
- మూడు గంటల పాటు ప్రశ్నించిన అధికారులు

ఈనాడు, హైదరాబాద్: మాదకద్రవ్యాల వ్యవహారంలో సినీప్రముఖుల విచారణ మంగళవారంతో ముగిసింది. జులై 19న దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో మొదలైన ఈ విచారణ.. నటుడు ఆనంద్ కృష్ణ అలియాస్ నందుతో ముగిసింది. మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆబ్కారీ కార్యాలయానికి చేరుకున్న నందును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు మధ్యాహ్నం 1.30 వరకూ సుమారు మూడు గంటలపాటు విచారించారు. మత్తుమందుల కేసులో సినీ పరిశ్రమకు చెందిన 12 మంది ప్రముఖులకు సిట్ నోటీసులు జారీ చేసింది. చివరగా విచారణకు హాజరైంది నందునే. మత్తుమందులు సరఫరా చేస్తూ దొరికిపోయిన కెల్విన్ ముఠా సభ్యుల ఫోన్లలో నందు నెంబరు ఉండటం, వారితో వాట్సాప్ ద్వారా సంభాషణలు

(మిగతా 2లో)

బంగారం జీరో దందా..

- రూ. 2 లక్షల నిబంధనకు అడ్డదారులు
- బిల్లు తక్కువలో చూపుతున్న వ్యాపారులు
- ఉన్నతవర్గాలవారికి సులభోపాయాలు ఎన్నో
- బిల్లు లేకుండా సాగుతున్న లావాదేవీల జోరు
- పెళ్లిళ్ల సీజన్లో సామాన్యులకు మాత్రం సమస్యలు
- నోట్ల రద్దు, జీఎస్టీతో పడిపోయిన అమ్మకాలు

ఈనాడు - హైదరాబాద్, అమరావతి

కేరళ తరువాత అత్యధికంగా బంగారం కొనుగోళ్లు జరిగేది తెలుగు రాష్ట్రాల్లోనే. ముఖ్యంగా శ్రావణ మాసం కావడంతో పెళ్లిళ్లు, శుభకార్యాల సందర్భంగా భారీగా కొనుగోళ్లు జరుగుతుంటాయి. వాటన్నింటికీ లెక్కాపత్రం ఉంటుందా? అంటే మాత్రం సందేహమే. రూ. రెండు లక్షలు దాటితే నగదు రూపంలో క్రయవిక్రయాలు ఉండకూడదన్నది కేంద్రం నిబంధన. కాని ఇది ఎక్కడా అమలు కావడంలేదు. కొద్దోగొప్పో అమలవుతున్నా అది సామాన్యులకే పరిమితమవుతోంది. అక్రమ క్రయవిక్రయాలు యథావిధిగా సాగిపోతూనే ఉన్నాయి. పెద్దనోట్ల రద్దుతోపాటు జీఎస్టీ తర్వాత అధికారికంగా బంగారం విక్రయాలు తగ్గిపోగా, అక్రమ లావాదేవీలు మాత్రం ఎక్కువైనట్లు కనిపిస్తోంది. నగదు అందుబాటులో లేకపోవటంతో తప్పనిసరైనవాళ్లు అది కూడా కొద్దిమొత్తానికి మాత్రం బ్యాంకుల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

తగ్గిన విక్రయాలు...

- నోట్ల రద్దు, జీఎస్టీ, బంగారంపై ఆంక్షలు ఇలా పలు రకరకాల కారణాలతో ఇటీవల కాలంలో బంగారం అమ్మకాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీగా తగ్గాయనటంలో సందేహం లేదు.
- జీఎస్టీ కారణంగా స్వర్ణాభరణాలపై పన్ను ఒకశాతం పెరిగింది. దీంతో ఒకప్పుడు రూ.కోట్లలో జరిగిన వ్యాపారం ఇప్పుడు రూ.లక్షల్లోకి పడిపోయిందని బంగారం వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



- ఆంధ్రప్రదేశ్లో సుమారు 5,000 వరకు పెద్ద, మధ్యతరహా బంగారు దుకాణాలున్నాయి. తెలంగాణలో సుమారు 8,000 వరకు ఉంటాయి. చిన్న చిన్న దుకాణాలు, తయారీ దుకాణాలు అన్నీ కలిపితే రెండు రాష్ట్రాల్లో 40,000 వరకు ఉంటాయని అంచనా.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న సుమారు 20 లక్షలమంది వరకు ఉంటారు.

పెళ్లి ఇంట అవస్థలు..

నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించడం, నల్లధనాన్ని అరికట్టడం లక్ష్యంగా కేంద్రం రూ.రెండు లక్షలకు మించి బంగారం కొనుగోళ్లపై ఆంక్షలు పెట్టింది. ఇదే సందుగా జీరో దందా పెరుగుతోంది. కొనుగోలుదారులు, విక్రయదారులు అడ్డదారిలో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. నిజానికి కేంద్రం ఆంక్షలు సామాన్యులకు పెద్దగా ఇబ్బందికరం కావనేది వ్యాపారవర్గాల వివరణ. సామాన్యులు తరచుగా ఆ స్థాయిలో బంగారం కొనుగోలు చేయరు. ఎటొచ్చి పెళ్లిళ్లు, ఇతరత్రా అవసరాలకు పెద్ద పెద్ద మొత్తంలో బంగారం కొందామనుకునే ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాలకు ఇది కొంత సమస్యగా మారుతోంది. తెలుగునాట పెళ్లిళ్లు ఆడంబరంగా జరుగుతుంటాయి. వధువుకు భారీగా నగలు పెట్టటం ఆనవాయితీ. తెలుగునాట పెళ్లి కుమార్తెలు సగటున 150 గ్రాముల నగలు ధరిస్తారని ఒక అంచనా. ఈ ప్రకారం తీసుకున్నా కనీసం రూ. 4.5 లక్షల వరకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. ఇంతపెద్ద మొత్తంలో నగలు కొనాలంటే పన్నుపోటు ఉంటుందనే భయం వారిని వెన్నాడుతోంది. దాంతో తమ కుటుంబంలోని ఇతర సభ్యుల పేరిట రూ. 1.90 లక్షల్లోపు బిల్లులు తీసుకుంటున్నారు. వ్యాపారులు కూడా అలాగే చేస్తున్నారు. 'అసలే వ్యాపారాలు దారుణంగా పడిపోయాయి. వినియోగదారులు కోరినట్లు బిల్లులు ఇవ్వక తప్పని పరిస్థితి, ఏం చేయమంటారు' అని ఓ బంగారు వ్యాపారి 'ఈనాడు'తో అన్నారు.

బ్యాంకు ద్వారా 20 శాతమే!

లెక్కల చిక్కుల కారణంగా బ్యాంకు లావాదేవీల ద్వారా బంగారం కొనేవారి వారి సంఖ్య పెద్దగా కనిపించడం లేదు. ఇప్పటికీ నగదు చలామణి పూర్తి స్థాయిలో లేకపోవటంతో కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేసిన విలువలో 10 నుంచి 20 శాతం మొత్తాన్ని బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లిస్తున్నట్లు వ్యాపారులు అంగీకరిస్తున్నారు. బ్రాండెడ్ దుకాణాల్లో రూ. రెండు లక్షలకు మించి లావాదేవీలు నిర్వహిస్తే పాన్‌కార్డును అనివార్యం చేశారు. దీంతో గతంతో పోలిస్తే 30 శాతం వరకు వ్యాపారం తగ్గినట్లు డీలర్లు చెబుతున్నారు.

పది రోజులు.. ఆరు బిల్లులు

తెలుగు రాష్ట్రాల్లో మరో తరహా పద్ధతి కూడా పాటిస్తున్నారు. ఒక వ్యక్తి రూ.10 లక్షలకు నగలు కొన్నారనుకోండి వారికి అదేరోజు బిల్లు ఇవ్వకుండా పది రోజుల్లోపు ఆ నగదుకు సరిపడేలా ఒక్కోరోజు రూ.1.90 లక్షలకు నగలు కొన్నట్లు బిల్లులు సృష్టించి ఇస్తున్నారు. ఆ వినియోగదారుడు పన్ను వలయం నుంచి కూడా బయట పడతాడనేది వారి వాదన. 'వారికి పన్ను పడుతుందో లేదో మాకు అనవసరం, రూ. 1.90 లక్షల్లోపు బిల్లు ఇస్తే వినియోగదారుడికి భయం ఉండదు, మాకు ఇబ్బంది ఉండదు, ఇక్కడ ఇలా బిల్లులు ఇస్తున్న వ్యాపారులూ చాలామంది ఉన్నారు' అని ఒక వ్యాపారి అసలు గుట్టు బయటపెట్టడం విశేషం. ఒక దుకాణానికి పదిమంది ఖాతాదారులు వస్తే వారిలో ఆరేడుగురు ఇలా పలు బిల్లులపై కొంటున్నవారే ఉంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఈ ధోరణి కనిపిస్తోంది. గతంతో పోల్చితే వినియోగదారుల్లో బంగారం కొనుగోళ్లపై అవగాహన పెరిగిందనే చెప్పాలి. కొందరు తాము కొంటున్న బంగారానికి బిల్లు అడిగి మరీ తీసుకోవడం గమనించదగ్గ పరిణామం. ఒకప్పుడు చిన్న మొత్తంలో బంగారం కొంటే బిల్లు అడిగేవారు కాదు, ఇప్పుడు పరిస్థితి మారిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

పెరుగుతున్న అక్రమ వ్యాపారం

నిబంధనల కారణంగా అక్రమ వ్యాపారం మూడు బిస్కెట్లు, ఆరు నాణేలు అన్న చందంగా సాగుతోంది. దీంతో ప్రభుత్వానికి పెద్దగా పన్ను రాబడి ఉండడంలేదు. పెద్దపెద్ద దుకాణాల్లో జరిగే వ్యాపారానికన్నా ఊరూరా ఉండే చిన్న దుకాణాల ద్వారా సాగే వ్యాపారం మూడింతల వరకు ఉంటుందన్నది అంచనా. మార్కెట్ ధరపై 5 నుంచి 6 శాతం అదనంగా తీసుకుని నల్లకుబేరులకు బిల్లులతో ప్రమేయం లేకుండా యథావిధిగా బంగారం విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆ తరహా విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నట్లు సమాచారం. కొన్ని పెద్ద దుకాణాల్లో మాత్రమే నిబంధనల మేరకు లావాదేవీలు సాగుతున్నాయి. పెద్దనోట్ల రద్దు ముందునాటి పరిస్థితులతో పోలిస్తే విక్రయాలు 50 శాతం తగ్గాయని పంపిణీదారులు చెబుతున్నారు.

బంగారు పల్లె: కేరళలోని కోజికోడ్ వద్ద ఉన్న కొడువల్లి గ్రామానికి ఉన్న మరోపేరు 'బంగారు పల్లె'. ఈ ఊళ్లో దాదాపుగా ప్రతి ఇంటి నుంచీ ఒకరు గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తుంటారు. దీంతో బంగారం కొనుగోళ్లు ఎక్కువ.

బంగారం ని'బంధనాలు'

- వివాహితవద్ద బంగారం నిల్వ పరిమితి 500 గ్రా.లు.
- అవివాహిత వద్ద బంగారం పరిమితి 250 గ్రా.లు.
- పురుషుల వద్ద గరిష్ఠంగా ఉండాల్సిన బంగారం 100 గ్రాములే.
- బంగారం కొనుగోలు చేయాలంటే పాన్ కార్డు నంబరు తప్పని సరి.
- రూ. రెండు లక్షలకు మించితే నగదు రూపంలో కొనడానికి వీల్లేదు.
- జీఎస్టీ రాకతో బంగారంపై పన్ను 2 శాతం నుంచి 3 శాతానికి పెరిగింది.

దిగ్విజయ్ 'వ్యవహారాలకు' కత్తెర!

ఈనాడు-దిల్లీ, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యతల నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్‌ను పార్టీ అధిష్ఠానం తప్పించింది. ఆయన స్థానంలో ఏఐసీసీ కార్యదర్శి ఆర్.సి.కుంతియాను నియమించింది. దిగ్విజయ్ ఒకప్పుడు కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పార్టీ వ్యవహారాలను అన్నీ తానై చక్కదిద్దారు. అప్పట్లో ఓ వెలుగువెలిగిన ఆయనను అధినాయకత్వం ఒక్కో రాష్ట్ర పార్టీ బాధ్యతలనుంచి తప్పిస్తూ వస్తోంది. ఇప్పుడిక ఆయనకు మిగిలింది... రాష్ట్ర విభజనతో ప్రాభవం కోల్పోయిన ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల బాధ్యతలు మాత్రమే.

"తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యతల నుంచి దిగ్విజయ్ సింగ్‌ని పార్టీ తప్పించింది. ఆయన స్థానంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జిగా ఆర్.సి.కుంతియాను నియమించింది" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుంతియా ఇప్పటివరకూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఉన్నారు. మరోవైపు కుంతియా స్థానంలో ఏఐసీసీ కార్యదర్శి సతీష్ జర్కోలి కార్యదర్శి ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. కొంతకాలంగా, దిగ్విజయ్‌ను రాష్ట్ర బాధ్యతల నుంచి తప్పిస్తున్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గోవా శాసనసభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినా... ప్రాంతీయ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో దిగ్విజయ్ వైఫల్యం చెందడంపై అధిష్ఠానానికి రుచించలేదు. దీంతో ఆయనను గత ఏప్రిల్ 29న గోవా, కర్ణాటక పార్టీల బాధ్యతల నుంచి తప్పించింది. ఈ క్రమంలోనే... రాష్ట్ర బాధ్యతల నుంచి దిగ్విజయ్‌ను తప్పించాలని తెలంగాణలోని రాష్ట్ర ముఖ్యనేతలతో పాటు పలువురు సీనియర్ నేతలు కూడా అధినాయకత్వానికి ఫిర్యాదులు చేశారు. నిజానికి ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీతో దిగ్విజయ్ సన్నిహితంగా మెలుగుతుంటారు. పైగా, రాహుల్‌కు అధ్యక్ష బాధ్యతలను అప్పగించాలని అధినాయకత్వానికి సలహాలిచ్చే వారిలో ముఖ్యుడు కూడా. అయినాసరే, ఆయనను కీలకమైన తెలంగాణ పార్టీ వ్యవహారాలకు అధిష్ఠానం దూరం పెట్టేసింది! అయితే, దిగ్విజయ్ అక్టోబర్ 1 నుంచి మధ్యప్రదేశ్‌లో 'నర్మదా పరిక్రమణ్ యాత్ర'ను నిర్వహించనున్నందున, ఆయన వినతి మేరకే పార్టీ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించినట్లు కొందరు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కుంతియా చాలా కాలంగా పార్టీ కార్యదర్శి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుండటం, రాష్ట్ర నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆయనను ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జిగా నియమించినట్లు కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

వైదొలగనున్న పనగడియా!

దిల్లీ: 'నీతి ఆయోగ్' వైస్‌ఛైర్మన్ పదవీబాధ్యతల నుంచి వైదొలగేందుకు తనను అనుమతించాలంటూ ప్రధానికి లేఖ రాసినట్లు అరవింద్ పనగడియా(64) మంగళవారం వెల్లడించారు. కొలంబియా విశ్వవిద్యాలయం తన సెలవు పొడిగింపునకు అంగీకరించడం లేదనీ...అందుకే, ఆగస్టు 31వ తేదీకల్లా నీతి ఆయోగ్ విధుల నుంచి వైదొలగేందు కు అనుమతించాలంటూ ప్రధానమంత్రిని అభ్యర్థించినట్లు పునరుద్ఘాటించారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో బోధనను కొనసాగించడానికి... భారత ప్రభుత్వంలో అత్యున్నతస్థాయి పదవులను పరిత్యజించ నిర్ణయించిన ఆర్థికవేత్తల్లో పనగడియా రెండోవారు. భారత రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా పనిచేసిన రఘురామ్ రాజన్ కూడా అమెరికాలో తన అధ్యాపక బాధ్యతలను కొనసాగించడానికి వెళ్లిపోయిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

కాటేసిన కాల'చక్రం'

బాలాపూర్, న్యూస్‌టుడే: చిన్న పొరపాటు..క్షణకాలం ఏమరుపాటు..ముక్కుపచ్చలారని చిన్నారి నిండు ప్రాణం బలితీసుకుంది. బడికి వెళ్తున్న అక్కకు టాటా చెప్పేందుకు వచ్చిన బుడతడు చేసిన చిన్న తప్పిదం అతడి నూరేళ్ల బతుకును చిదిమేసింది. ఓ తల్లికి కడుపుకోత మిగిల్చింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్‌పేట శివహిల్స్ కాలనీకి చెందిన రమేష్ చంపాపేటలోని నారాయణ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఎల్‌కేజీ చదువుతున్న కుమార్తె మోక్ష, కుమారుడు మల్లిక్ (2) ఉన్నారు. మోక్ష అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలోని భారతీయ విద్యాలయకు రోజూ పాఠశాల బస్సులోనే వెళ్తుంది. రోజులాగే మంగళవారం కుమార్తెను బస్సు ఎక్కించేందుకు తల్లి లలిత ఇంటి బయటికొచ్చింది. అక్కకు టాటా చెప్పాలన్న ఉత్సాహంతో మల్లిక్ కూడా బయటికి పరుగుతీశాడు. కుమారుణ్ని గేటు ముందే నిలబెట్టిన తల్లి..కుమార్తెను బస్సు ఎక్కించేందుకు కాస్త ముందుకొచ్చింది. బస్సు ఎక్కించి తిరిగి చూసే లోపే మల్లిక్ బస్సు ముందుకు పరుగుతీశాడు. గమనించని బస్సు డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో ముందు చక్రాల కింద పడ్డాడు. తలకు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లముందే కొడుకు కొనప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ ప్రాణాలొదలడంతో తల్లి తల్లడిల్లింది. ఈ ఘటనపై కేసు నమోదైంది.

వ్యక్తిగత సమాచార పరిరక్షణకు ప్రబలమైన మార్గదర్శకాలు

- ఉండాలన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

దిల్లీ: వ్యక్తుల ప్రైవేటు సమాచారం అందరికీ అందుబాటులోకి వెళ్లకుండా పరిరక్షించడానికి ప్రబలమైన సూత్రాలు, లేదా మార్గదర్శకాలు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారతదేశ జనాభా పరిమాణ విస్తృతి దృష్ట్యా ఇలాంటిది ఉండాలని పేర్కొంది. సమాచారాన్ని ఏ నిర్దిష్ట అవసరం కోసం సేకరించారో దాని నిమిత్తమే వాడేలా చూడాలని చెప్పింది. వ్యక్తిగత గోప్యత హక్కు... ప్రాథమిక హక్కు అవుతుందా లేదా అనే వివాదంపై విచారణ నిర్వహిస్తున్న తొమ్మండుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం వాదనలు ఆలకించి, కొన్ని వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్ నేతృత్వంలోని ఈ ధర్మాసనం బుధవారం కూడా విచారణ కొనసాగించనుంది. గోప్యతను మానవ హక్కుగా గుర్తిస్తూ 1948లోనే భారతదేశం ఒక అంతర్జాతీయ ఒప్పందంపై సంతకాలు చేసిన విషయం వాస్తవమని ధర్మాసనం గుర్తు చేసింది. 'పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లు వంటి వివరాలను ఒక నిర్దిష్ట అవసరం కోసం ఇస్తే వాటిని ఆ అవసరం కోసమే వినియోగించుకుంటారని ఆశించడం సహేతుకమ'ని పేర్కొంది.

చట్టపరమైన రక్షణ ఇప్పటికే ఉంది: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ- గోప్యతకు సంబంధించిన అంశాలకు చట్టపరమైన రక్షణ ఇప్పటికే ఉందని చెప్పారు. గోప్యత అనేదానికి కచ్చితమైన నిర్వచనం లేదనీ, దీనిని ప్రాథమిక హక్కుల విభాగంలో చేర్చాల్సిన అవసరం లేదనీ అన్నారు. వ్యక్తుల కదలికల్ని పసిగట్టడానికి ఆధార్ సంఖ్యను ఉపయోగించుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆధార్ వ్యవస్థలో అనేక రకాలుగా చట్టపరమైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రభుత్వం ఒకవేళ ఎవరిపైనైనా నిఘాకు దీనిని వాడుకోవాలనుకున్నా, న్యాయస్థానం అనుమతించినా కూడా సాధ్యం కాదని వివరించారు.



తాము తయారుచేసిన పర్యావరణహిత పెద్ద రాఖీతో నాగ్‌పూర్ విద్యార్థులు

పాకిస్థాన్ ప్రధానిగా అబ్బాసీ

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా పాకిస్థాన్ ముస్లిం లీగ్(నవాజ్) పార్టీ నేత షాహిద్ ఖాకన్ అబ్బాసీ(58) ఎన్నికయ్యారు. ఆ దేశ జాతీయ అసెంబ్లీలో గురువారం జరిగిన ఓటింగ్‌లో 221 ఓట్లను సాధించిన ఆయన పాక్ 18వ ప్రధానిగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అక్రమాస్తుల వ్యవహారంలో నవాజ్ షరీఫ్‌ను దోషిగా తేల్చి ఆయనపై అనర్హత వేటు వేసిన నేపథ్యంలో షరీఫ్ సోదరుడు ఆ దేశ జాతీయ అసెంబ్లీకి ఎన్నికయ్యేంత వరకూ, అబ్బాసీ ఆపద్ధర్మ ప్రధానిగా పదవిలో కొనసాగుతారు.

వచ్చే జూన్‌నాటికి కాళేశ్వరం పూర్తి

- ఆలోగా విద్యుత్తు పనులు పూర్తికావాలి
- ఇతర ప్రాజెక్టులకూ కలిపి 12వేల మెగావాట్ల విద్యుత్ అవసరం
- మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చే ఏడాది జూన్‌నాటికి పూర్తవుతుందని, ఆలోగా విద్యుత్తు సరఫరా వ్యవస్థల పనులన్నీ పూర్తికావాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రాజెక్టుల పనుల తీరుపై సమీక్షలో మాట్లాడుతూ..కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టులకు 2018 జూన్‌నాటికి 12,500 మెగావాట్ల విద్యుత్తు అవసరమని తెలిపారు. డిసెంబర్‌నాటికి కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆరోప్యాకేజీ పనులు పూర్తవుతాయన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌజులతోపాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని రిజర్వాయర్ల మీదుగా వెళ్తున్న విద్యుత్తులైన్లను తరలించాలని సూచించారు. వచ్చే మార్చిలోగా కాళేశ్వరం పరిధిలో పది ఉపవిద్యుత్తు కేంద్రాలను పూర్తిచేయాలని చెప్పారు. 59విద్యుత్తు టవర్ల ఏర్పాటు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. నీటిపారుదల, విద్యుత్తు శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒక్కోప్రాజెక్టు వద్ద రెండు శాఖలకు చెందినవారితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ..లక్ష్యంలోపే విద్యుత్తు ఉపకేంద్రాలు, పంపిణీ లైన్ల ఏర్పాటు పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు కొరత లేదని, సాగునీటి పథకాలకు కావాల్సినంత సరఫరా చేస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రిజర్వాయర్లపై నుంచి ఉన్న లైన్లను తొలగించే ప్రక్రియ చేపడతామన్నారు.

శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తాం. మొత్తగా ఎస్సారెస్పీకింద 14.5 లక్షల ఎకరాలకు రెండుపంటలకు నీరివ్వాలనేది మా లక్ష్యం. సదర్‌మాట్‌లో ఒకటిన్నర టీఎంసీ నీటిని నిల్వ చేస్తున్నాం. అక్కడ 18 వేల ఎకరాలకు నీరందిస్తాం. ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంచి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తున్నాం. అక్కడ రూ.100 కోట్లతో పనులు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరిచ్చాం. ఈ దఫా ఆరున్నర లక్షల ఎకరాలకు నీరిస్తాం. ఒకవైపు ఉన్న ప్రాజెక్టుల స్థిరీకరణ, నవీకరణకు కృషిచేస్తూనే కొత్త ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం.' అని వెల్లడించారు.

రైతు క్షేమమే ధ్యేయంగా: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ వ్యవసాయానికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తున్నారని మరో సందర్భంలో హరీశ్‌రావు తెలిపారు. మిషన్ కాకతీయతో ఆయకట్టు భారీగా పెరిగిందని, రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 54లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగినా..గింజ వదలకుండా కొన్నామని వివరించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.7 వేల కోట్లు చెల్లించామన్నారు.

లష్కరే అగ్ర నేత హతం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌వోజీ పోలీసులు ఆ ఇంటి ప్రాంగణంలోకి ప్రవేశించి, ఆరుగురు పౌరులను రక్షించారు. చివరికి భద్రతా దళాల ఆపరేషన్‌లో దుజానా, అతడి సహాయకుడు హతమయ్యారు. మంగళవారం ఉదయం 6.30గంటల సమయంలో ఆపరేషన్ ముగిసిందని పోలీసులు తెలిపారు. దుజానా ఉన్న ఇంటిని పేల్చేసినట్లు తెలుస్తోంది. తాను కరాచీ నుంచి వచ్చినట్లు ఆ ఇంట్లోని వారికి దుజానా చెప్పాడని అధికారులు వివరించారు. దుజానాకు దక్షిణ కశ్మీర్‌లో భద్రతా దళాలు, రాజకీయ నేతలపై జరిగిన అనేక ఉగ్రవాద దాడులతో సంబంధం ఉంది. అతడి తలపై రూ.15 లక్షల నజరానా ఉంది.

రాళ్ల వర్షం..

భద్రతా దళాల ఆపరేషన్ కొనసాగుతుండగా.. దాదాపు వంద మందికిపైగా ఆందోళనకారులు వచ్చి, రాళ్లు రువ్వడం మొదలుపెట్టారు. సైనిక చర్యకు ఆటంకం కల్పించేందుకు ప్రయత్నించారు. వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలు, పెల్లెట్లు ప్రయోగించారు. కాల్పులు కూడా జరిపారు. ఇందులో ఫిర్దౌస్ అహ్మద్ అనే వ్యక్తి చనిపోగా, పలువురు గాయపడ్డారు. భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పుల్లో చిక్కుకుపోవడం వల్లే ఫిర్దౌస్ చనిపోయాడని పోలీసులు తెలిపారు. మరోపక్క శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుజాగ్రత్త చర్యగా దక్షిణ కశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. లోయలోని మిగతా చోట్ల నెట్ వేగాన్ని గణనీయంగా తగ్గించారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మూసివేశారు.

పరారీలో దిట్ట

26 ఏళ్ల దుజానా.. కశ్మీర్‌లోని లష్కరే తొయిబాకు అధిపతి. పుల్వామా జిల్లాలోని గ్రామాల నుంచి అతడి కార్యకలాపాలు ఉంటాయి. ఇతడి స్వస్థలం.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భాగంగా ఉన్న గిల్గిత్ బాల్టిస్థాన్. 17 ఏళ్ల వయసులో అతడు లష్కరే తొయిబాలో చేరాడు. 2010లో కశ్మీర్ లోయలోకి చొరబడ్డాడు. తొలుత ఉత్తర కశ్మీర్‌లో క్రియాశీలంగా వ్యవహరించేవాడు. ఆ తర్వాత తన అడ్డాను దక్షిణ కశ్మీర్‌కు మార్చాడు. 2015లో లష్కరే తొయిబా అగ్ర కమాండర్ అబు ఖాసింను భద్రతా దళాలు కాల్చి చంపడంతో, అతడికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న దుజానాను ఆ స్థానానికి ఎంపిక చేశారు. అప్పటి నుంచి అతడిపై భద్రతా దళాలు నిఘా పెట్టాయి. అతడిని పట్టుకోవడానికి డజనుకుపైగా దాడులు, ఆపరేషన్లు చేపట్టాయి. అయితే ప్రతిసారి చివరి నిమిషంలో తప్పించుకునేవాడు. అతడు తెలివైన ఉగ్రవాదని కొందరు అధికారులు చెబుతుంటారు. భద్రతా వలయం నుంచి తప్పించుకుపోవడంలో దిట్టని పేర్కొంటారు. రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారుల సాయంతో గత ఏడాది మేలో అతడు చివరిసారిగా తప్పించుకున్నాడు. లష్కరే అగ్రనాయకత్వంతో అతడికి విభేదాలు వచ్చాయని, దీంతో అతడు దక్షిణ కశ్మీర్ కేంద్రంగా పనిచేసే జకీర్ మూసాకు అతడు సన్నిహితుడయ్యాడని పోలీసులు చెప్పారు. మూసా.. హిజ్బుల్ ముజాహిదీన్‌తో విడిపోయి, అల్‌ఖైదాలో చేరాడు. దుజానాకు అబు ఇస్మాయిల్ అనే మరో ఉగ్రవాద నాయకుడికి మధ్య ఆధిపత్య పోరు ఉందని, దాని కారణంగానే ఇటీవల అమర్‌నాథ్ యాత్రికులపై దాడి జరిగిందన్న వాదన ఉంది. గత ఏడాది హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వనీని భద్రతా దళాలు హతమార్చాక.. జరిగిన పలు నిరసన ప్రదర్శనల్లో ముఖానికి మాస్క్ వేసుకొని దుజానా పాల్గొన్నాడు. బుర్హాన్ అంత్యక్రియలకూ హాజరయ్యాడని చెబుతారు.

ఎ++ ఉగ్రవాది

దక్షిణ కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాద నాయకులతో ఇటీవల సైన్యం ఒక జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో దుజానా కూడా ఉన్నాడు. ఇతడిని ఎ++ శ్రేణి ఉగ్రవాదిగా పేర్కొన్నారు. ఉగ్రవాదులను వారి దుశ్చర్యల ఆధారంగా 'ఎ', 'ఎ++'గా వర్గీకరించారు. అత్యంత కరుడుగట్టిన ముష్కరులను ఎ++ జాబితాలో పెడతారు. ఈ ప్రాంతంలో క్రియాశీలంగా ఉన్న 12 మంది ఉగ్రవాదులతో ఈ ఏడాది మేలో ఈ జాబితాను సైన్యం రూపొందించింది. వీరిలో లష్కరే, హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ సభ్యులు ఉన్నారు. గత ఏడాది హతమైన బుర్హాన్ వనీ కూడా ఎ++ ఉగ్రవాదే. ఈ జాబితాలోని వారిపై రూ.10 లక్షలకుపైగా నజరానా ఉంటుంది. నిఘాను పెంచడం ద్వారా ఈ ఏడాది భద్రతా దళాలు కశ్మీర్ లోయలో 110 మందికిపై ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. దుజానాను హతమార్చిన నేపథ్యంలో ఇప్పుడు భద్రతా దళాల దృష్టి లష్కరే కొత్త కమాండర్ అబు ఇస్మాయిల్ మీద పడింది. ఇటీవల అమర్‌నాథ్ యాత్రికులపై దాడి వెనకు ఇతడికి పాత్ర ఉంది. ఇతడితోపాటు అబు ఖాసిమ్ సోదరుడు అబ్దుల్ రెహ్మాన్‌పైనా సైన్యం దృష్టి పెట్టింది. ఇటీవలే ఇతడు లోయలోకి చొరబడ్డాడు.

మహిళా అధ్యాపక పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో 546 మహిళా అధ్యాపక పోస్టుల భర్తీకి అడ్డంకి తొలగింది. ఈ నియామకాలకు సంబంధించి జులై 30న జరగాల్సిన పరీక్షపై హైకోర్టు సింగిల్ జడ్జీ విధించిన 'స్టే'ను ధర్మాసనం ఎత్తివేసింది. ఈ పోస్టుల భర్తీ అంశం తాము ఇవ్వబోయే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. పలు తీర్పులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో పోస్టులను మహిళలకే కేటాయించడం రాజ్యాంగ విరుద్ధం కాదని అభిప్రాయం వ్యక్తంచేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో మహిళా అభ్యర్థులతో 546 అధ్యాపక పోస్టుల భర్తీ నిమిత్తం ఈ ఏడాది జూన్ 2న టీఎస్‌పీఎస్సీ జారీచేసిన ప్రకటనను సవాలు చేస్తూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన ఎస్.వెంకటనర్సింహ గౌడ్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. మొత్తం పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేయాలని నిర్ణయించడం పురుష అభ్యర్థుల పట్ల వివక్షత చూపడమేనన్నారు. జులై 30న జరగాల్సిన పరీక్ష నిర్వహణపై స్టే విధించాలని కోరారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు సింగిల్ జడ్జి.. పరీక్ష నిర్వహణను నిలుపుదల చేస్తూ జులై 17న మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. దీన్ని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మరో ఇద్దరు హైకోర్టులోని ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేశారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పోస్టులను ఎవరితో భర్తీ చేయాలనే వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమన్నారు. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ఇచ్చిన తీర్పులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సింగిల్ జడ్జీ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలుపుదల చేసింది.

పూర్తయిన మత్తుమందుల విచారణ

(మొదటి పేజీ తరువాయి)

జరిపినట్లు తేలడంతో విచారణకు పిలిచారు. వీటితో తనకు ఎలాంటి సంబంధం లేదని నందు స్పష్టం చేసినట్లు సమాచారం. పది గంటల సమయంలో ఆబ్కారీ కార్యాలయానికి వచ్చిన ఆయన అదే ప్రాంగణంలో ఉన్న దేవాలయానికి వెళ్లి ప్రదక్షిణలు చేయడం గమనార్హం. విచారణకు హాజరైన వారిలో ఆలయాన్ని సందర్శించింది నందు ఒక్కరే.

మళ్లీ యథాతథస్థితి

మాదకద్రవ్యాల కేసులో సినీ పరిశ్రమకు చెందిన వారిని విచారించడంతో ఆబ్కారీ కార్యాలయం వద్ద గత 12 రోజులుగా సందడి నెలకొంది. సినీ అభిమానుల తాకిడి ఉంటుందన్న ఉద్దేశంతో ఆబిడ్స్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున మీడియా ప్రతినిధులు తరలిరావడంతో కార్యాలయ ప్రాంగణం హడావిడిగా మారింది. దీంతో ఎవర్నీ లోనికి వెళ్లనీయకుండా ఆంక్షలు విధించారు. ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. 12 మంది విచారణ పూర్తి కావడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ యథాతథ స్థితి నెలకొంది.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ తీర్పులు

ఈనాడు, హైదరాబాద్: వివిధ అంశాలకు సంబంధించి మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చే తీర్పుల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తీర్పుల వివరాలు ఆన్‌లైన్‌లో చేర్చడంతో పాటు అవసరమైన వాటికి ఉత్తర్వులు జారీ చేయించాలని భావిస్తోంది. భూవివాదాలు, పాలనాపర అంశాలు, ఉద్యోగులకు సంబంధించిన క్రమశిక్షణ చర్యలు, ఇతర అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులకు వినతులు (అప్పీళ్లు) వస్తుంటాయి. ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, వాణిజ్యపన్నులు, ఆబ్కారీ అధికారులు, కార్మిక, పురపాలకానికి సంబంధించి ఎక్కువగా ఉంటాయి. వీటిని పరిశీలించి నిర్ణయం తీసుకునే విచక్షణాధికారం మంత్రులు, అధికారులకు ఉంటుంది. వీరి నిర్ణయాల సమాచారం బహిర్గతం కావడం లేదు. తీర్పుల ప్రతులను నేరుగా వినతిదారులకు ఇస్తున్నారు. అస్మదీయులకు అనుకూలంగా తీర్పులిస్తున్నారని, పైరవీలు నడుస్తున్నాయని, ఇతర అభియోగాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల తీర్పుల అంశాన్ని సమీక్షించారు. వీటిలో గోప్యత వద్దని, తీర్పులెలా వచ్చాయో ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ఇందుకు రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది. రెవెన్యూ శాఖలో ముందుగా దీనిని ప్రారంభించి, తర్వాత అన్ని శాఖలకూ విస్తరిస్తారు.

- ప్రతితీర్పునూ ఆంగ్లంలో ఆన్‌లైన్‌లో ఉంచుతారు. ముమ్ముందు తెలుగులోనూ ఈ సౌకర్యం కల్పిస్తారు.
- తీర్పు కాపీలు కావాలంటే ఎవరైనా పొందవచ్చు.
- ముఖ్యమైన తీర్పులకు విధిగా ఉత్తర్వు (జీవో)లను జారీ చేస్తారు.

గ్రహం అనుగ్రహం

2-8-2017 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
దశమి: మ. 2-29 తదుపరి ఏకాదశి
అనూరాధ నక్షత్రం: సా. 4-33 తదుపరి జ్యేష్ఠ
అమృతఘడియలు: ఉ. 6-50 వరకు
వర్జ్యం: రా. 10-41 నుంచి 12-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-42 నుంచి 12-33 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-42; సూర్యాస్తమయం: సా. 6-30

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	22.8	34.1
నిజామాబాద్	24.0	33.0
హన్మకొండ	24.0	33.0
కరీంనగర్	24.0	36.0
మహబూబ్‌నగర్	24.1	34.0
హైదరాబాద్	24.8	33.4
ఖమ్మం	26.0	34.0
సూర్యాపేట	27.0	37.5

ఆవహించిన వివాదం

- మళ్లీ తెరమీదకు 'జన్యు మార్పిడి' పంటల వివాదం
- జీఎం ఆవాల సాగుపై త్వరలో కేంద్రం నిర్ణయం
- వ్యతిరేకిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వైద్య నిపుణులు



జన్యుమార్పిడి (జీఎం) ఆహార పంటల వ్యవహారం మరోసారి తెరమీదకు వచ్చింది. జన్యు మార్పిడి చేసిన ఆవాల సాగుకు అనుమతించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో జీఎం పంటలకు అనుకూల, వ్యతిరేక వర్గాల్లో ఇది పెద్ద చర్చనీయాంశం అయింది. ఎంతోకాలంగా జీఎం పంటలను మనదేశంలో అనుమతించవద్దని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తూ వచ్చింది. ఇంతవరకూ ఏ ఒక్క ఆహార పంట విషయంలోనూ జన్యు మార్పిడికి అనుమతి ఇవ్వలేదు. వంగ, బెండ, వరి, ఆవాలు... తదితర ఆహార పంటల జన్యు మార్పిడి పరిజ్ఞానం ప్రయోగశాల నుంచి బయటకు రాలేదు. ఆవాల సాగు విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇంతవరకూ స్పష్టం కానప్పటికీ ఒకవేళ అనుమతిస్తే న్యాయపోరాటం చేయటానికి పలు సంస్థలు సిద్ధపడుతున్నాయి.

ఇప్పటి వరకూ పత్తి సాగు మాత్రమే..

ప్రధానంగా వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థ కావటంతో జీఎం పంటలను అనుమతిస్తే వ్యవసాయ రంగానికి కోలుకోని నష్టం జరుగుతుందనే ఆందోళనలు మనదేశంలో ఉన్నాయి. ఇప్పటి వరకూ జన్యు మార్పిడి చేసిన పత్తి సాగుకు మాత్రమే మనదేశంలో అనుమతి ఉంది. ఇది వాణిజ్య పంట. కానీ ఇలాంటి ఆహార పంటల సాగుకు అవకాశం లేదు. కొన్నేళ్ల క్రితం వంకాయ సాగును అనుమతించేందుకు దాదాపు రంగం సిద్ధం అయింది. కానీ కొన్ని ఒత్తిళ్ల వల్ల నిలిచిపోయింది. ఇప్పుడు ఆవాల వంతు వచ్చింది. జన్యుమార్పిడి చేసిన ఆవాల సాగును అనుమతించే అంశంపై నెలన్నర రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది.

క్షేత్ర స్థాయి పరీక్షలు

జన్యుమార్పిడి చేసిన ఆహార పంటల సాగుకు అనుమతి లేనప్పటికీ పలు ఆహార పంటల జన్యు మార్పిడి విషయంలో మనదేశంలో పెద్దఎత్తున ప్రయోగాలు సాగుతున్నాయి. అంతేకాక కొన్ని జీఎం పంటలపై క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో వరి, టమోటా, బెండ తదితర పంటలు ఉన్నాయి.

అనుకూల వాదనలు

- జీఎం పంటలు దశాబ్దానికి పైగా వివిధ దేశాల్లో సాగులో ఉన్నాయి. చైనా, బ్రెజిల్ ఎన్నో ఏళ్లుగా ఈ తరహా పంటలు పండిస్తున్నాయి. ఆహార భద్రత సాధించాలంటే జీఎం పంటలను అనుమతించటమినహా మరోమార్గం లేదనే అభిప్రాయం ఉంది.
- సాధారణ వంగ పంటను చీడపీడల నుంచి కాపాడటానికి ఎన్నో దఫాలుగా క్రిమి సంహార మందులు చల్లాలి. ఈ మందుల్లో కొంతభాగం వంకాయల్లో చేరుతుంది. వాటిని తిన్న వారి శరీరంలోకి మందులు కూడా వెళ్లిపోతాయి. ఇలా క్రిమిసంహారక మందులతో కూడిన వంకాయలు తినేబదులు కొద్దిగా జన్యు మార్పిడి చేసిన వంకాయలు తినటం వల్ల ఇబ్బంది ఉండదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు.

వ్యతిరేకించే వారు ఎందరో...

- జీఎం పంటలకు వ్యతిరేకంగా గట్టిపోరాటం చేస్తున్న సంస్థ గ్రీన్‌పీస్. జన్యు మార్పిడి పంటల వల్ల సత్ఫలితాలు రాకపోగా రైతులు అప్పుల్లో కూరుకుపోతారని ఈ సంస్థ ఆరోపిస్తోంది.
- విత్తనాలపై రైతులు హక్కులు కోల్పోతారని, బహుళ జాతి కంపెనీల పెత్తనం ఎక్కువైపోతుందని కొందరు శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు.
- జన్యుమార్పిడి పంటల సాగు ప్రారంభించిన తర్వాత వాటిని వెనక్కు తీసుకోవటం సాధ్యం కాదని నిపుణులు మరికొందరు విశ్లేషిస్తున్నారు.

అనుమతి వద్దే వద్దు..

జన్యుమార్పిడి చేసిన ఆవాల సాగుకు అనుమతి ఇచ్చే అంశం చర్చనీయాంశమైన నేపథ్యంలో వైద్య నిపుణుల తరఫున డాక్టర్ మైరా శివ దీన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. జన్యుమార్పిడి చేసిన ఆవాల సాగును అంగీకరించరాదని ఆయన సూచించారు. జీఎం పంటలతో ప్రత్యేకంగా ఒనగూడే ప్రయోజనాలు లేకపోగా దీనివల్ల ఎన్నో సవాళ్లు, ఇబ్బందులు ఉన్నాయని.. చూస్తూచూస్తే వాటిని ఆహ్వానించటమెందుకని ప్రశ్నించారు. జీఎం ఆహారం తీసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని, రోగ నిరోధక శక్తి క్షీణిస్తుందని, అలర్జీ సర్వసాధారణం అవుతుందని, శరీర అవయవాలు పాడవుతాయని పేర్కొన్నారు. ఈ లేఖపై కేంద్ర ఆరోగ్యశాఖ మాజీమంత్రి డాక్టర్ అంబుమణి రాందాస్, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ వైస్‌ఛాన్సలర్ పద్మభూషణ్ డాక్టర్ బిఎం హెగ్డే, ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ లలిత్ నాథ్, భారత వైద్య మండలి సభ్యుడు డాక్టర్ హెచ్.ఎన్.రవీంద్ర తదితరులు సంతకాలు చేశారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

తొలి జీఎం ఆహార పంట ఆవాలు అవుతుందా?



- జన్యు మార్పిడి పంటలను అనుమతించే అంశంలో మనదేశంలో దాదాపు రెండు దశాబ్దాలుగా చర్చలు, అనుకూల ప్రతికూల వాదనలు ఉన్నాయి.
- జన్యుమార్పిడి చేసిన పత్తి.. (బీటీ పత్తి) సాగుకు కేంద్ర ప్రభుత్వం 2002 లో అనుమతి ఇచ్చింది. తర్వాత ఏటేటా బీటీ పత్తి సాగు పెరుగుతూ వచ్చింది. దేశవ్యాప్తంగా 90 శాతానికి పైగా సాగు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పత్తి అధికంగా పండిస్తున్న దేశాల్లో మనది రెండో స్థానం.
- మనదేశంలో జీఎం పంటలను అనుమతించే అధికారం ఉన్న సంస్థ జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ). కేంద్ర ప్రభుత్వ పర్యావరణ- అటవీ మంత్రిత్వ శాఖ సారథ్యంలో ఇది పనిచేస్తుంది. ఈ కమిటీ 2007లో జీఎం వంకాయ సాగు చేయటానికి పచ్చజెండా ఊపింది. కానీ శాస్త్రవేత్తల్లో ఏకాభిప్రాయం లేకపోవటం, ఇతర అవాంతరాల వల్ల ఇది కార్యరూపం దాల్చలేదు.
- జన్యుమార్పిడి చేసిన డీఎంహెచ్-11 అనే జీఎం రకం ఆవాలను దిల్లీ విశ్వవిద్యాలయం లోని పంటల జన్యు మార్పిడి కేంద్రం (సీజీఎంసీపీ) అభివృద్ధి చేసింది. దీన్ని 'ఆహార రంగ జీవ వైవిధ్యానికి సురక్షితమేనని' ఈ ఏడాది మే నెలలో జీఈఏసీ స్పష్టం చేసింది.
- ఇక దీన్ని సాగు చేసేందుకు అనుమతించే విషయంలో కేంద్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం. ఒకవేళ అనుమతి వస్తే మనదేశంలో తొలి జీఎం ఆహార పంటగా ఆవాలు గుర్తింపు లభిస్తుంది.
- పర్యావరణ, ఆహార భద్రతా ప్రమాణాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే జీఎం పంటల సాగుకు అనుమతి ఇచ్చే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని కేంద్రమంత్రి వైఎస్ చౌదరి గతనెల 31న రాజ్యసభలో స్పష్టం చేశారు. మనుషులకు, జంతుజాలానికి నష్టం చేసేది అయితే జీఎం పంటలను ఆమోదం తెలిపే అవకాశం లేదని పేర్కొన్నారు.

ఇతర దేశాల్లో...

- జీఎం పంటల సాగు కొన్ని దేశాల్లో 1996లో మొదలైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 28 దేశాల్లో జీఎం పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అభివృద్ధి చెందిన దేశాలు అధికంగా ఉన్నాయి. ఈ దేశాల్లో దాదాపు 45 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో జీఎం పంటలు సాగు అవుతున్నాయి. అమెరికాలో అత్యధికంగా 17 కోట్లకు పైగా ఎకరాల్లో జీఎం పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు అవుతున్నాయి. తర్వాత స్థానాల్లో బ్రెజిల్, అర్జెంటీనా, భారత్ (పత్తి సాగు), కెనడా, చైనా, పరాగ్వే, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, ఉరుగ్వే, ఫిలిప్పీన్స్ ఉన్నాయి.
- జీఎం పంటల్లో సింహభాగం సోయా, మొక్కజొన్న, పత్తి పంటలదే. వీటి వాటా దాదాపు 50 శాతం ఉంటుంది.
- తెగుళ్లను తట్టుకోవటం, చీడ పీడల నుంచి రక్షణ పొందటం ఈ పంటల్లో జన్యు మార్పిడి ప్రధాన లక్ష్యం.
- అదే సమయంలో 38 దేశాలు జీఎం పంటల సాగుపై పూర్తి నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. పర్యావరణం, ప్రజారోగ్యానికి హాని కలుగుతుందనే అభిప్రాయం ఈ దేశాల్లో ఉంది.
- జీఎం పంటల సాగును నిషేధించటంతో పాటు, జీఎం ఆహారోత్పత్తులను సైతం రష్యా అనుమతించటం లేదు.
- పలు ఐరోపా దేశాలు జీఎం పంటల సాగుపై నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కానీ జంతు ఆహారం కోసం జీఎం ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తున్నాయి. 'ఐరోపా యూనియన్' దేశాలు ఏటా 3 కోట్ల టన్నులకు పైగా మొక్కజొన్న, సోయా దిగుమతి చేసుకుంటున్నాయి.
- వివిధ దేశాల్లో జీఎం పంటలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవటంతో రాజకీయ ఒత్తిళ్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

'నాగర్‌దొడ్డి' అక్రమార్కులపై చర్యలకు ప్రభుత్వం దృష్టి

బయటపడేందుకు పలువురి ప్రయత్నాలు

ఈనాడు, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా జూరాల ముంపు గ్రామం నాగర్‌దొడ్డిలో లేని నిర్మాణాలను ఉన్నట్లు చూపి పరిహారం కాజేసేందుకు యత్నించిన వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. మరోవైపు కొందరు ఆ చర్యలనుంచి బయటపడేందుకు తమదైన శైలిలో యత్నిస్తున్నట్లు ఆయాశాఖల్లో ప్రచారం జరుగుతోంది. ధరూర్ మండలంలోని ఈ గ్రామంలో జూరాల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం నుంచి 100మీటర్ల పరిధిలో భూసేకరణకు బదులు పరిధిని మార్పు చేసి పరిహారం పెరిగేలా నీటిపారుదల, రెవెన్యూశాఖలకు చెందిన కొందరు అధికారులు కుమ్మక్కుకావడం సంచలనం సృష్టించింది. దీనిపై ఉమ్మడి రాష్ట్రంలోనే ఆరోపణలురాగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మంత్రి హరీశ్‌రావు విచారణ కమిటీ వేశారు. ఇటీవలే కమిటీ నివేదిక ఇవ్వగా చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. నాడు ఎస్ఈతోపాటు ఈఈ, డీఈఈ, ఏఈలుగా ఉన్న వారి పాత్రలు కమిటీ విచారణలో బయటపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ అధికారుల్లో ఒకరు సీఈగా, మిగిలినవారిలో కొందరు ఈఈలు, డీఈఈల స్థానాల్లో ఉన్నారు. కొద్దిరోజుల క్రితమే అక్రమాలపై చర్యలకు నివేదించిన దస్త్రం ప్రభుత్వానికి చేరినప్పటికీ ముందుకు కదలకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో చర్యల నుంచి బయటపడేందుకు కొందరు సాధ్యమైనన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



వరంగల్‌లో నిర్వహించిన 'లక్ష పిడికిళ్లు, లక్ష నినాదాలు' సభలో పిడికిలి బిగించి గళమెత్తిన ఆటోడ్రైవర్లు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

'లక్ష పిడికిళ్లు, లక్ష నినాదాలు' సభలో మంత్రి మహేందర్‌రెడ్డి

జులైవాడ(వరంగల్) న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి తెరాస ప్రభుత్వం కృషి చేస్తుందని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం వరంగల్‌లో 'లక్ష పిడికిళ్లు, లక్ష నినాదాలు'పేరుతో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ అధ్యక్షతన ఆటో డ్రైవర్ల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లందరూ ఆగస్టు 1న ప్రత్యేక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఆటోడ్రైవర్లందరూ ఉద్యమంలో పాల్గొని సహకరించారని, ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం రూ.52కోట్ల పన్నులు రద్దు చేశారని తెలిపారు. ఆటోడ్రైవర్లందరికీ రెండు పడకగదుల ఇళ్లు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. బస్సుస్టేషన్లలో ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, శంకర్‌నాయక్, ఆరూరి రమేష్, వికలాంగుల సహకారసంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, గొర్రెల మేకల అభివృద్ధి సంస్థ రాజయ్యయాదవ్ మాట్లాడారు. గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ..ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వారికి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలంటూ 11డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టి మంత్రికి అందజేశారు.

నితీశ్ నమ్మక ద్రోహి: లాలూ ప్రసాద్

భాజపా, నీతీశ్‌పై ఆరోపణలు

పాట్నా: మహాకూటమిని ముక్కలు చేసి నీతీశ్ కుమార్ నమ్మకద్రోహం చేశారని మంగళవారం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ విమర్శించారు. భాజపా, నీతీశ్‌కుమార్ మధ్య రహస్య ఒప్పందం జరిగి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిందని ఆయన ఆరోపించారు. నీతీశ్ అవకాశవాదని, ఒకవేళ తేజస్వీ యాదవ్ రాజీనామా చేసినా భాజపాతో కలిసి మహాకూటమిని చీల్చడానికే మొగ్గు చూపేవారని అన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో ప్రధాని మోదీకి పెద్దగా సవాలు ఎదురుకాదని నీతీశ్ వ్యాఖ్యానించారని, ఈ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా నిలవాల్సిన ఆయన మోదీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ఆయన ఎదుట మోకరిల్లారని ఎద్దేవా చేశారు. మోదీకి పోటీగా తాము మరో అభ్యర్థిని నిలుపుతామన్నారు. నీతీశ్ నాయకుడిగా ఎదగడానికి కారణమైన జేడీ(యూ) సీనియర్ నాయకుడు శరద్‌యాదవ్‌ను తక్కువ చేసి చూస్తున్నారని ఆరోపించారు.

ఏసీ బోగీల్లో ఇక రగ్గులు ఉండవు!

దిల్లీ: రైళ్లలో ఏసీ బోగీల్లో ప్రయాణికులకు సరఫరా చేసే రగ్గులను ఎత్తివేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. బోగీల్లో ఉష్ణోగ్రత నియంత్రించడం ద్వారా ప్రయాణికులు రగ్గులు కప్పుకునే అవసరం లేకుండా చేయాలని చూస్తోంది. సాధారణంగా ఏసీ బోగీల్లో 19 డిగ్రీ సెల్సియస్‌ల ఉష్ణోగ్రత ఉంటుంది. దాన్ని 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్‌ల వరకు పెంచి ప్రయాణికులకు చలి లేకుండా చూడాలని రైల్వే శాఖ భావిస్తోంది. రైళ్లలో ఏసీ బోగీల్లో రగ్గులు అపరిశుభ్రంగా ఉంటున్నాయని ఇటీవల 'కాగ్' (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఆక్షేపించిన నేపథ్యంలో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో రగ్గులను ఉతికే పని ఉండదు, రైల్వేకు ఖర్చు కూడా కలిసి వస్తుంది. ఒక రగ్గును శుభ్రం చేయడానికి రూ.55 ఖర్చవుతుండగా, ప్రయాణికుల నుంచి రూ.22 వసూలు చేసేవారు. తాజా విధానం అమల్లోకి వస్తే రైల్వేకు ఆర్థికంగా లాభం చేకూరుతుంది. ఏసీ బోగీల్లో రగ్గులను నిషేధించే విధానం ప్రయోగాత్మకంగా 'దిల్లీ-జమ్ము మెయిల్'లో ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రగ్గుల నిషేధంపై ప్రయాణికుల అభిప్రాయాలను మంత్రిత్వ శాఖ తెలుసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా ప్రయాణికులు రగ్గులు కావాలనుకుంటే బోగీలో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ప్రతిస్పందనను బట్టి మిగిలిన అన్ని రైళ్లలో ప్రవేశపెట్టాలని రైల్వే మంత్రిత్వ శాఖ భావిస్తోంది.

ఆధార్ ద్వారా వ్యక్తుల కదలికల్ని అనుసరించడం అసాధ్యం

సుప్రీంకోర్టుకు తెలిపిన ఉడాయ్

దిల్లీ: వ్యక్తుల కదలికల్ని పసిగట్టడానికి ఆధార్‌ను ఉపయోగించుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) స్పష్టం చేసింది. గోప్యతను ఒక ప్రాథమిక హక్కుగా భావించి అనేకానేక జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపింది. ఆన్‌లైన్ శకంలో ఏదీ ఏకాంతం కాదని పేర్కొంది. 9 మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి ఉడాయ్ మంగళవారం ఈ మేరకు తెలిపింది. ఆధార్ వ్యవస్థలో అనేక రకాలుగా చట్టపరమైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రభుత్వం ఒకవేళ ఎవరిపైనైనా నిఘాకు దీనిని వాడుకోవాలనుకున్నా, న్యాయస్థానం అనుమతించినా కూడా సాధ్యం కాదని వివరించింది. గోప్యత అనేది ప్రాథమిక హక్కు కిందికి వస్తుందా రాదా అనే అంశంపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

భద్రాద్రి ఆలయ అభివృద్ధి తుది నమూనా సిద్ధం

ఈనాడు - హైదరాబాద్

భద్రాద్రి ఆలయ అభివృద్ధి తుది నమూనా సిద్ధమైంది. ఆలయాన్ని యాదాద్రి దేవాలయం తరహాలో అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు ఆర్కిటెక్ ఆనంద్ సాయి అభివృద్ధి నమూనాలను రూపొందించారు. వాటిలో ఆగమశాస్త్రం ప్రకారం లేని వాటిని, ఇతరత్రా చేర్పులను ఆలయ వేద పండితుల సూచనలతో ఆర్కిటెక్ తుది నమూనాలో పొందుపరిచారు. తుదిదశలో ఖరారైన నమూనాను మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాద్రి ఆలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్, వేద పండితులు చినజీయర్ స్వామికి చూపించారు. ఈ సందర్భంగా ఆయన నమూనాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నమూనాలో ఉన్న మూడు ప్రాంగణాల్లో మొదటి ప్రాంగణాన్ని రాతి కట్టడంతో నిర్మించాలని, రెండు, మూడు ప్రాంగణ నిర్మాణాలకు ఇటుకలనైనా వినియోగించవచ్చని చినజీయర్ స్వామి సూచించారు. తుది నమూనా అద్భుతంగా ఉందంటూ దానిపై తన సందేశం రాసి సంతకం చేశారు. యాదాద్రి తరహాలో భద్రాద్రిని దేవాలయ నగరంగా మార్చాలన్న సీఎం ఆదేశాల మేరకు శరవేగంగా భద్రాద్రి బృహత్ ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. తుది నమూనా ఖారురు కాగానే చినజీయర్ స్వామి సలహా తీసుకోవాలన్న సీఎం కేసీఆర్ సూచనల మేరకు మంగళవారం స్వామిని కలిశామని, స్వామి సంతృప్తి వ్యక్తం చేయడం సంతోషకరమని అన్నారు. దేవాలయ పునర్‌నిర్మాణం ఆగమశాస్త్రం ప్రకారం చేస్తుండటంతో మాఢ వీధుల నిర్మాణంలో కొందరు ఇళ్లు కోల్పోతున్నారని, వారికి మెరుగైన పరిహారం ఇవ్వాలని ఆలయ ఈవోను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. తుది నమూనాను ముఖ్యమంత్రికి పంపాలని ఆర్కిటెక్, అధికారులకు సూచించామన్నారు. సీఎం ఆమోదం తర్వాత టెండర్లు ఖరారు చేసి, ఆలయ అభివృద్ధి పనులకు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తుమ్మల తెలిపారు.



ఆలయ తుది నమూనాను పరిశీలిస్తున్న చినజీయర్ స్వామి. చిత్రంలో మంత్రి తుమ్మల తదితరులు

మరో 700 ఎకరాల అన్యాక్రాంతంపై ప్రమాణపత్రం దాఖలు చేయండి

- మియాపూర్ భూ కుంభకోణంపై పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మియాపూర్ భూ కుంభకోణానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలతో అదనపు ప్రమాణపత్రం(అఫిడవిట్) దాఖలు చేయాలని ఉమ్మడి హైకోర్టు మంగళవారం పిటిషనర్, భాజపా అధికార ప్రతినిధి ఎం.రఘునందన్‌రావును ఆదేశించింది. భూకుంభకోణం కేవలం 693 ఎకరాలకే పరిమితం కాలేదని, 14 గ్రామాల్లో మరో 700 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఆధారాలున్నాయని పిటిషనర్ చెప్పడంతో వాటన్నింటినీ ప్రమాణపత్రం రూపంలో తమ ముందుంచాలన్నధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 8వ తేదీకి వాయిదా వేసింది.

మియాపూర్ భూ కుంభకోణంలో ప్రముఖుల పాత్ర ఉందని, విచారణలో రాజకీయ జోక్యానికి అవకాశమున్నందున దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ రఘునందన్‌రావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి, మియాపూర్ గ్రామాల్లో ప్రభుత్వానికి చెందిన 693 ఎకరాల భూమి ఇతరుల పేరుతో రిజిస్టర్ అయిందన్నారు. ఈ విషయమై మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. దర్యాప్తు పురోగతిలో ఉందని, ఇప్పటికే బాధ్యులైన సబ్‌రిజిస్ట్రార్‌లను అరెస్ట్ చేయడంతోపాటు రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసినట్లు ధర్మాసనానికి చెప్పారు. పిటిషనర్ రఘునందన్‌రావు వాదనలు వినిపిస్తూ..హాఫీజ్‌పేటలోని సర్వే.నెం. 77లో మరో 700 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, ఈ కుంభకోణం మియాపూర్, శేరిలింగంపల్లిలకే పరిమితం కాకుండా మరో 14 గ్రామాలకూ పాకిందని, సంబంధిత వివరాలు ఆధారాలతో సహా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వాటన్నింటినీ ప్రమాణపత్రం రూపంలో తమ ముందుంచితే ప్రతివాదులకు నోటీసులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ప్రతివాదులుగా చేర్చండంటూ: ఈ అంశంలో తమను ప్రతివాదులుగా చేర్చుకోవాలని కోరుతూ వి.కృష్ణారెడ్డి, బి.శివరామకృష్ణ మరో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఈ వివాదానికి వర్తించవని, వీటన్నింటిపై తమ వాదనలు వినిపించాలనుకుంటున్నామని వారి తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ అవసరమైతే ఇందులో వాదనలు వింటామని పేర్కొంది.

వంట గ్యాస్ సిలిండర్ రూ.2 మేర ప్రియం

దిల్లీ: రాయితీతో కూడిన వంట గ్యాస్ సిలిండర్ ధర 2 రూపాయల పైబడి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి రాయితీలను పూర్తిగా ఎత్తివేసే దిశగా ప్రతి నెలా దీని ధరను పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా చమురు కంపెనీలు ఈ చర్యను చేపట్టాయి. దిల్లీలో రూ.477.46గా ఉన్న 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర. తాజా పెంపుతో రూ.479.77కు చేరిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పేర్కొంది. ప్రతి వినియోగదారుడికీ. రాయితీపై ఏటా 12 సిలిండర్లు అందుతాయి. అంతకు మించితే మార్కెట్ ధరకు కొనుగోలు చేయాలి. ప్రస్తుతం రాయితీయేతర సిలిండర్ ధర దిల్లీలో రూ.524గా ఉంది. మరోపక్క విమాన ఇంధన ధరను కూడా 2.3 శాతం మేర పెంచుతూ చమురు కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

నిల్వ సామర్థ్యంపై దృష్టి సారించాలి

మంత్రి జగదీశ్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: పునరుత్పాదక విద్యుత్ వనరుల ఉత్పత్తి పెంపు లక్ష్యంగా పెట్టుకోవడంతోపాటు నిల్వ సామర్థ్యంపైనా దృష్టి సారించాలని తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు. మంగళవారమిక్కడ నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలో పునరుత్పాదక విద్యుత్ వనరుల విధివిధానాలు నిర్ణయించే సలహా మండలి సమావేశం జరిగింది. అనంతరం మంత్రి మాట్లాడారు. "పునరుత్పాదక విద్యుత్ వృద్ధికి ఎదురవుతున్న ఆటంకాలపై చర్చించాం. పునరుత్పాదక విద్యుత్‌పై కేంద్రం నిర్ణయించిన లక్ష్యం చేరాలంటే సౌర విద్యుత్, జీవ, పవన, మున్సిపల్ వ్యర్థాలు, హైడ్రో ఇలా అన్నింటినీ చేర్చాలని సూచించా. సబ్‌స్టేషన్లవారీగా సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి తెలంగాణ సాధించిన విజయాలు వివరించా. రూ.550 కోట్లు ఆదా అయింది. ఇలా మిగతా రాష్ట్రాల్లో చేపడితే బాగుంటుందని నీతి ఆయోగ్ చెప్పింది." అని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

4 యూజీసీ-నెట్ ప్రకటన.. నవంబరులో అర్హత పరీక్ష!

దిల్లీ: విశ్వవిద్యాలయాల నిధుల సంఘం జాతీయ అర్హత పరీక్ష (యూజీసీ నెట్)-2017కు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 4వ తేదీన సీబీఎస్ఈ విడుదల చేస్తుంది. అర్హత పరీక్ష మాత్రం నవంబరు 5వ తేదీన జరుగుతుంది. ఈ పరీక్షకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ cbsenet.nic.in లో ఈ వివరాలను ఉంచారు. భారతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రిసర్చ్ ఫెలో(జెఆర్ఎఫ్)ల కోసం యూజీసీ ఈ అర్హత పరీక్షను నిర్వహించనుంది. అర్హత పరీక్షకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఈ నెల(ఆగస్టు)11వ తేదీ నుంచీ మొదలౌతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తును సెప్టెంబరు 11వ నాటికల్లా సమర్పించాలి. సంబంధిత రుసుమును మాత్రం సెప్టెంబరు 12వ తేదీ దాకా చెల్లించుకోవచ్చు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా తమ ఆధార్ వివరాలను సమర్పించాలి. ఈ మేరకు సీబీఎస్ఈ ఒక నిర్ణయం తీసుకుంది.

ఫిరాయింపుల జాడ్యానికి మందేదీ?

ఆయారామ్‌లను ఆదరంగా అక్కునజేర్చుకుంటూ, గయారామ్‌ల పట్ల గంగవెర్రులెత్తిపోయే పార్టీలన్నింటి ఉమ్మడి రాజకీయ స్వభావం- తాముచేస్తే లౌక్యం, అదే ఎదిరిపక్షం చేస్తే మోసం! పచ్చగా ఉన్నచోట తిని వెచ్చగా ఉన్నచోట పడుకొనే శీలహీన రాజకీయాలకు పుట్టిన వికృత శిశువుగా ఫిరాయింపుల కంపు దశాబ్దాలుగా ముక్కుపుటాలు అదరగొడుతుండటంలో- పార్టీల తిలాపాపం తలా పిడికెడు అన్నది నిర్ద్వంద్వం! అసమ్మతి వరదలో తల మునకలవుతున్న గుజరాత్ కాంగ్రెస్- తమ ఎమ్మెల్యేలను దొంగిలించేందుకు భాజపా కుట్ర పన్నుతోందని తీవ్రంగా ఆరోపించింది. ఈ నెల ఎనిమిదిన జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్‌ను వరసగా ఆరో పర్యాయం గుజరాత్ నుంచి నెగ్గించడానికి పూర్వరంగం సిద్ధం చేసుకొన్న తరుణంలో పార్టీలో పుట్టిన అసమ్మతి ముసలం పుట్టిముంచుతుందేమోనన్న ఆందోళన హస్తం పార్టీ అధిష్ఠానాన్ని కలవరపెడుతోంది. విధానసభలో కాంగ్రెస్ వాస్తవ బలం 57 కాగా, అందులో ఆరుగురు పార్టీకి రాజీనామా చేసి భాజపా పంచన చేరడం గమనార్హం! అహ్మద్ పటేల్ విజయానికి 47 ఓట్లు అవసరమైన దశలో మరో అయిదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమలం పార్టీలోకి దూకడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. తక్కినవారందర్నీ బెంగళూరులోని ఈగల్టన్ విలాసవిడిదికి హుటాహుటిన తరలించిన కాంగ్రెస్- ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తోందంటూ భాజపాపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. గుజరాత్ నుంచి ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు భాజపా, ఒకటి కాంగ్రెస్ దక్కించుకోగల వీలుంది. మొట్టమొదటిసారి రాజ్యసభకు తలపడుతున్న కమల దళపతి అమిత్‌షాతో పాటు స్మృతీ ఇరానీ భాజపా పక్షాన మోహరించగా, కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన చీఫ్ విప్ బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ తృతీయ అభ్యర్థిగా అహ్మద్ పటేల్‌కు గట్టిసవాలు రువ్వుతున్నారు. 'కావవే వరదా' అంటూ నేడు కన్నీరొలుకుతున్న కాంగ్రెసే దేశంలో ఫిరాయింపుల భ్రష్టచరిత్రకు తిరుగులేని నవాబు!

ఎదుటి పార్టీల్లో చీలికలే అధికారానికి నిచ్చెనమెట్లు అవుతాయంటే, అలాంటి అధికారం తనకు అక్కర్లేదంటూ పదమూడునాళ్ల ప్రధానిగా 1996లో వాజ్‌పేయీ ప్రకటించిన ఆదర్శం సమున్నతం. తదనంతర కాలంలో బతకనేర్చిన తెలివితేటలతో ప్రత్యర్థి పక్షాలను బురిడీ కొట్టించడంలో భాజపా పెద్దలు రాటుతేలిపోయారన్నది నిజం. 1995 మార్చిలో తొలిసారిగా గుజరాత్‌లో 182 సీట్లకు 121 స్థానాలు సాధించి అధికారానికి వచ్చిన భాజపా- శంకర్ సింహ్ వాఘేలాను కాదని కేశూభాయ్‌కి కిరీటధారణ చెయ్యడంతో అసమ్మతి కొలిమి అంటుకొంది. సర్వామోద సూత్రం కింద సురేశ్ మెహతాను ముఖ్యమంత్రిని చేసినా, 45 మందికిపైగా శాసనసభ్యుల మద్దతుగల వాఘేలా అసంతృప్తిని తనకు అనుకూలంగా మలచుకొన్న కాంగ్రెస్ ఆడిన కుటిల రాజకీయంలో- హస్తం పార్టీ దన్నుతో వాఘేలా ముఖ్యమంత్రిత్వం రెండేళ్లకు పైగా కొనసాగింది. అప్పట్లో తన రాష్ట్రీయ జనతాపార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన వాఘేలా, మరోసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నా అహ్మద్ పటేల్ పడనీయడం లేదు. వచ్చే డిసెంబరులో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దశలో- అహ్మద్ పటేల్ కొమ్ములు వంచడానికి వాఘేలాకు ఇంతకుమించిన అవకాశమూ దొరకదు. రాష్ట్రపతి ఎన్నికల వేళ- కాంగ్రెస్ అభ్యర్థి మీరాకుమార్‌ను కాదని కోవిందుకు 11 మంది హస్తం పార్టీ ఎమ్మెల్యేలు ఓటు వేయడం అధిష్ఠానానికి ముందస్తు హెచ్చరిక. పరిస్థితి చేయి దాటకముందే సర్దుబాటుకు చొరవ చూపకపోవడం రాహుల్ రాజకీయ దుర్బలత్వానికి సూచిక! భాజపాలో చేరబోనంటూనే వాఘేలా ఆడుతున్న రాజకీయం, కాంగ్రెస్ అధిష్ఠానానికి ముచ్చెమటలు పట్టిస్తోంది. రెండు దశాబ్దాల క్రితం వాఘేలాను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ఆడిన దుర్రాజకీయానికి భాజపా ప్రతీకారమిది. రాజకీయ స్వార్థంతో ఫిరాయింపుల్ని ప్రోత్సహించేవారంతా నిశ్చయంగా దోషులే. ఫిరాయింపుల జాడ్యం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి శరాఘాతమే!

'స్వేచ్ఛాసమాజంలో అసమ్మతి అంతర్భాగం... అది నిజాయతీగా, నిష్కపటంగా ఉండాలిగాని, దొంగచాటు వ్యవహారం కాకూడదు... అత్యాశ, అధికార లాలసకు పుట్టిన అసమ్మతి సహించరానిది'- లోక్‌సభ స్పీకర్‌గా రబీరే చేసిన ఆ వ్యాఖ్యలు వెలకట్టలేనివి. భారతావనిలో 1947-'77 మధ్య ముప్పయ్యేళ్ల కాలంలో ఫిరాయింపు జబ్బు పాలబడి 50 ప్రభుత్వాలు కుప్పకూలాయి. రాజీవ్ జమానాలో ఫిరాయింపు నిషేధ చట్టం అంటూ ఒకటి తెచ్చినా, అది చిల్లర గోడ దూకుళ్లను అరికట్టి టోకు ఫిరాయింపులకు లాకులెత్తింది. ప్రభుత్వం భవిష్యత్తును నిర్ణయించే విశ్వాస లేదా అవిశ్వాస తీర్మానంపై పార్టీ విప్‌నకు వ్యతిరేకంగా ఓటు చేసిన సందర్భంలో ఆయా సభ్యుల్ని అనర్హులుగా ప్రకటించవచ్చునని 1991లో సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. అరుణాచల్ ప్రదేశ్ లాంటిచోట్ల పాలకపక్షాన్ని నట్టేట ముంచి ముఖ్యమంత్రి సహా పరివారమంతా విపక్ష శిబిరంలో చేరి మళ్ళీ కొత్త ప్రభుత్వంగా కొలువుతీరే స్థాయిలో ఫిరాయింపుల కంపు జాతి జనుల్ని నిశ్చేష్టపరుస్తోంది. పార్టీ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్న బ్రిటన్‌లో 15 ఏళ్ల వ్యవధిలో విపక్షం నుంచి అధికార పార్టీకి మారినవాళ్లు కేవలం ముగ్గురు! బ్రిటన్‌తోపాటు అమెరికాలోనూ ఫిరాయింపుల నిషేధ చట్టమన్నదే లేదు! దేశీయంగా ఉన్న చట్టాన్నే చట్టుబండలు చేసి ఫిరాయింపుదారులు పండగ చేసుకొంటున్న దుర్గతిని దునుమాడాలంటే సమగ్ర సంస్కరణల్ని అమలు చేయకతప్పదు. ఫిరాయింపుదారుల సభ్యత్వాలు రద్దు కావడంతో పాటు నిర్ణీత కాలంపాటు వాళ్లు ఏ పదవులూ చేపట్టకుండా నిషేధం విధించడమూ తప్పనిసరి. ప్రజలపట్ల జవాబుదారీతనం అడుగడుగునా పాదుకొనేలా పార్టీలూ స్వయంసంస్కరణలకు సిద్ధపడితేనే ఫిరాయింపుల జాడ్యాన్ని అరికట్టగలిగేది!

గంగకు మోక్షం... ఏదీ సాక్ష్యం?


డాక్టర్ జీవీఎల్ విజయ్‌కుమార్

పాపాలు కడుగుతుందని కోట్లమంది విశ్వసించే గంగానది నేడు స్వయంగా అపవిత్రమైపోయింది. యమునా నదీ దాని సరసన చేరింది. అంతేకాదు, దేశంలోని నదుల్లో అత్యధికం నేడు కాలుష్య కాసారాలైపోయాయి. శుద్ధి పథకాలంటూ కోట్ల రూపాయలు గుమ్మరిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ముఖ్యంగా గంగ శుద్ధికి సంబంధించి 2018 నాటికి ఫలితాలు వస్తాయని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి భరోసా ఇస్తున్నప్పటికీ, నమ్మకం కుదరడం లేదు. ఈ విషయంలో ప్రధానమంత్రి మోదీ సైతం అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో- బహుముఖ వ్యూహం, నిర్దిష్ట కార్యాచరణ తక్షణావసరం అంటున్న వ్యాసమిది...



పర్యావరణ పరిరక్షణకు నదులే మూలాధారాలు. దేశంలో పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ అనేక దుష్ప్రభావాలకు దారితీస్తున్నాయి. వాటి తాకిడి నదులకు విస్తరించి, అపార కష్టనష్టాలకు కారణమవుతోంది. నగరాల నుంచి చెత్త, మురుగునీరు; పారిశ్రామికవాడల్లోని వ్యర్థాలు, హానికర రసాయనాలు నేరుగా నదీజలాల్లో కలుస్తున్నాయి. జీవనదులు విషతుల్యమై జీవావరణ, జలావరణ వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దేశ రాజధాని ప్రాంతంలో ప్రవహించే యమున, అత్యంత పవిత్రంగా భావించే గంగానది సైతం ఏళ్ల తరబడి కాలుష్యం బారినపడుతున్నాయి. నదీజలాల శుద్ధికి ప్రభుత్వాలు ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. గంగానదికి 500 మీటర్ల పరిధిలో చెత్త వేయడాన్ని నిషేధిస్తూ ఇటీవల జాతీయ హరిత ట్రైబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది. నదీతీర పరిధిలో ఎవరైనా చెత్తవేస్తే, పర్యావరణ పరిహారంగా పెద్దమొత్తంలో అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. గంగ, దాని ఉపనదుల ఘాట్లలో ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందించాలని యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల్ని ట్రైబ్యునల్ ఆదేశించింది. నదీతీరంలో అనుమతించగల, అనుమతించకూడని కార్యకలాపాల్ని ప్రభుత్వం గుర్తించేంతవరకు, తీరంనుంచి వందమీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రాంతంగా ప్రకటించారు. అంతేకాక సంబంధిత రాష్ట్రప్రభుత్వాలు మురుగు నీటిశుద్ధి ప్రాజెక్టు పనుల్ని రెండేళ్లలో పూర్తిచేయాల్సి ఉంది.

పారిశ్రామిక వ్యర్థాలే శాపాలు

గంగా నది భారతీయులు పవిత్రమైన పుణ్యతీర్థంగా భావించుకునే నదీమతల్లి. అది ప్రస్తుతం దేశంలోని కాలుష్యభరిత నదుల జాబితాలో మొదటి స్థానంలో ఉంది! ప్రపంచంలోనే అత్యంత పురాతన పట్టణంగా ప్రసిద్ధి పొందింది వారణాసి. గంగానది కాలుష్యం బారిన పడటానికి అక్కడి పరిస్థితులూ కారణమే! దేశ భూభాగంలో దాదాపు 26 శాతం మేర గంగానది పరీవాహక ప్రాంతం విస్తరించి ఉంది. దిల్లీ, ఆగ్రా, కాన్పూర్, లఖ్‌నవూ, వారణాసి, అలహాబాద్, పట్నా, కోల్‌కతా వంటి ప్రధాన పట్టణాల నుంచి అది ప్రవహిస్తోంది. ఆయా పట్టణాల్లో ఉత్పన్నమయ్యే చెత్త, ఇతర వ్యర్థాలు, మురుగు యథేచ్ఛగా గంగలో కలుస్తున్నాయి. ఆ నది పరిధిలో లక్షకు మించిన జనాభా గల పట్టణాలు 29. 50వేల నుంచి లక్ష జనాభా గల పట్టణాలు 23. 50వేల లోపు జనాభా గల ప్రాంతాలు అనేకం ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం- యూపీ నుంచి పశ్చిమ్ బంగ వరకు గల గంగ పరీవాహక ప్రాంతంలోని ఖాదీ పరిశ్రమల సంఖ్య 250కి పైమాటే. ప్రతి నిత్యం ఇవి వ్యర్థజలాల్ని వదులుతున్నాయి. విషపూరితమైన రసాయన అవశేషాల్ని నదిలోకి విడుదల చేస్తున్నాయి. దేశంలోని నదుల్లో గంగ తరవాత యమునదీ ఇదే పరిస్థితి! యమున కలుషితమయంగా మారడానికి కారణం- దిల్లీ నగర పరిస్థితులు. ఆ నగరం నుంచే పలు వ్యర్థపదార్థాలు నదిలోకి చేరుతున్నాయి.

కాలుష్య నిలయాలు

ప్రాంతాలు	నది	జాబితాలో స్థానం
ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్	గంగ	1
దిల్లీ	యమున	2
గుజరాత్	సబర్మతి	3
పశ్చిమ్ బంగ, ఝార్ఖండ్	దామోదర్	4
ముంబయి	ఓషీవర	5

విదేశాల అనుభవాలు వేరు. ఇప్పటికే లండన్ నగరంలోని థేమ్స్ నది అత్యంత ప్రమాదకర స్థాయి నుంచి బయటపడి, తిరిగి పునరుజ్జీవం పొందగలిగింది. అటు ఐరోపాలోనూ జర్మనీ దేశం- రైన్ నదిని లక్ష్యసాధన కాలపరిమితికి ముందుగానే కాలుష్య మహమ్మారి కోరల నుంచి తప్పించింది. మనదేశంలోనూ మోదీ ప్రభుత్వం 'నమామి గంగ' పేరిట గంగానది పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. తొలి సంవత్సరమే 2014-15 బడ్జెట్‌లో రూ.2,037 కోట్లు కేటాయించింది. 2015-16లో రూ.1,000 కోట్లు, 2016-17లో రూ.1,675 కోట్లు కేటాయించారు. 2017-18లోనూ కేంద్రం రూ.2,300 కోట్లు కేటాయించి, గంగానది ప్రక్షాళనకు పెద్దపీట వేసింది. కార్యాచరణలో ఆశించిన పురోగతి రావాల్సి ఉంది. గంగా నదీజలాల శుద్ధి కార్యక్రమంలోని మొదటి, రెండు దశలు 1980లోనే ప్రారంభమయ్యాయి. భూసేకరణలో అవరోధాలు ఎదురయ్యాయి. పరిసర ప్రాంతాల నుంచి వచ్చి చేరే మురుగునీటిని శుద్ధిపరచడానికి వ్యవస్థ ఏర్పాటైనా, మౌలిక సదుపాయాల వైఫల్యం చోటుచేసుకుంది. ఇటువంటివే మరికొన్ని కారణాలు నదీజలాల్ని శుద్ధిపరచే పథకం అమలును అడ్డుకున్నాయి. అస్థిర విద్యుత్ సరఫరా, అనువుగాని చోట శుద్ధి సామగ్రి ఏర్పాట్ల వల్ల ఈ ప్రక్రియ సఫలం కాలేకపోయింది. మోదీ సర్కారు గంగానది ప్రక్షాళనకు మూడేళ్ల కాల పరిధిని లక్ష్యంగా పెట్టుకుంది. అది 2016 నుంచి 2018 వరకు ఉంది. గతంలో థేమ్స్ నది పునరుజ్జీవానికి అనుసరించిన నమూనాతోనే ఈ కార్యాచరణా మొదలైంది. వివిధ కారణాల వల్ల విజయవంతం కాకపోవడంతో,

బహుముఖ వ్యూహమే శరణ్యం


లండన్‌లోని థేమ్స్‌నది పరిశుభ్రత

2016లో తిరిగి జర్మనీ విధానం అనుసరించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు కావడంతో, గంగ ప్రక్షాళన పనులు తిరిగి ఊపందుకున్నాయి.

గంగానది ప్రక్షాళన కోసం సమీకృత నదీ పరీవాహక యాజమాన్య నిర్వహణ విధానాన్ని బాధ్యతాయుత రీతిలో అమలుపరచాలి. ఆ మేరకు ఒప్పంద ఉద్దేశం మంచిదే. గత అనుభవాల దృష్ట్యా అదెంతవరకు సఫలీకృతమవుతుందో చూడాలి. ఈ విధానంలో మొదటగా గంగానది ఎగువ పరీవాహక ప్రాంతాలైన ఉత్తరాఖండ్ నుంచి ప్రాథమిక చర్యలు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించారు. 'భారత్- జర్మనీ పరస్పర అవగాహన వినిమయం' విధానంపై ఆధారపడి, ఈ ఒప్పందం కింద గంగానది ప్రక్షాళనకు జర్మన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. అంతిమంగా జర్మనీలోని రైన్, డాన్యూబ్ నదుల ప్రక్షాళన విషయంలో అనుసరించిన వ్యూహాన్నే 'గంగ పునరుజ్జీవన' ప్రక్రియలోనూ అనుసరిస్తారని ఒప్పందం పేర్కొంటోంది. గంగానదిలో రోజూ అనేక కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. ఈ పరిమాణంలోని కాలుష్యాన్ని నివారించడానికి, నీటిని శుద్ధి చేసే సామర్థ్యం గల 'ట్రీట్‌మెంట్ ప్లాంట్ల' ఏర్పాటు అత్యవసరం. దీని ద్వారా నిర్ణీత కాలవ్యవధిలో గంగానది పునరుజ్జీవ పథకాన్ని అమలుచేయవచ్చు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే విసర్జకాల స్వభావాన్నిబట్టి ప్రత్యేక శుద్ధీకరణ కేంద్రాల్ని ఏర్పాటుచేయాలి. మురుగునీరు, కాలుష్యపూరితమైన వ్యర్థ, రసాయన అవశేషాల నీటిని పునఃశుద్ధి చేయడానికి ప్రస్తుత కాలంలో పలు రకాల సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అయినా గతంలో మాదిరిగా మురుగునీటిని శుద్ధిచేసి మధ్యలో వదిలేయడం సరైన పని కాదు. వ్యర్థజలాల్ని శుద్ధిచేసే క్రమంలో విడుదలయ్యే బయోగ్యాస్‌ను వంటకు, విద్యుదుత్పాదనకు వినియోగించాలి. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే ఉప ఉత్పాదక బయోస్లడ్జ్‌ను వ్యవసాయంలో సేంద్రియ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఈ విధంగా బహుళ ప్రయోజనాత్మక దృక్పథంతో గంగాజలాల శుద్ధిప్రక్రియను చేపడితే, నిజంగా అది ఆ నది పవిత్రతను కాపాడినట్లే అవుతుంది. పరీవాహక ప్రాంతంలోగల ఘాట్లను సుందరీకరించి అభివృద్ధిపరచాలి. అప్పుడవి పర్యాటక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి. కాలుష్యకారకాలు, వ్యర్థాలు ఎక్కడ నుంచి వచ్చి నదిలోకి చేరుతున్నాయో- సరిగ్గా అక్కడి నుంచే నివారణ చర్యలు చేపట్టాలి. నదీతీర ప్రాంతాల్లోని నగరాలు, పట్టణాల్లో సుస్థిర మురుగునీటి పారుదల సదుపాయాల్ని కల్పించాలి. మురుగునీటి ప్రవాహంలో కరగని, కలిసిపోని గాఢమైన ఘనవ్యర్థాల్ని వేరుపరచి, స్థానికంగా ఉంచి ధ్వంసం చేయాలి. రసాయన వ్యర్థపదార్థాలు నదిలో కలిసే చోట 'స్క్రీనింగ్' లేదా శుద్ధిపరచడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చు. ఇతర గతిశీల వ్యూహాలను అనుసరించడంతోపాటు, పారిశ్రామిక వ్యర్థ విసర్జకాలను అవి విడుదలయ్యే చోటే అరికట్టడం అన్నింటికంటే ముఖ్యం.

దశలవారీగా... దేశవ్యాప్తంగా

గంగానది ప్రక్షాళన ఫలితాల్ని బట్టి, ప్రత్యేక విధానాన్ని దశలవారీగా దేశంలోని ఇతర నదీజలాల శుద్ధికి వర్తింపజేస్తారు. జలవనరుల మరమ్మతులు, నవీకరణ/సుందరీకరణ, పునరుజ్జీవన పథకం పేరిట కేంద్రం ఇప్పటికే నదీజలాల శుద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనికింద దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లోని 3,341 చిన్నతరహా జలవనరుల్ని ఎంపిక చేశారు. గడచిన మార్చి నాటికే ఇందులోని 2,033 జలవనరుల నవీకరణ, శుద్ధీకరణలు పూర్తయినట్లు కేంద్రప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వరద నిర్వహణ పథకం కింద గతంలోనే 420 చిన్న నీటివనరుల పనులకు ఆమోదం లభించింది. అందులో 252 పనులు పూర్తయ్యాయి. పన్నెండో ప్రణాళిక కాలంలో 97 పనుల్ని ఆమోదించారు. వరద నిర్వహణ పథకం కింద రూ.379 కోట్లు మంజూరైనట్లు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. గంగానది పునరుజ్జీవన ప్రక్రియ కొనసాగుతుండగానే, యమునకూ పూర్వరూపం కల్పించే ప్రయత్నాల్ని దిల్లీ అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రారంభించింది. దేశంలో గంగానది తరవాత అత్యంత కాలుష్యమయ నది యమున! దీని కాలుష్య నివారణకు దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన పర్యావరణ బృందం ప్రభుత్వాలకు పలు సూచనలు చేసింది. దిల్లీ నుంచి యూపీ వరకు గల 52 కిలోమీటర్ల పరిధిలోని యమునా నది పరీవాహక ప్రాంతాన్ని సంరక్షిత మండలంగా ప్రకటించాలి. నదీ మండలంలో అభివృద్ధి, పారిశ్రామిక కార్యకలాపాల పేరిట జరిగేవాటిని కనీస స్థాయికి తగ్గించాలి. నది వరద మైదానాలను సంరక్షించడం, హరిత హారాన్ని అభివృద్ధిపరచడం ద్వారా నదికి పూర్వవైభవాన్ని సంతరింపజేసినట్లవుతుంది.

ఉపాధి సరే... భద్రత అత్తెసరే!

పల్లెల నుంచి పట్టణాలకు పేదల వలసలు పెరిగిపోతున్నాయి. వీరికి నిర్మాణ, రవాణా రంగాలతోపాటు భద్రత సేవల రంగమూ పెద్ద ఉపాధి కల్పనదారుగా ఆవిర్భవించింది. కొన్ని దశాబ్దాల నుంచి సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐటీ) సంస్థలు, పారిశ్రామిక ప్రాంగణాలు, దుకాణ సముదాయాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు, విమానాశ్రయాలు, మెట్రో రైలు స్టేషన్లు, ఇతర మౌలిక వసతులు పెద్దయెత్తున విస్తరించడంతో ప్రైవేటు భద్రత సిబ్బందికి గిరాకీ అధికమవుతోంది. పట్టణీకరణ వల్ల అపార్ట్‌మెంట్లు, శాటిలైట్ టౌన్‌షిప్పులు, గేటెడ్ కమ్యూనిటీలు విస్తరించడమూ గిరాకీని మరింత పెంచింది. జనాభాకు తగిన నిష్పత్తిలో పోలీసు సిబ్బంది లేకపోవడం, కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నింటికీ పహరా కాసే స్థితిలో లేకపోవడంతో ప్రైవేటు భద్రతా సేవలపై ఆధారపడటం తప్పనిసరి అవుతోంది. భద్రతా సిబ్బందిని ఏర్పరచుకునే సంస్థలకు బీమా సంస్థలు ప్రీమియంలో భారీ తగ్గింపు ఇవ్వడం ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలకు ప్రోత్సాహకరంగా ఉంది. సాధారణ (జనరల్) బీమా సంస్థలు, ముఖ్యంగా అగ్నిప్రమాద బీమా కంపెనీలు ఇలా ముదరా ఇస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు ఉంటే అగ్నిప్రమాదాలను ముందే పసిగట్టి నివారించవచ్చునని బీమా సంస్థలు భావిస్తున్నాయి. మరోవైపు ఇటీవలి కాలంలో ఉగ్రవాద దాడుల కారణంగా అభద్రతాభావం ముప్పిరిగొని అన్ని రకాల సంస్థలు ప్రైవేటు సెక్యూరిటీ సేవలను కోరుతున్నాయి.

అవకాశాల వెల్లువ

ముంబయిలోని తాజ్ హోటల్‌పై 2008 నవంబరు 26న దాడి చేసిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులు మొదట హోటల్ సెక్యూరిటీ సిబ్బందికి తారసపడ్డారు. వారికి పోరాట శిక్షణ, ఆయుధాలు ఇచ్చి ఉంటే ఉగ్రవాదులను ఆదిలోనే అడ్డుకోగలిగేవారు. అందుకేనేమో బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద్ ప్రారంభించిన పరాక్రమ్ సురక్షా సంస్థ తన సెక్యూరిటీ గార్డులకు పదవీ విరమణ చేసిన పోలీసు, సైనిక సిబ్బందితో శిక్షణ ఇప్పించనుంది. ఏటా 20 శాతం వృద్ధిరేటుతో దూసుకుపోతున్న ప్రైవేటు సెక్యూరిటీ సేవల రంగం ఇప్పటికే 70 లక్షలమందికి ఉపాధి కల్పిస్తోంది. 2020 కల్లా ఈ రంగంలో మరో 50 లక్షల మంది ఉపాధి పొందనున్నారు. ప్రస్తుతం రూ.40 వేలకోట్ల పరిశ్రమగా ఉన్న ఈ రంగం, 2020 నాటికి రూ.80 వేలకోట్ల స్థాయికి ఎదగనుంది. అందుకే సెక్యూరిటీ సేవల రంగంలోకి దేశవిదేశీ సంస్థలు పెద్దయెత్తున ప్రవేశిస్తున్నాయి. దిల్లీకి చెందిన సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్‌తో పాటు బ్రిటన్‌కు చెందిన జి 4 ఎస్, స్వీడన్‌కు చెందిన సెక్యూరిటాస్ ఈ రంగంలో అతిపెద్ద సంస్థలుగా వెలుగుతున్నాయి. ఇంకా రామ్‌దేవ్ బాబా పరాక్రమ్ సురక్షాతోపాటు మరెన్నో సంస్థలు ప్రైవేటు సెక్యూరిటీ రంగంలో కాలుమోపనున్నాయి. 2006లోనే ఈ పరిశ్రమ సేవాపన్నులు, ఉద్యోగుల భవిష్య నిధి, బీమాకు రూ.10 వేలకోట్లు చెల్లించిందని భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) తెలిపింది. ఇలా ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని ఇవ్వడంతోపాటు గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలోనూ ఈ పరిశ్రమ ముందుంది.


ప్రైవేటు సెక్యూరిటీగార్డులు

2016లో ఇరాక్, అఫ్గానిస్థాన్‌ల తరవాత అత్యధిక ఉగ్రవాద దాడులు భారత్‌లోనే జరిగాయని అమెరికా విదేశాంగ శాఖ తాజా నివేదిక తెలిపింది. వీటిలో 47 శాతం పేలుడు తరహా ఘటనలే ఉన్నాయి. ఇక వీధుల్లో, ఇళ్లల్లో మహిళలపై దాడుల వంటి ఇతరేతర నేరాలూ అధికమవుతున్నాయి. అందువల్లే ధనికులు తమ ఇళ్ల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకుంటున్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో చోరీ అయిన ఆస్తుల విలువ 2003లో రూ.1,735 కోట్లు. 2013నాటికి చోరీ వస్తువుల విలువ రూ.13,219 కోట్లకు పెరిగింది. ఈ చౌర్య నివారణకు కావలసిన పోలీసు, పారామిలిటరీ సిబ్బంది భారత్‌కు లేరు. ఐక్యరాజ్య సమితి ప్రతి లక్ష జనాభాకు కనీసం 222 మంది పోలీసులు ఉండాలని సిఫార్సు చేయగా, భారత్‌లో 131 మంది మాత్రమే ఉన్నారు. ఈ లోటును ప్రైవేటు భద్రతా సంస్థలు పూరించక తప్పదు. సమాజంలో వివిధ వర్గాలకు వ్యక్తిగత భద్రతకు మాత్రమే కాకుండా ఆర్థిక భద్రతకూ పోలీసుల కొరత ఏర్పడింది.

నేడు భారత్ అత్యంత ఆర్థికాభివృద్ధి రేటును సాధిస్తూ భారీయెత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తోంది. పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు ఉండాలని విదేశీయులు ఆశిస్తారు. పట్టణ మధ్యతరగతి వర్గమూ పెద్దయెత్తున ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇతర ఆస్తులు సమకూర్చుకొంటోంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల చొరవతో మౌలిక వసతుల రంగం విస్తరిస్తోంది. వీటన్నింటి భద్రతా అవసరాలను తీర్చడానికి ప్రైవేటు భద్రతా సేవల రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందుకోసం 2005లోనే ప్రైవేటు భద్రతా సంస్థల (నియంత్రణ) చట్టం తెచ్చింది. దాదాపు అన్ని రాష్ట్రాలూ ఈ చట్టాన్ని అమలుచేస్తున్నాయి. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కేంద్ర ప్రైవేటు భద్రతా పరిశ్రమ సంస్థల సంఘం (క్యాప్సి)తో కలిసి దేశమంతటా పలు ఉత్కృష్ట కేంద్రాల్లో భద్రతా సిబ్బందికి శిక్షణ ఇవ్వనుంది. దేశంలో 100 స్మార్ట్ నగరాలు అవతరించనున్న దృష్ట్యా భద్రతా సేవలు మరింతగా అవసరపడనున్నాయి. భారత్‌లో తయారీ విధానం కింద రానున్న పరిశ్రమలకూ భద్రతా సిబ్బంది అవసరం ఎక్కువగా ఉండబోతోంది. అలాగే పట్టణీకరణ వల్ల దేశంలో విజృంభిస్తున్న విందు వినోదాల ఈవెంట్లు, క్రీడా పోటీల నిర్వహణకూ వీరి అవసరం ముమ్మరమవుతోంది.

ఇక బ్యాంకులకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి. 2006లో దేశమంతటా 68,681 బ్యాంకు శాఖలు ఉండగా 2013లో వాటి సంఖ్య 1,02,343కి పెరిగింది. వీటితోపాటు ఏటీఎమ్‌లూ విస్తరించాయి. 2012నాటికే 95,686కి చేరిన ఏటీఎమ్‌ల సంఖ్య 2014లో 1,58,894కు చేరింది. పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ ఇండియా వల్ల వీటి సంఖ్య మరింత పెరగనుంది. కంపెనీల నుంచి బ్యాంకులకు, బ్యాంకుల నుంచి ఏటీఎమ్‌లకూ భద్రంగా నగదు తీసుకుపోవడానికి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల మీదనే ఆధారపడుతున్నారు. భారత్‌లో ఇటువంటి నగదు బదిలీ సేవలు ఏటా 25 శాతం చొప్పున పెరుగుతాయని కన్సల్టెన్సీ సంస్థ గ్రాంట్ థార్న్ టన్ అంచనా వేసింది.

నైపుణ్యాలపై దృష్టి

ప్రస్తుతం ప్రైవేటు భద్రతా సంస్థలు గ్రామాల నుంచి వలస వస్తున్నవారినే ఎక్కువగా నియమించుకుంటున్నాయి. వీరిలో చాలామంది పెద్దగా చదువు సంధ్యలు ఉన్నవారు కారు. ఇవాళ సెక్యూరిటీ గార్డు బాధ్యతలు ఇంటి ముందు, ఏటీఎం ముందు, కర్మాగారం ముందు కాపలా కాయడంతోటే తీరిపోవు. తమ పరిశ్రమ రహస్యాలను ఇతరులు తస్కరించకుండా జాగ్రత్త వహించడం, ఏటీఎమ్‌ల్లో, ఇళ్లల్లో, కార్యాలయాల్లో సీసీ టీవీ వంటి ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థలను పర్యవేక్షించడం, విమానాశ్రయాల్లో, పంచ తారా హోటళ్లలో, సినిమా హాళ్లు, దుకాణ సముదాయాల్లో ఎక్స్ రే యంత్రాలు, మెటల్ డిటెక్టర్లతో ఖాతాదారుల సంచులను తనిఖీ చేయడం- సెక్యూరిటీ గార్డుల విధుల్లో ప్రధానమైనవిగా మారుతున్నాయి. అయినా కూడా చట్టం వీరిని నైపుణ్యం లేని కార్మికులుగానో, పాక్షిక నైపుణ్యం ఉన్నవారిగానో పరిగణిస్తోంది. వీరిని ఉన్నత నైపుణ్యాలు గల కార్మికులుగా తీర్చిదిద్దాలని ఫిక్కీ సిఫార్సు చేసింది. చట్ట ప్రకారం ప్రతి సెక్యూరిటీ గార్డు కనీసం 100 గంటల తరగతి గది శిక్షణ, 60 గంటల ప్రాక్టికల్ శిక్షణ పొంది ఉండాలి. ముమ్ముందు కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ నిఘా వ్యవస్థలు రంగప్రవేశం చేస్తాయి. చొరబాటుదారుల కదలికను పసిగట్టి హెచ్చరించే సెన్సర్లు, కెమేరాతో నడిచే నిఘా సాధనాలు, ఎలక్ట్రానిక్ నియంత్రణ కేంద్రాలు భద్రతా వ్యవస్థలో అంతర్భాగమవుతాయి. వీటి నిర్వహణలో సెక్యూరిటీ గార్డులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.

సంపన్న దేశాల్లో చొరబాటుదారులను, అనుమానితులను పోలీసులు వచ్చే వరకు తమ నిర్బంధంలో ఉంచుకునే అధికారం ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఉంది. అత్యవసర పరిస్థితిలో సమర్థంగా వ్యవహరించాలంటే ఇలాంటి అధికారాలను మన గార్డులకూ ఇవ్వాలి. పోలీసులకు అనుబంధంగా పనిచేయడానికి వీలుగా ప్రైవేటు గార్డులకు ఎలాంటి అధికారాలు ఇవ్వవచ్చో ప్రభుత్వం పరిశీలించాలి.

– ఆర్య

జ్ఞానం...అజ్ఞానం!

'దేవుడి పళ్లు' అనే పదబంధం భాషలో ఉన్నందుకు మనం నిజంగా సిగ్గుపడాలి. అన్నిరకాల అరటి పళ్ళలోనూ అతి చవగ్గా దొరికే నాసిరకం జాతికి- దేవుడి పళ్ళు అని పేరు. మన భావదారిద్ర్యానికి అది పరాకాష్ఠ! భగవంతుడికి ఏపాటి ప్రాధాన్యం ఇస్తున్నామో, అది లోకానికి వెల్లడి చేస్తూ ఉంటుంది.

నిరుపేదలకో, వరద బాధితులకో వస్త్రపంపిణీ చేస్తున్నామని ఎవరైనా వచ్చి అడగ్గానే- మనకు మనసులో దయ, దాతృత్వం పొంగుకొస్తాయి. తీరా చేతల దగ్గరకు వచ్చేసరికి పాతవనో, చిరిగాయనో మూలపడేసినవి తప్పిస్తే- కొత్త బట్టలు దానం చెయ్యడానికి చేతులు రావు. ఏ గుడి నిర్మాణానికో గట్టిగా విరాళం ఇస్తే మూల విరాట్టుకన్నా భారీగా ఉండే శిలాఫలకంపై మన పేరు చెక్కిస్తే తప్ప మనకు తృప్తి కలగదు. వెనకటికి ఒకాయన అన్నసత్రానికి తాను దానమిచ్చిన గాలి పంకాను ఎప్పుడూ తిరగనిచ్చేవాడు కాడు. ఎందుకంటే, అది తిరిగితే రెక్కల మీద రాసిన తన పేరు జనానికి కనపడదు కాబట్టి!

అంతెందుకు... ముష్టివాడొచ్చి అన్నం పెట్టమంటే, మిగిలితే ఇవ్వడం తప్పిస్తే మిగిల్చి ఇవ్వడం చాలామందికి అలవాటు ఉండదు. భగవంతుడి దగ్గరా ఈ భావదారిద్ర్యం తప్పలేదు కనుకనే, దేవుడి పళ్ళు అనే ఒకానొక లేకి పదబంధం భాషలో చేరింది.



'ఈ సృష్టిలో సమస్తం ఈశ్వరుడి సొత్తు. ఆయనే మొత్తం అంతటికీ అధినేత. ఎవరికివారు తమకు కేటాయించిన వాటాతో సంతృప్తి చెందాలి. త్యాగబుద్ధి కలిగి, ఉన్నవాటిని హాయిగా అనుభవించాలి. తమకు ఎంత అవసరమో అంతవరకే స్వీకరించాలి' అని 'ఈశావాస్యోపనిషత్తు' హితవు పలికింది. ఈ సూక్తిని తక్కిన జీవులన్నీ తు.చ. తప్పక ఆచరిస్తాయి. తొట్టిలో కుడితి తాగినా, మేటు నుంచి గడ్డి మేసినా- తమ అవసరం మేరకే తప్పించి, అదనంగా ఒక చుక్కగాని ఓ పరకగాని పాకలో ఒబ్బిడి చేద్దామని పశువులు ఏనాడూ ప్రయత్నించవు. అలాగే కల్లంలో ధాన్యం ఆరబోస్తే పిచ్చుకలు, పావురాలు దానిపై వాలి కాసిని గింజలు తినేసి తృప్తిగా ఎగిరిపోతాయే గాని, దాచి పెడదామని చూడవు. ఒకదానితో ఒకటి ఎన్నడూ ఘర్షణ పడవు. కుడితి అంతా తనదేనని పశువు పట్టు పట్టదు. గడ్డిమేటంతా తన సొంతమని మరోదానితో అది ఎప్పుడూ పోట్లాడదు.

అదే ధాన్యపు రాశిని 'ఉచితం' అని వీధిలో చాటింపు వేసి చూడండి- ఏమవుతుందో?

పశువులకు, పక్షులకు తెలిసిన ధర్మం మనిషికి తెలియదా? తెలియక పోవడం కాదు, బాగా తెలుసు. ఆ విషయంలో మనిషి బ్రహ్మజ్ఞాని. సంపదనంతా దోచేసి, భద్రంగా దాచేసి, శాశ్వతంగా అనుభవించాలన్నది మనిషి ఆలోచన. ఆ విషయంలో మాత్రం అతడు పరమ అజ్ఞాని. తన కళ్లముందే నిత్యం ఎంతోమంది కాటికి ప్రయాణం కడుతుంటారు. అది చూస్తూ కూడా- తాను మాత్రమే శాశ్వతం అనుకోవడం మనిషి అజ్ఞానానికి తిరుగు లేని నిదర్శనం!

ఈ సత్యం మనిషి తలకెక్కితే స్వార్థానికి, భావదారిద్ర్యానికి చోటుండేది కాదు. దేవుడి పళ్లు అనే మాట పుట్టి ఉండేదీ కాదు. మనిషి తనను తాను మోసం చేసుకుంటూ- దేవుడి కళ్ళు కప్పగలనని పొరపడి ఉండేవాడే కాడు!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

అంతర్యామి

విద్యార్థుల జీవితాలతో ఆటలు

వర్సిటీ అధికారుల చెలగాటం ● పరీక్షలు, మార్కుల్లో ఇష్టారాజ్యం

విశ్వవిద్యాలయాల అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వారి నిర్లక్ష్యం విద్యా సంవత్సరం అస్తవ్యస్తానికి కారణమవుతోంది. పరీక్షలు, మార్కులు విషయంలో ఎంతో జాగరూగతతో వ్యవహరించాల్సిన అధికారులు వాటిని తేలిగ్గా తీసుకుంటూ పిల్లల్ని ముప్పు తిప్పలు పెడుతున్నారు. ప్రథమ శ్రేణి మార్కులు రావాల్సిన వారికి కూడా అత్తెసరు మార్కులు వేస్తూ మానసిక క్షోభకు కారణమవుతున్నారు. కొందరు ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని మార్కుల పేరిట వసూళ్ల దందాకు తెరలేపుతున్నారు. నిత్యం ఏదో ఒక వర్సిటీలో ఇలాంటి పరిస్థితితో రగడ జరుగుతున్నా విశ్వవిద్యాలయాలు గానీ... ఉన్నత విద్యాశాఖగానీ స్పందించడం లేదన్న విమర్శలున్నాయి.

ఎంతో కీలకమైన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో విశ్వవిద్యాలయాల అధికారుల తీరు అనుమానాల్ని రేకెత్తిస్తోంది. వరంగల్ కాకతీయ, డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో ఇటీవలే చోటుచేసుకున్న అవకతవకల ఘటనలు తాజా నిదర్శనాలు. తప్పకుండా సీటు వస్తుందనుకున్న వారు అసలు అర్హత సాధించకపోవడం... పరీక్ష రాసిన వారి జవాబులు దిద్దిన ఓఎంఆర్ పత్రాలు కనిపించకపోవడం లాంటివి తరచూ పునరావృతమవుతున్న విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు నాలుగు రోజులు హడావిడి చేసి ఆ తర్వాత మరిచిపోతున్నారు. ముఖ్యంగా ఆయా వర్సిటీల్లో పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల బాధ్యతను చూసే పరీక్షల విభాగాలపై నిత్యం ఆరోపణలు వస్తున్నాయి.

ఎన్నెన్నో అక్రమాలు...

- కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఫిల్, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలను కొద్ది రోజుల కిందట వెల్లడించారు. ప్రతిభావంతులకు ఆశించిన మార్కుల కంటే అతి తక్కువగా రావడంతో వారు షాక్ తిన్నారు. వందల మందికి ఇదే పరిస్థితి. దీనిపై విద్యార్థులు ఆందోళనకు దిగడంతో చివరకు అధికారులు క్షుణ్నంగా పరిశీలించారు. విద్యార్థుల ఆరోపణల్లో నిజం ఉన్నట్లు తేలింది. దాంతో మళ్లీ మార్కులను వెల్లడించినా ర్యాంకులను కేటాయించలేదు. మూల్యాంకనంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈ ఘటనతో స్పష్టమైంది. ఈ ఘటన విశ్వవిద్యాలయంలో పెద్ద రగడకు దారితీసింది.
- తెలంగాణ వర్సిటీలో 2013-14 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రవేశాల కోసం 2015 నవంబరులో ప్రకటన జారీచేశారు. 2016 మేలో పరీక్ష జరిగింది. విచిత్రమేమంటే పరీక్షరాసిన 14 మంది విద్యార్థుల ఓఎంఆర్ పత్రాలు కనిపించకుండాపోయాయి. కొందరు అధికారులు కావాలనే కొందరికి ఎక్కువ మార్కులు వేశారన్న ఆరోపణలున్నాయి. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుచేయగా.. 14 మంది ఓఎంఆర్ పత్రాలు కనిపించడం లేదని అధికారులు ధ్రువీకరించారు. ఈ క్రమంలో ప్రవేశాల ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. నిజాయితీగా పరీక్ష రాసిన వారు ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. పరీక్ష రాసిన అభ్యర్థులు కొందరు ముందుగానే సిబ్బందితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ వ్యవహారం జరిగినట్లు సమాచారం. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపితే అధికారులు, సిబ్బంది ముడుపుల పర్వం వెలుగుచూసే అవకాశం ఉంది.
- తెలంగాణ విశ్వవిద్యాలయలో 2012-13 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధించి రోస్టర్ పాయింట్లు పాటించలేదు. తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రవేశాలు కల్పించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చేశారు. చివరకు ఓ కమిటీని వేశారు. అది ఇచ్చిన నివేదికను అధికారులు బుట్టదాఖలు చేశారు.
- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గత మార్చిలో బీఎస్సీ హానర్స్ చివరి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరిగింది. విచిత్రమేమిటంటే అందులో వచ్చిన ప్రశ్నలు ఓ ప్రైవేట్ కళాశాల అంతకు ముందు నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షలో వచ్చినవే. దానిపై విద్యార్థులు ఆందోళనకు దిగడంతో మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఓయూ అధికారులు 2016లో ప్రశ్నపత్రం తయారీని ఆ ప్రైవేట్ కళాశాల అధ్యాపకురాలికి ఇచ్చారు.



తెలంగాణ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ పత్రాల మాయంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు(పాత చిత్రం)

ఆమె ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని ఆ ఏడాది వాడుకోలేదు. దాంతో ఆమె తాను పనిచేసే కళాశాలలో విద్యార్థులకు ఆ ప్రశ్నపత్రం ఇచ్చారు.

- ఓయూలో బీటెక్‌కు సంబంధించి నకిలీ ట్రాన్స్‌స్క్రిప్షన్ పత్రాలను సృష్టిస్తున్నారు. దీనిపై అనుమానం వచ్చిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరా తీస్తే నిజమేనని తేలింది. ఆ కేసులో మొత్తం అయిదుగురిని పోలీసులు అరెస్టుచేశారు. ఇది గత ఫిబ్రవరిలో వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో ఓయూలో పనిచేస్తున్న ముగ్గురు పొరుగు సేవల సిబ్బంది హస్తం ఉంది. వారిని తొలగించారు.

అవకతవకలకు కారణాలెన్నో..!

- పరీక్షల నిర్వహణ తర్వాత ఫలితాలు విడుదల చేసే బాధ్యత ఏదో ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తున్నారు. వారికి కనీసం తగిన సూచనలు చేయకపోవడం... అధికారుల పర్యవేక్షణ లేక తీరా ఫలితాల తర్వాత రగడకు దారితీస్తోంది.
- పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల విషయంలో కొందరు అధికారులు తమకు కావాల్సిన అభ్యర్థులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలున్నాయి.
- పరీక్షల విభాగంలో పనిచేసే సిబ్బందిలో 80 శాతం మందికిపైగా కాంట్రాక్టు, పొరుగు సేవలు, దినసరి వేతనంపై పనిచేసే వారే ఉంటున్నారు. ఉదాహరణకు జేఎన్‌టీయూహెచ్‌లో 220 మంది వరకు పొరుగు సేవల సిబ్బంది ఉండగా.. కేవలం 20 మంది వరకే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. అన్ని వర్సిటీల్లో ఇదే పరిస్థితి. ఏదైనా అక్రమాలు బయటపడితే తీసేస్తారు... అంతకంటే ఏం చేస్తారన్న ధైర్యంతో అభ్యర్థులతో చేతులు కలుపుతున్నారు. కొన్నిమార్లు కిందిస్థాయి తాత్కాలిక సిబ్బందినే బలి పశువులను చేస్తున్నారు.
- పరీక్షల ఫలితాల్లో తేడా వస్తే అధికారులు సాంకేతికంగా జరిగిన పొరపాటని తప్పించుకుంటున్నారు. అన్యాయం జరిగిందని భావిస్తే పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకుంటారన్న భావనతో అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- పునఃమూల్యాంకనంలో మార్కులు తేడా వస్తే విద్యార్థులు చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చే విధానం లేదు. దానివల్ల వర్సిటీకి ఆదాయం కూడా వస్తోందన్న భావనతో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- నిబంధనలు ఏమాత్రం తెలియని వారికి కూడా ప్రశ్నపత్రాల తయారీ బాధ్యతను అప్పగిస్తున్నారన్న విమర్శలున్నాయి. వారు మూడు రకాల ప్రశ్నపత్రాలు రూపొందించి వర్సిటీలకు పంపించాలి. ఏ ఒక్కటీ వారి వద్ద ఉంచుకోకూడదు. గత మార్చిలో బీకాం హానర్స్‌లో ఓ అధ్యాపకురాలు మాత్రం తన వద్దే ఉంచుకొని దాన్ని తమ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలో ఇచ్చారు. అది పరీక్ష వాయిదాకు కారణమైంది.
- కొన్ని చోట్ల అధికారులే అక్రమార్కులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలుండగా... మరికొందరు సిబ్బంది మాత్రం మార్కులు ఎక్కువ వేయిస్తాం... ఉత్తీర్ణులను చేస్తామని విద్యార్థుల నుంచి భారీగా దందా నడిపిస్తున్నారు.
- అక్రమం వెలుగు చూసినప్పుడు కమిటీ వేశామని... నివేదిక రాగానే కారకులపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఆతర్వాత కమిటీని, నివేదికలను బుట్టదాఖలు చేస్తున్నారు.
- ఎటువంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా తగిన నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నాయి. వాటిని పాటించకపోవడం వల్లే తరచూ పరీక్షలు, మార్కుల విషయంలో గందరగోళం జరుగుతోందని ఓయూకు చెందిన ఓ సీనియర్ ఆచార్యుడు అభిప్రాయపడ్డారు. ఓయూలో మూల్యాంకనం జరిగే సమయంలో బోర్డు ఆఫ్ స్టడీస్(బీఓఎస్) ఛైర్మన్ సైతం 15 సార్లు వెళ్లి జవాబుపత్రాలను పరిశీలించాలి. దీన్ని పాటించే వారిని వేళ్లపై లెక్కించుకోవచ్చని ఆయన తెలిపారు.

– ఈనాడు, హైదరాబాద్

పైసలిస్తే పనులైపోతాయ్!

- ఓయూలో పీహెచ్‌డీ సిద్ధాంత పత్రాల తయారీకి ఇక్కడ ధరలు ఉన్నాయి. డబ్బులిస్తే చాలు ఏ అంశంపైనా అయినా పీహెచ్‌డీ థీసిస్ తయారుచేస్తారు. కొన్ని విభాగాల్లో కొందరు ఆచార్యులే దీన్ని ప్రోత్సాహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.
- జేఎన్‌టీయూహెచ్‌లో మార్కులు వేయిస్తానని ఓ ఉద్యోగి ఒక్కో విద్యార్థి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలుచేశాడు. ఎంతకీ ఫలితం లేకపోవడంతో చివరకు విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. దాంతో అతన్ని విశ్వవిద్యాలయం సస్పెండ్ చేసింది. ఇతర విభాగాల సిబ్బంది పరీక్షల విభాగానికి వెళ్లకూడదు, అధికారులు కూడా అనుమతించకూడదు. అయినా సరే సస్పెండ్ అయిన ఉద్యోగి(గతంలో) తరచూ పరీక్షల విభాగానికి వెళ్లేవాడు. వారి ముందే యథేచ్ఛగా వెళ్లివస్తుండంతో విద్యార్థులు అతని వలలో పడ్డారు.
- జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. ఆ తర్వాత చూస్తే అతను ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. అతను 2015లో ఉత్తీర్ణుడైతే... 2016లో మార్కులు కలిపి ప్రథమ శ్రేణిలో పాస్‌చేశారు. దీని వెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి.
- పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో గత ఏడాది డిగ్రీ ఆంగ్లం పరీక్షల్లో పాత సిలబస్‌తో ప్రశ్నపత్రం ఇచ్చారు. దాంతో పరీక్షను వాయిదా వేశారు. మొత్తానికి వేల మందిని ఇబ్బందికి గురిచేశారు. ఇక పాసైనట్లు ధ్రువపత్రాలు వచ్చిన తర్వాత కూడా తప్పారని విద్యార్థులకు ఫోన్లుచేసి మరీ ఆందోళనకు గురిచేస్తున్న సందర్భాలు పలు వర్సిటీల్లో నిత్యకృత్యంగా మారాయి.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



జవాబుపత్రాల మూల్యాంకనం విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అందుకే అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా వ్యవహరించే వారినే పరీక్షల నియంత్రణ విభాగంలో నియమించాలి. పునఃమూల్యాంకనం పేరిట విద్యార్థులు ఏటా లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. అందుకే ఇంటర్ బోర్డు తరహాలో తక్కువ ఫీజుతో ఆన్‌లైన్‌లో పంపించే చర్యలు తీసుకోవాలి.

– అయ్యప్ప, కార్యదర్శి, ఏబీవీపీ

ఎంసెట్ బైపీసీ సీట్లన్నీ భర్తీ

ఈనాడు, హైదరాబాద్: బీఫార్మసీ, ఫార్మా డి, బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి టీఎస్ ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు సాంకేతిక విద్యా శాఖ మంగళవారం రాత్రి సీట్లు కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో మొత్తం 7,367 సీట్లు అందుబాటులో ఉండగా అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలనకు 13,176 మంది హాజరుకాగా వారిలో 7,367 మందికి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోపు రుసుం చెల్లించి 9లోపు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్ట్ చేసి ప్రవేశసంఖ్య పొందాలని అధికారులు తెలిపారు. చివరి విడత కౌన్సెలింగ్ ముగిసే వరకు అసలు ధ్రువపత్రాలను కళాశాలల్లో ఇవ్వరాదని సూచించారు.

అంకితభావంతో పనిచేయాలి: అధర్‌సిన్హా

ఈనాడు, హైదరాబాద్: కారుణ్య నియామకం ద్వారా నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు అంకిత భావంతో పనిచేసి బంగారు తెలంగాణ సాధనకు కృషిచేయాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా కోరారు. ప్రింటింగ్, స్టేషనరీ శాఖలో పనిచేస్తూ మృతిచెందిన 30 మంది ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను మంగళవారం సచివాలయంలో ఆయన అందించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశాలనుసారం త్వరితంగా నియామక ప్రక్రియ పూర్తిచేశామని అధర్‌సిన్హా చెప్పారు. ఈ అభ్యర్థులకు సాధారణ పరిపాలన శాఖ ద్వారా వివిధ విభాగాల్లో కారుణ్య నియామకాల కింద నియామక ఉత్తర్వులిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ సంయుక్త కార్యదర్శి అప్పారావు, అదనపు కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బీసీ విద్యార్థుల వివరాల సేకరణ

ఈనాడు, హైదరాబాద్: బీసీ కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బీసీ కులాలకు చెందిన విద్యార్థుల వివరాలను పాఠశాల విద్యాశాఖ సేకరిస్తోంది. ఉపకులాల వారీగా సేకరించి కమిషన్‌కు సమర్పిస్తామని, దీనికి సంబంధించి ఇప్పటికే డీఈఓలకు ఆదేశాలు ఇచ్చామని అధికారులు తెలిపారు. సర్కారు బడుల్లో 22.87 లక్షల మంది విద్యార్థులుండగా వారిలో 12 లక్షలకుపైగా బీసీ విద్యార్థులు ఉన్నట్లు అంచనా.

నకిలీ అద్దె ఒప్పందాలతో బ్యాంకుకు టోకరా

హవాలాకు సహకారం.. ఇద్దరి అరెస్టు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: నకిలీ అద్దె అగ్రిమెంట్లతో బ్యాంకు ఖాతాలు తెరిచిన వ్యక్తితోపాటు అతనికి సహకరించిన ఓ బ్యాంకు ఉద్యోగి మంగళవారం కటకటాల పాలయ్యారు. ఆబిడ్స్‌కు చెందిన వ్యాపారి మహేందర్‌క్షత్రీ వ్యాట్ రిజిస్ట్రేషన్ విషయంలో సాయం చేయాలని దళారి ధరణిసాయికిరణ్‌ను సంప్రదించాడు. అతను ఐఎన్‌జీ వైశ్యా బ్యాంకు ఆబిడ్స్ శాఖలో పనిచేస్తున్న సీహెచ్.దుర్గాప్రసాద్ వద్దకు వచ్చి సహకారం కోరాడు. వ్యాపారం చేసేందుకు భవనాలను అద్దెకు తీసుకున్నట్లు నకిలీ అగ్రిమెంట్లు తయారుచేసి ఇవ్వడంతో వాటిని ఉపయోగించుకొని వ్యాట్ రిజిస్ట్రేషన్‌తోపాటు చందానగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మూడు కరెంట్ ఖాతాలు తెరిపించాడు. కంపెనీలు లేకుండానే కరెంటు అకౌంట్లలోకి డబ్బులు వేయడం, డాలర్లలోకి మార్చి మహేందర్‌క్షత్రీ హవాలాకు పాల్పడ్డారు. రూ.31 కోట్లు హవాలాకు పాల్పడినట్లు ఆదాయ పన్నుశాఖ, ఈడీ అధికారులు గుర్తించారు. గతనెల 23న మహేంద్రక్షత్రితోపాటు హవాలాకు సహకరించిన బేగంబజారుకు చెందిన వినోద్ ఓజా, ఆనంద్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును మోసగించిన కేసులో ఆబ్యాంకు మేనేజర్ శైలజ ఫిర్యాదు మేరకు దుర్గాప్రసాద్, ధరణిసాయి కుమార్‌ను చందానగర్ పోలీసులు అరెస్టు చేశారు.

ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగాలి

- వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో కలిసి ఐక్య ఉద్యమాలు
- మూడేళ్లలో తెలంగాణ సర్కారు ఒక్కహామీనీ నెరవేర్చలేదు
- సీపీఐ రాష్ట్ర సదస్సులో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మూడేళ్ల తర్వాత కూడా అభివృద్ధి దిశగా అడుగులు పడడంలేదని.. రాష్ట్రంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ కలిసి ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగాలని పలువురు వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అందుకనుగుణంగా ప్రజాసమస్యలపై ఐక్య ఉద్యమాలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోసంరక్షణ పేరిట దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. మోదీతో పోటీ పడుతున్నారని విమర్శించారు. మూడేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్కహామీని నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. 'తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి- సామాజిక న్యాయం' అనే అంశంపై సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారమిక్కడ రాష్ట్ర సదస్సును నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రసంగిస్తూ.. దళితులకు మూడెకరాల భూమిని, రెండు పడకల ఇంటిని నిర్మించడానికి నిధుల సమస్యలొస్తున్నాయి.. కానీ ముఖ్యమంత్రి మాత్రం రూ.కోట్లు ఖర్చుపెట్టి కొత్త నివాస గృహాన్ని నిర్మించుకున్నారని మండిపడ్డారు. ధర్నాచౌక్‌ను మూసేసినంత మాత్రాన ప్రజల హృదయాల్లోని ఆగ్రహావేశాలు ఎక్కడికెళ్తాయి? మరోరూపంలో వాటిని ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఐకాస ఛైర్మన్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు పాల్పడుతున్నదని.. నయీం భూములు గుంజుకుంటున్నడని విన్నాంగానీ.. ఇప్పుడు మా ఊళ్లలో చూస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా వచ్చే అక్టోబరు 5 నుంచి డిసెంబరు 5 వరకూ బస్సుయాత్ర నిర్వహిస్తామని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సదస్సులో ప్రజాగాయకుడు గద్దర్, ఆచార్య హరగోపాల్, విమలక్క, విశ్వేశ్వరరావు అజీజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ రాష్ట్ర సదస్సులో కార్యకర్తలు బహూకరించిన ఖడ్గంతో సురవరం. చిత్రంలో నారాయణ, చాడ

నేరెళ్ల నిందితులకు బెయిలు

కరీంనగర్, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో లారీల దహనం కేసులో నిందితులు ఎనిమిది మందికి కరీంనగర్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. గత నెల 2న నేరెళ్ల గ్రామానికి చెందిన బదనాపురం భూమయ్య(60)ను ఇసుక లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ప్రమాదానికి కారణమైన లారీతోపాటు మరో మూడులారీలకు నిప్పంటించారు. ఈ సంఘటనకు సంబంధించి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులకు అదనపు సెషన్స్ న్యాయమూర్తి శ్రీనివాసులు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. నిందితులు బుధవారం జిల్లా కారాగారం నుంచి విడుదలవుతారు.

పోలీసులపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

కరీంనగర్(ముకరంపుర), న్యూస్‌టుడే: ఇసుక లారీల దహనం సంఘటనపై పూర్తిస్థాయిలో విచారించకుండా నేరెళ్ల, జిల్లెల గ్రామానికి చెందిన అమాయకులను చిత్రహింసలకు గురి చేసిన రాజన్న సిరిసిల్ల పోలీసులపై ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ కోరారు. ఇంత జరిగినా దీనిపై ముఖ్యమంత్రి స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కేటీఆర్ సైతం తీవ్రం పరిగణించపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కరీంనగర్ కారాగారంలో ఉన్న నేరెళ్ల, జిల్లెల బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. లారీల దహనం సంఘటనలో పోలీసులు అతిగా స్పందించారని ఆరోపించారు. ఎనిమిది మందిని నాలుగు రోజుల పాటు చిత్రహింసలకు గురి చేశారని.. ప్రస్తుతం బాధితులు బతకలేక, చావలేని స్థితిలో కొట్టిమిట్టాడుతున్నారన్నారు. ఈ విషయంపై మొదటి నుంచి భాజపా ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్ర, జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టును ఆశ్రయించిందన్నారు.



కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మణ్

అత్యవసర పరిస్థితిని తలపిస్తున్న సిరిసిల్ల: వరవరరావు

కరీంనగర్ (తెలంగాణచౌక్), న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యవసర పరిస్థితులను తలపించే వాతావరణం నెలకొందని విరసం నేత వరవరరావు ఆరోపించారు. నేరెళ్లలో 8 మందిని అరెస్ట్ చేసి, తీవ్రంగా చిత్రహింసలు పెట్టిన ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న బాధితులను కలుసుకున్నారు. అనంతరం జైలు ఆవరణలో పాత్రికేయులతో మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా నుంచి ఇసుకను సింగపూర్, మలేషియాలకు తరలిస్తున్నారని ఆయన చెప్పారు.

వ్యవహారాన్ని అపెక్స్ కమిటీ ముందుంచారా?

- వివరాలు సమర్పించండి
- ఆయేషా మీరా హత్య కేసులో ఏపీ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో దర్యాప్తు సక్రమంగా నిర్వహించని బాధ్యులైన అధికారులపై చట్ట ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకొనేందుకు వీలుగా ఈ వ్యవహారాన్ని 'అపెక్స్ కమిటీ' ముందు ఉంచారా? లేదా?.. ఉంచితే ఆ కమిటీ ఇప్పటి వరకు ఏమి చేసిందో వివరాలు సమర్పించాలని ఏపీ హోంశాఖను హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ కమిటీ ముందు నివేదించకపోతే అందుకు కారణాలేమిటో తెలపాలని స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. విచారణను ఈనెల 8కి వాయిదా వేసింది.

ఆయేషా మీరా హత్య కేసులో సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ ఈ ఏడాది మార్చి 31న హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అసలు దోషులను శిక్షించే నిమిత్తం.. ఈ కేసుపై పునర్ దర్యాప్తు జరిపేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఉస్మానియా వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రమా ఎస్ మేల్కొటే, పాత్రికేయురాలు కె.సజయ, సామాజిక ఉద్యమకారిణి సంధ్యారాణి వల్లూరుపల్లి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరపున న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపించారు. సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో.. దర్యాప్తు జరిపిన తీరును తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. దర్యాప్తును సక్రమంగా నిర్వహించని బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు హోంశాఖ, న్యాయశాఖ కార్యదర్శులు తదితరులతో ఏర్పాటుచేసిన అపెక్స్ కమిటీ ముందు ఈ వ్యవహారాన్ని ఉంచాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొందన్నారు.

ఆయేషా కేసులో సీబీఐ విచారణ జరిపించాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: తమ కుమార్తె ఆయేషా కేసులో అసలు నేరస్థులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అందుకు సీబీఐ విచారణ జరపాలని తల్లిదండ్రులు శంషాద్ బేగం, మహ్మద్ బాషా డిమాండ్ చేశారు. ఇటీవల ప్రజా సంఘాలు ఆయేషా కేసులో పిల్ వేయగా విషయం తెలిసి తాము రిట్ పిటిషన్ వేశామన్నారు. మంగళవారం హైకోర్టులో ఆయేషా కేసు విచారణ అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తన కూతురున్న హాస్టల్ వార్డన్‌ను ఇప్పటి దాకా అదుపులోకి తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ప్రొ.రమా మేల్కొటే మాట్లాడుతూ సత్యంబాబు నిర్దోషి అని న్యాయస్థానం తేలిస్తే మరి దోషి ఎవరన్నారు? దానిపై విచారణ చేయాలని ఆదేశించినా ఏపీ ప్రభుత్వం మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు.

కాంగ్రెస్ నాయకులే ఇసుక దోపిడీదారులు: పల్లా

ఈనాడు, హైదరాబాద్: అసలైన ఇసుక దోపిడీదారులు కాంగ్రెస్ నాయకులేనని తెరాస శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. తెరాస శాసనసభ కార్యాలయంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేరెళ్లలో జరిగింది ఒకటైతే దానికి మసిబూసి మారేడుకాయ చేసినట్లుగా మీరాకుమార్‌ను పక్కదారి పట్టించారని.. ఆమె చేత అబద్ధాలు చెప్పించారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే ఇసుక దందాలు యథేచ్ఛగా కొనసాగాయనీ, ఇసుక మీద రూ.50 కోట్లు కూడా ఆదాయం రాలేదన్నారు. తెరాస అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఏడాదికి రూ.400 కోట్ల చొప్పున ఇసుక ఆదాయం సమకూరిందని తెలిపారు.

రాష్ట్రానికి మచ్చతెచ్చేలా కాంగ్రెస్ చర్యలు: శ్రీనివాస్‌గౌడ్

అధికార దాహంతో కాంగ్రెస్ నాయకులు విచక్షణ మరిచిపోయి ప్రవర్తిస్తున్నారని.. వారి చర్యలు తెలంగాణకు మచ్చతెచ్చేలా ఉన్నాయని మహబూబ్‌నగర్ శాసన సభ్యులు వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. తెరాస శాసన సభపక్ష కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెరాస మూడేళ్ల పాలనను చూసి ఓర్వలేక కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందన్నారు. తెలంగాణలో జరిగిన భూకబ్జాలన్నీ కాంగ్రెస్ చలవేననీ, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా శ్రద్ధపెట్టి భూఆక్రమణలకు కళ్లెం వేశారని తెలిపారు. మంత్రి కేటీఆర్ సమర్థమైన సేవలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించడాన్ని చూసి.. కాంగ్రెస్ నేతలు ఆయన్ను లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

15 లోపు బాల కార్మికులను గుర్తించండి

ఈనాడు, హైదరాబాద్: బాల, వీధి కార్మికుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో పట్టణ గురుకుల పాఠశాలలు ప్రారంభిస్తున్నందున కలెక్టర్లు ఈ నెల 15వ తేదీ లోపు వారిని గుర్తించి ఆ పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. సచివాలయంలో పోలీసు, కార్మికశాఖ తదితర శాఖల అధికారులతో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్లు వివిధ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించి బాల కార్మికులను, వీధి పిల్లల్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

లింగమార్పిడి వ్యక్తికి మగబిడ్డ పుట్టాడు!

వాషింగ్టన్: అమెరికా ఒరేగాన్ పోర్ట్‌లాండ్‌కు చెందిన లింగమార్పిడి చేయించుకున్న ట్రిస్టాన్ రీస్(34) అతని భాగస్వామి బిఫ్ చాప్లో(31) పండంటి బాబు లియోను సంతానంగా పొందారు. లింగమార్పిడి చేయించుకున్న రీస్ గర్భం దాల్చి వార్తల్లోకెక్కిన సంగతి తెలిసిందే. జులై 24న తమకు మగబిడ్డ జన్మించిన విషయాన్ని ఫేస్‌బుక్ వేదికగా తాజాగా ప్రకటించారు. రీస్, చిన్నారి ఆరోగ్యంగా ఉన్నారనీ, తామెంతో సంతోషంగా ఉన్నట్లు ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. రీస్, చాప్లో ఇప్పటికే ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్నారు. ఇది తన జీవితంలో అద్భుతమైన అనుభవమని రీస్ 'గ్లోబల్‌న్యూస్'తో పేర్కొన్నారు. గర్భధారణ ప్రస్థానం మొత్తాన్ని వీరు సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు నమోదు చేశారు. వారి ఉద్వేగాలను అందరితోనూ పంచుకున్నారు. లింగమార్పిడి చేయించుకున్నా గర్భాశయం అలాగే ఉండటంతో గర్భధారణ సాధ్యమైంది. గర్భధారణ ప్రక్రియలో భాగంగా పురుష హార్మోన్లయిన టెస్టోస్టిరాన్లను తీసుకోవడం కొంతకాలంగా ఆపేశారు. లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తి సంతానానికి జన్మనివ్వడం ఇదేమీ తొలిసారి కాదు. జూన్‌లో హేడెన్ క్రాస్(21) ఒక వీర్యదాత ద్వారా గర్భందాల్చిన తొలి వ్యక్తిగా బ్రిటన్‌లో పేరొందారు.

వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు ఈ-రకమ్ పోర్టల్

దిల్లీ: రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-రకమ్ (ఈ-రాష్ట్రీయ్ కిసాన్ అగ్రి మండి) పోర్టల్‌ను ప్రారంభించింది. ఎమ్ఎస్‌టీసీ, కేంద్ర గిడ్డంగుల కార్పొరేషన్‌కు అనుబంధంగా పనిచేసే సీఆర్‌డబ్ల్యూసీ సంయుక్తంగా ఈ పోర్టల్‌ను రూపొందించాయి. ఈ మేరకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్, కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి రామ్ విలాస్ పాస్వాన్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మొదటి దశలో భాగంగా వేలం ద్వారా 20 లక్షల టన్నుల ధాన్యం అమ్మకం, కొనుగోళ్లకు ఈ పోర్టల్ వేదిక కానుందని మంత్రి రామ్ విలాస్ పాస్వాన్ తెలిపారు. ఈ-రకమ్ పోర్టల్ కుగ్రామ రైతులను ప్రపంచంలోని పెద్ద మార్కెట్లకు అనుసంధానించే మొట్టమొదటి అంతర్జాల పోర్టల్.

వ్యవసాయ రుణాలు పక్కదారి

- దళారులతో కలిసి బ్యాంకు అధికారులు చేతివాటం
- అవిభాజ్య ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో బాగోతం
- విస్తుగొలుపుతున్న సత్తుపల్లి అంశం

ఈనాడు – ఖమ్మం

వ్యవసాయ రుణాలు పక్కదారి పడుతున్నాయి. స్వయానా కొందరు బ్యాంకు అధికారులే అక్రమాలకు తెరలేపుతున్నారు. పూర్వ ఖమ్మం, వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో ఇటీవల జరుగుతున్న ఉదంతాలే ఇందుకు నిదర్శనం. తాజాగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వెలుగుచూసిన రుణ బాగోతం విస్తుపోయేలా చేస్తోంది. ఇప్పుడు రుణం తీసుకుంటే... వచ్చే ఎన్నికల తర్వాత వాటిని ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ప్రచారంతో కొందరు ఈ అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వరంగ, వాణిజ్య బ్యాంకులు రైతులకు రుణాలిస్తుంటాయి. కొందరు నకిలీ పాసు పుస్తకాలు, నకిలీ పహాణీలు సృష్టించి.. బ్యాంకులకు సమర్పించి.. రుణాలు మంజూరు చేయించుకున్నారు. ఈ క్రతువులో రుణ గ్రహీతలతోపాటు దళారులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కవుతున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వెలుగుచూసిన బాగోతమే ఇందుకు తాజా ఉదాహరణ. స్థానికంగా ఓ బ్యాంకులో 557 మంది రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో 500 మంది నకిలీ పాసుపుస్తకాలు, పహాణీలు నమోదుచేసి రుణాలు పొందినట్లు గుర్తించారు. ఏపనీ చేయనివారు... ఇటీవల జులాయిగా తిరగడం, ఖరీదైన పార్టీలు చేసుకోవడంతో కొందరికి అనుమానం వచ్చింది. ఈ క్రమంలోనే తాగిన మైకంలో ఓ వ్యక్తి నకిలీ పత్రాలతో సదరు బ్యాంకులో రుణం తీసుకున్నట్లు వెల్లడించడంతో, అసలు విషయం బయటపడింది. నాలుగైదు రోజులుగా దీనిపై విచారణ జరుగుతోంది. ప్రస్తుతానికి సుమారు 12 మంది నిందితులను గుర్తించారు. వీరిలో బ్యాంకు సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. ఈ రుణ తతంగం పది నెలలుగా నడుస్తున్నట్లు ప్రాథమికంగా తేలింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను తీసుకుంటే.. 3,59,493 మంది గతంలో రుణమాఫీకి అర్హత సాధించారు. వీరిలో కొందరు నకిలీ పాసుపుస్తకాలు, పహాణీలు నమోదుచేసి రుణం తీసుకున్నట్లు సమాచారం.




నకిలీ దస్త్రాలను మూటగడుతున్న విచారణ సిబ్బంది

ఏయే జిల్లాల్లో...

- ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకులో సుమారు 70 మంది ఆరు నెలల క్రితం నకిలీ పహాణీలు సృష్టించి రుణం పొందారు. ఇదే జిల్లా తిరుమలాయపాలెం మండలానికి చెందిన ఓ వ్యక్తి.. ఖమ్మం నగరంలోని ఓ వాణిజ్య బ్యాంకులో నకిలీ పాసుపుస్తకాలు, పహాణీలు నమోదు చేయించి ఇటీవల రుణాలు ఇప్పించాడు. సత్తుపల్లి అంశం వెలుగులోకి రాగానే ఆయన పరారయ్యాడు. వైరాలోని ఓ బ్యాంకు సహాయ నిర్వాహకుడు ఖాతాదారుల సొమ్మునే మింగేశాడు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు ప్రాంతంలోని ఓ బ్యాంకులోనూ, యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట ప్రాంతంలోనూ నకిలీ పాసుపుస్తకాలతో రుణం పొందడం కలకలం రేపాయి.
- సూర్యాపేట జిల్లా కోదాడ, గరిపేట, నల్గొండ జిల్లా దేవరపల్లి, చింతకొండ ప్రాంతంలోని కొన్ని బ్యాంకుల్లో ఇదే పరిస్థితి.
- అవిభాజ్య కరీంనగర్ జిల్లాలోని పలు బ్యాంకుల నుంచి కొందరు నకిలీ పాసుపుస్తకాలు, పహాణీలు సమర్పించి రుణం తీసుకున్న బాగోతాలు వెలుగుచూశాయి. కానీ, ఇప్పటివరకూ ఏ జిల్లాల్లోనూ అక్రమార్కులకు సరైన శిక్షలు పడలేదు. విషయం వెలుగు చూసినపుడు హడావుడి చేయడం పరిపాటిగా మారింది.

అధికారులే సూత్రధారులు...: బ్యాంకుల అధికారులే సూత్రధారులుగా మారి అక్రమ రుణాలు మంజూరు చేసిన ఉదాంతాలున్నాయి. వారిని సస్పెన్షన్‌తో సరిపుచ్చడం అనుమానాలకు తావిస్తోంది. ఒకే సర్వే నంబరుపై పలువురు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా.. కంప్యూటర్లో అన్ని రకాల సమాచారం ఉన్నా.. కనీసం ఆరా తీయడంలేదు. దీంతో ఏదోక సర్వే నంబరుపై పాసుపుస్తకాలు, పహాణీలు సృష్టించి, రుణాలు పొందడం పరిపాటిగా మారింది. తాజాగా, వచ్చే సాధారణ ఎన్నికల్లో 'రూ.2 లక్షల వరకు రుణమాఫీ' హామీ ఇస్తారని ప్రచారం జరుగుతుండటంతో... మరింత మంది రుణాల కోసం ప్రయత్నిస్తున్నారు. అవిభాజ్య ఖమ్మం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శిరపాణి నాయక్‌ను వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

కనుసైగతో కంప్యూటర్‌ను నియంత్రించొచ్చు




★ అధునాతన కళ్లద్దాలు అభివృద్ధి

బీజింగ్: ఇకపై కనుసైగతో కంప్యూటర్లు, స్మార్ట్ విద్యుత్ దీపాలను నియంత్రించొచ్చు. దీని కోసం అధునాతన కళ్లద్దాలను పరిశోధకులు అభివృద్ధిచేశారు. వీటిని ఓ సెన్సర్‌తో అనుసంధానించారు. ఇది కంటి కదలికలను విద్యుత్ సంకేతంగా మారుస్తుంది. దీంతో పరిసరాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలను వీటి సాయంతో ఇట్టే నియంత్రించొచ్చు. చైనాలోని చోంగ్‌కింగ్ వర్సిటీ నిపుణులు తయారుచేసిన ఈ సెన్సర్ మనం కళ్లద్దాలు పెట్టుకున్న వెంటనే పనిచేయడం ప్రారంభిస్తుంది. మన కంటి కదలికలను నిశితంగా గమనిస్తుంటుంది. మనం దేనివైపు చూస్తున్నామో పరిశీలిస్తుంది. ఉదాహరణకు మనం కంప్యూటర్ తెరపై ఓ అక్షరాన్ని చూసి కళ్లు కదలిస్తే.. వెంటనే ఆ అక్షరం వైపునకు మౌస్ కదిలేలా సెన్సర్ సంకేతం పంపిస్తుంది. విద్యుత్ దీపాలనూ ఇలానే ఆన్/ఆఫ్ చేయొచ్చని పరిశోధకులు తెలిపారు. పక్షవాత బాధితులకు ఈ కళ్లద్దాలు చక్కగా ఉపయోగపడే అవకాశముందని వారు వివరించారు.



పేలుడు పదార్థాల జాడ చెప్పేస్తుంది!



★ కాంతి ఆధారిత పరికరాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు

న్యూయార్క్: రసాయనిక, జీవ సంబంధమైన నమూనాల్లో వివిధ అణు సమ్మేళనాలను స్పష్టంగా గుర్తించగల సరికొత్త దృశాపరికరాన్ని అమెరికా శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. విద్యుదయస్కాంత వర్ణపటంలోని మధ్యస్థాయి పరారుణ కాంతి ఆధారంగా ఈ సెన్సర్ పని చేస్తుంది. అందులో రెండు లోహపు పొరలు ఉంటాయి. వాటి మధ్య దూరం 5 నానోమీటర్ల కంటే తక్కువ కావడం గమనార్హం. పొరల మధ్య ఇన్సులేటర్ ఉంటుంది. సెన్సర్ లోహపు పొరల మధ్య ఖాళీ కారణంగా.. పరారుణ కాంతి శోషణ సామర్థ్యం అధికమవుతుంది. పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే రసాయనాల జాడను కనిపెట్టేందుకు, రక్త నమూనాల్లో మత్తుమందులను గుర్తించేందుకు, వ్యాధుల తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తాజా సెన్సర్ దోహదపడుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

చిన్నతనంలో వ్యాయామం... స్థూలకాయం, క్యాన్సర్ ముప్పు దూరం!



న్యూయార్క్: బాల్యం, కౌమారంలో ఎక్కువగా ఆటలు ఆడేవారికి భవిష్యత్తులో స్థూలకాయం, క్యాన్సర్,హృద్రోగం తదితర వ్యాధులొచ్చే ముప్పు చాలా తక్కువని ఓ పరిశోధన తేల్చింది. పరుగులు తీయడం, ఈత కొట్టడం వంటివి చేయడం వల్ల పిల్లల్లో ఎముకలు దృఢమవుతాయి. అంతేకాదు, ఆ వయసులో తీసుకున్న ఆహారాన్ని శక్తిగా మార్చుకున్న క్రమాన్ని అస్థి వ్యవస్థ ఏళ్ల తర బడి గుర్తుపెట్టుకుంటుందట! మధ్య వయసుకు వచ్చాక కొవ్వుపదార్థాలను ఎక్కువగా తీసుకున్నా... చిన్నప్పటి తీరులోనే వాటినిజీర్ణం చేసుకుంటాయనీ.. ఫలితంగా కొవ్వు కారణంగా వచ్చే జబ్బులు ఇలాంటి వారిని దరిచేరడం అంత సులభంకాదని పరిశోధకులు భావిస్తున్నారు. ఆక్‌లాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన జన్యు శాస్త్రవేత్త జస్టిన్ సులీవన్.. కొన్ని ఎలుకలపై పరీక్షలు నిర్వహించి, ఈ విషయాన్ని రూఢి పరిచారు. చదువుతో పాటు పిల్లలకు ఆటలు కూడా ముఖ్యమని చెబుతున్నారు.

అట్లాంటాలో ఖీర్‌భవానీ మందిరం!

వాషింగ్టన్: కశ్మీరులోయలోని సుప్రసిద్ధ ఖీర్ భవానీ ఆలయ నమూనాను అమెరికాలో ఆవిష్కరించనున్నారు. అట్లాంటాలో ఈ ఆలయాన్ని అమెరికాలో స్థిరపడిన కశ్మీరీల ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. కశ్మీరు కొండకోనల్లో కొలువై ఉన్న ఖీర్‌భవానీ మాత ఆలయాన్ని ముమ్మూర్తులా పోలి ఉండేలా ఇక్కడి కోవెలను తీర్చిదిద్దుతారు.

కూడంకుళంపై భారత్, రష్యా 3 ఒప్పందాలు

దిల్లీ: తమిళనాడులోని కూడంకుళం అణు విద్యుత్తు కేంద్రంలోని 5, 6 యూనిట్లకు ప్రధాన ఉపకరణాల సరఫరా, ఆకృతి పనులకు సంబంధించి భారత్, రష్యాలు 3 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ప్రధాని నరేంద్రమోదీ రష్యా పర్యటన సందర్భంగా కుదిరిన ప్రధాన ఒప్పందం తర్వాత రెండు నెలలకు తాజా ఒప్పందాలు జరిగాయి. భారత్‌కు చెందిన ఎన్‌పీసీఐఎల్, రష్యా సంస్థ జేఎస్‌సీ ఆటంస్ట్రాయ్ ఎక్స్‌పోర్ట్ మధ్య ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ప్రైవేట్ వైద్య కళాశాలల అనుమతుల వ్యవహారాన్ని పునఃపరిశీలించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు వెల్లడి

దిల్లీ: విద్యార్థుల్ని చేర్చుకోకుండా నిలువరించిన పలు ప్రైవేట్ వైద్య కళాశాలలకు అనుమతినిచ్చే వ్యవహారాన్ని పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. భారత వైద్య మండలి(ఎంసీఐ), విచారణ కమిటీ, ఆరోగ్యసేవల డీజీ, పర్యవేక్షక కమిటీ సిఫార్సుల్ని పునఃసమీక్షించాలని పేర్కొంది. ఈ ప్రక్రియంతా పది రోజుల్లో పూర్తవ్వాలనీ, అన్ని పక్షాలు సహకరించాలని జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ధర్మాసనంలో జస్టిస్ అమితవరాయ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ కూడా ఉన్నారు. తదుపరి విచారణకు ఆగస్టు 24కు వాయిదా వేసింది. 2017-18, 2018-19 విద్యాసంవత్సరాల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించకుండా అనుమతి రద్దుచేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్ని సవాలు చేస్తూ కొన్ని కళాశాలలు వేసిన పిటిషన్లపై తాజా విచారణ నిర్వహించారు. వైద్య కళాశాలలకు అనుమతినిచ్చే విషయంలో సహేతుక నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వ విధి అని ధర్మాసనం స్పష్టం చేసింది. 2017-18 విద్యాసంవత్సరానికి పశ్చిమబెంగాల్ బుర్ద్వాన్‌లోని ఐక్యా సిటీ వైద్య కళాశాలకు ప్రవేశాల అనుమతినిచ్చే విషయంలో పర్యవేక్షక కమిటీని సంప్రదించి రెండువారాల్లో నిర్ణయం తీసుకోవాలంది.

పచ్చదనం ఒడి.. చిన్నారుల బడి

పచ్చని పొలాల మధ్య ఉన్న ఈ పాఠశాల కేరళలోనో, లేక మరేదైనా ప్రాంతంలోనిదో కాదు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం బోయపల్లి తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఇది. వర్షాకాలం సమయంలో చుట్టూ పచ్చదనం పరచుకుని ఈ ఆహ్లాదకర దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఈ పాఠశాలలో 34 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

– ఈనాడు, మహబూబ్‌నగర్



జగమంతా పత్తిమయం!

- ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన సాగు
- పాత నిల్వలు 96 లక్షల టన్నులు
- ఫ్యూచర్స్ మార్కెట్‌లో తగ్గుతున్న ధరలు
- బీటీ పత్తి వేసే రైతులూ... పారాహుషార్

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ ఏడాది చైనా కాకుండా మిగతా దేశాల్లో పత్తి నిల్వలు రికార్డు స్థాయిలో 17 శాతం పెరిగి 96 లక్షల టన్నులకు చేరినందున ధరలు తగ్గే సూచనలున్నాయని అంతర్జాతీయ పత్తి సంస్థ తాజా అంచనాల్లో వెల్లడించింది. ఏప్రిల్‌లో తెలుగు రాష్ట్రాల్లో పత్తికి క్వింటాకు రూ.6 వేల దాకా ధర పలికింది. అప్పుడు స్పాట్ ఎక్స్ఛేంజీలో పత్తి క్యాండీ ధర రూ.41,900 వరకు ఉంటే ఈ నెల 8న రూ.41,500కు పడిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, మరింత ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తుందని అంచనాలు వెలువడుతున్నందున పత్తి ఫ్యూచర్స్ ధరల్లో సైతం తగ్గుదల కనిపిస్తోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది చైనాలో పత్తి రైతులకు రాయితీలు పెంచడం వల్ల 3 శాతం వరకు సాగు విస్తీర్ణం పెరిగి 32 లక్షల హెక్టార్లకు చేరింది. ఇది ఇతర దేశాల పత్తి ఎగుమతులకు ప్రతికూలంగా భావిస్తున్నారు. పైగా చైనా కాకుండా ఇతర దేశాల మార్కెట్లలో ఇప్పటికే 96 లక్షల టన్నుల పాత పత్తి నిల్వలు పేరుకుపోయాయి. వచ్చే నవంబరులో కొత్త పంట వచ్చేనాటికల్లా దీనిని మార్కెట్‌లోకి వదలడం ఖాయం. తద్వారా మార్కెట్‌పై ఒత్తిడి పెరిగి ధర పతనం కొనసాగవచ్చని వ్యాపారవర్గాల అంచనా. మరోవైపు వరసగా రెండేళ్ల తర్వాత ఈ ఏడాది పాకిస్థాన్‌లో సాగు విస్తీర్ణం 8 శాతం పెరిగి 27 లక్షల హెక్టార్లకు చేరింది. ఈ దేశంలో ఈ ఏడాది 20 లక్షల టన్నుల పత్తి పంట మార్కెట్‌కు వస్తుందని తాజా అంచనా. ఇది గతేడాదికన్నా 11 శాతం అధికం.



గతేడాది అధిక ధరను ఇప్పుడు ఆశించొద్దు...

గతేడాది పత్తికి వచ్చిన అధిక ధరను ఆశిస్తూ ఈ సీజన్‌లో పత్తి సాగు చేయవద్దని ప్రపంచ వ్యాప్తంగా సంకేతాలు వెలువడుతున్నాయి. గతేడాది(2016-17)లో ధర అధికంగా రావడానికి...అంతకుముందు ఏడాది(2015-16)లో ప్రపంచ పత్తి దిగుబడులు 19 శాతం(2.13 కోట్ల టన్నులు) తగ్గడమే ప్రధాన కారణం. 2002-03 తర్వాత ప్రపంచ పత్తి దిగుబడులు దారుణంగా 2015-16లోనే తగ్గాయి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 3.18 కోట్ల హెక్టార్లలో పత్తి సాగవుతోంది. ఇందులో భారతదేశంలో పండేదే 3వ వంతు వరకు ఉంటుంది. ప్రపంచంలో అత్యధికంగా పత్తి పండిస్తున్న దేశం ఇదే. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 2.45 కోట్ల టన్నుల పత్తి పంట దిగుబడి వస్తుందని తాజాగా అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ ప్రకటించింది. భారతదేశంలో ముమ్మరంగా పత్తి విత్తనాలు వేస్తున్నారు. వచ్చే నవంబరు నాటికి ప్రపంచ మార్కెట్‌లోకి పత్తి వరదలా వెల్లువెత్తినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఒకరు 'ఈనాడు'కు చెప్పారు. పత్తి వేసే రైతులు తప్పనిసరిగా అందులో అంతరపంటగా కంది, మినుము, మొక్కజొన్నను వేసుకోవాలని ఆయన సూచించారు. పత్తికి ధర లేకున్నా అంతర పంటలు కొంతమేర ఆదుకుంటాయన్నారు. తెలంగాణలో ఇప్పటికే 30 లక్షల ఎకరాల్లో పత్తి వేయడం గమనార్హం. మరో 10 లక్షల ఎకరాల వరకు వేస్తారని అంచనా.

ప్రపంచ పత్తి మార్కెట్ తీరు (మిలియన్ టన్నులు)

అంశం	2015–16	2016–17	2017–18 (అంచనా)
దిగుబడి	21.30	22.93	24.57
వినియోగం	24.28	24.31	24.73
ఎగుమతులు	7.55	7.93	7.84
పాత నిల్వలు	18.68	17.30	17.15

శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి పుష్కరిణిని మరమ్మతు పనులకు మంగళవారం మూసివేసినట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 31 రోజుల పాటు భక్తులను అనుమతించబోమని చెప్పారు. ప్రత్యామ్నాయంగా పుష్కరిణి సమీపంలో భక్తుల స్నానాలకు కుళాయిలను ఏర్పాటు చేశామని తెలిపారు.

7న శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా ఈనెల 7న సాయంత్రం 4.30 నుంచి 8న తెల్లవారుజామున 2 గంటల వరకు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేయనున్నట్లు జేఈవో తెలిపారు. గ్రహణం సమయంలో తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో అన్నప్రసాద వితరణ ఉండదని చెప్పారు. రెండు కాలిబాట మార్గాల్లో భక్తుల సందేహాల నివృత్తికి సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వసుంధర

వేడుకల్లో... వైవిధ్యంగా!

పండగలంటే చీరలేనా...ఆధునిక దుస్తులతోనే సంప్రదాయంగా కనిపించడం సాధ్యం కాదా... ఈసారి పండగలకు కొత్తగా ప్రయత్నిద్దాం..అని అనుకునేవారికి మరెన్నో ప్రత్యామ్నాయాలున్నాయి. అలా కోరుకునేవారికి కొన్ని సూచనలు చేస్తున్నారు డిజైనర్ దీప్తి గణేష్.











స్కర్టులు: ఈ తరం అమ్మాయిలు తమ వస్త్రశ్రేణిలో తప్పనిసరిగా ఉండాలని భావిస్తున్న రకాల్లో స్కర్టులు ముందుంటాయి. సంప్రదాయ వేడుకలకు పొడవు స్కర్టులే బాగుంటాయి. వీటి తయారీకి రాసిల్క్, బెనారస్, పట్టు వంటి వస్త్రాలను వాడితేనే నిండుదనం. స్కర్టుకి జతగా క్రాప్‌టాప్, ఆ పైన జాకెట్ వేసుకుంటే కొత్త లుక్ వచ్చేస్తుంది. అలానే గద్వాల్ పట్టు స్కర్టులపై చిలుకలూ, నెమళ్లూ... వంటి పక్షుల్నీ మోటిఫ్‌లుగా ఎంచుకుంటే ఆ అందమే వేరు దానిపైకి లెహేరియా కోటా, బాందినీ తరహా దుప్పట్టాలు ట్రెండీగా ఉంటాయి.

శ్రావణమాసంలో అమ్మాయిలు ఎక్కువగా వేసుకునే పరికిణీ ఓణీలకే కాస్త మార్పులు చేస్తే.. ఆకట్టుకునేలా కనిపించొచ్చు. ఈసారి కంచిపట్టుకి బదులుగా గద్వాల్, పోచంపల్లి, నారాయణ్‌పేట, మంగళగిరి పట్టు రకాల్ని ఎంచుకుని చూడండి. ఆ వస్త్రాలనే కాస్త ఆధునికంగా కుట్టించుకోవచ్చు. ఉదాహరణకు పోచంపల్లి ఇకత్ పట్టు పరికిణీ తీసుకుని దానికి జతగా కంచి పట్టు బ్లవుజూ, షిఫాన్ దుపట్టా మ్యాచింగ్ చేయొచ్చు. ఇలా చేస్తే దీనివల్ల ఒకే శైలిలో మూసగానూ కనిపించదు. బ్లవుజును కూడా సాధారణంగా కాకుండా కాస్త డీప్‌నెక్, బోట్‌నెక్, చైనీస్ కాలర్ నెక్, కోల్డ్ షోల్డర్ వంటి డిజైన్లతో కొత్తగా కనిపించేలా చేయొచ్చు

గౌన్‌లు: సందర్భం ఏదైనా గౌనులు చక్కగా కనిపించేలా చేస్తాయి. అందుకేనేమో కాలేజీ అమ్మాయిలు ఈ శైలికి ఫిదా అవుతున్నారు. సంప్రదాయ వేడుకల్లో పెళ్లికూతురుతో పాటూ అతిథులూ గౌనుకే ఓటేస్తున్నారు. పండగల్లో కట్టుకున్నా ప్రత్యేకంగా కనిపించొచ్చు. కలంకారీ, ఇకత్ వంటి డిజైన్లతో, ప్యూర్ సిల్క్, రాసిల్క్, బెనారస్ వంటి వస్త్రరకాలతో వీటిని కుట్టించుకుంటే బాగుంటుంది. ఆధునికంగా కనిపించేందుకు దానికి దుపట్టాలు జతచేయడం, లేదా లేయర్డ్, ఎసిమెట్రికల్ కట్‌లతో, కోల్డ్ షోల్డర్, ఆఫ్ షోల్డర్‌లతో డిజైన్ చేయించుకుంటే బాగుంటుంది. ఈ శ్రావణానికి లేతరంగులు కాకుండా ముదురు వర్ణాల గౌనులను ఎంచుకుంటే మేలు. వాటిమీద జర్దోసీ పనితనం చేయించుకుంటే ఇంకా బాగుంటుంది.

కుర్తాలు-కుర్తీలు: పండగల సీజను కాబట్టి... ఏదో ఒక వస్త్రం కాకుండా రాసిల్క్, ప్యూర్ సిల్క్‌లతో పాటు ఫ్యాన్సీ రకాలైన బ్రాసో, నెట్, జార్జెట్ వస్త్రాల్లో కుర్తీలను కుట్టించుకుంటే బాగుంటుంది. చేతులు పొట్టిగా కాకుండా పొడవుగా, మోచేతి కిందవరకూ ఉండేలా చూసుకోవాలి. సిల్క్, రాసిల్క్ కుర్తీల మీద చిన్న బుటీల్లా మగ్గం వర్క్ చేయించుకుంటే బాగుంటుంది. అలానే దేవతల ముఖాలతో అప్లిక్ వర్క్, అద్దాలు వంటి హంగులు చేరిస్తే చమక్కుమనిపించొచ్చు. ట్యూనిక్‌లకు బెనారస్, జార్జెట్, సిల్క్, మంగళగిరి రకాలు బాగుంటాయి. కుర్తీ సాదాగా ఉన్నప్పుడు దాన్ని కొత్తగా కనిపించేలా చేయాలంటే పైన ఎంబ్రాయిడరీ కేప్ ఎంచుకోవచ్చు.

దుపట్టా: పొడవాటిగౌన్లూ, అనార్కలీలూ, పరికిణీలూ... ఇలా వేటి మీదకు వేసుకున్నా కొత్తదనాన్ని తెచ్చిపెడతాయి ఇవి. కలంకారీ, బాందినీ, బెనారస్, పట్టు దుపట్టాలు ఇప్పుడు ప్రత్యేకం. వీటిని ప్లెయిన్ సిల్క్, రాసిల్క్ వంటివాటిమీదకు జతచేసుకుంటే సంప్రదాయ సిద్ధంగా కనిపించొచ్చు. ఇంకాస్త భిన్నంగా కనిపించాలనుకుంటే ఏనుగులూ, పక్షుల మోటిఫ్‌లను ప్రయత్నించొచ్చు. గాగ్రా, పరికిణీల మీదకు ధూపియాన్ సిల్క్ పై బ్లాక్ ప్రింటింగ్ లేదా త్రెడ్‌వర్క్ ఎంబ్రాయిడరీ చక్కగా నప్పుతుంది.

బాటమ్‌లు: సంప్రదాయ సందర్భాలకు పటోలా వస్త్రంతో స్ట్రెయిట్‌కట్ ప్యాంట్లు బాగుంటాయి. వీటిమీదకు కాస్త ఆధునికంగా ఎంబ్రాయిడరీ చేస్తే అనార్కలీ, ఏ కట్, లేయర్డ్, ట్యూనిక్‌లకు జతగా ఎంచుకోవచ్చు. అలానే ఏ లైన్‌కు జతగా పలాజో బాగుంటుంది. సిల్క్ వంటి జాలువారే రకాల్లో ధోతీస్టైల్, పటియాలా ప్యాంటులను కుట్టించుకున్నా ప్రత్యేకంగా కనిపించొచ్చు.

లెహెంగా

దీన్ని కూడా అసెమెట్రికల్, బాక్స్‌ప్లీటెడ్, లేయర్డ్, హైవెయిస్టెడ్ వంటి రకాల్లో కుట్టించుకుంటే ఆధునికంగా మెరిసిపోవచ్చు. నెట్, జార్జెట్, వంటి రకాలకు బదులుగా చేనేత రకాలైన ఇకత్, కలంకారీ, ప్యూర్ సిల్క్, ఖాదీ ఆర్గాంజా, చందేరీ వంటి వస్త్రాలను ప్రయత్నించొచ్చు. అలానే కాటన్‌సిల్క్, పోచంపల్లి బ్లాక్ ప్రింట్లు ఎంచుకున్నా బాగుంటుంది.

– స్వాతి కొరపాటి

అలసిన కళ్లకు...

నిద్రలేమీ, ఒత్తిడీ, అనారోగ్యకర జీవన శైలీ, అదే పనిగా కంప్యూటర్, టీవీ ముందు కూర్చోవడం, ఎక్కువగా పుస్తకాలు చదవడం వల్ల కళ్లు అలసిపోతాయి. మరి వీటికి సాంత్వన చేకూర్చేదెలా...?

- ఫ్రిజ్‌లో పెట్టి తీసిన రెండు చెంచాలను మీ కళ్లపై కాసేపు ఉంచండి. ఇలా చేయడం వల్ల ఉబ్బిన కళ్ల సమస్య తగ్గుతుంది.
- చల్లటి పచ్చిపాలలో రెండు దూది ఉండలను నానబెట్టి వాటిని కళ్లపై ఓ పది నిమిషాలపాటు ఉంచాలి. పాలు కంటి చుట్టూ ఉండే చర్మానికి పోషణ ఇస్తూనే దాన్ని శుభ్రపరుస్తాయి. కళ్ల వాపును కూడా తగ్గిస్తాయి. దీన్ని క్రమం తప్పకుండా చేయడం వల్ల కంటి కింద నల్లటి వలయాలు కూడా క్రమంగా తగ్గిపోతాయి.




- బాదం నూనెలోని విటమిన్ కె కళ్లకు కావాల్సిన తేమను అందిస్తుంది. అంతేకాదు దీనిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కళ్ల వాపును కూడా తగ్గిస్తాయి. అలసిన కళ్లకు సాంత్వననిస్తాయి.
- టీ పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లూ, సహజ టానిన్లు కంటి కింద ఉండే వాపును తగ్గించేలా చేస్తాయి. మొదట టీ పొడి బ్యాగులను వేడి నీటిలో నానబెట్టాలి. ఆ తర్వాత బ్యాగులను ఫ్రిజ్‌లో కాసేపు ఉంచి తరవాత కళ్లపై పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లు శుభ్రపడటమే కాకుండా ఉబ్బు కూడా తగ్గుతుంది. కళ్ల అలసటా ఉండదు.
- గుడ్డులోని తెల్లసొనను బాగా గిలకొట్టి బ్రష్ సాయంతో కంటిచుట్టూ రాసి అయిదు నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల మీ కంటి చుట్టూ ఉండే చర్మం బిగుతుగా మారుతుంది.

ఆ ప్రేమ... పెద్దల కోసమేనా?!



నేను మా బావనే పెళ్లి చేసుకున్నా. అతను పీజీ చేశాడు. నేనేమో పదోతరగతి ఫెయిల్. నేనే అతడిని ప్రేమించా. నన్ను చేసుకోవడం అతనికి ఇష్టం లేదు.. తనలా చదువుకున్నవాళ్లనే చేసుకుంటానని చెప్పేవాడు. బలవంతంగానే ఒప్పించారు. కానీ పెళ్లిఅంగీకరించాక నాతో ప్రేమగా ఉండటం మొదలుపెట్టాడు. ఆ నిజాయతీలో ధోకా లేదు. పెళ్లైన ఏడాది నుంచే నాలో ఓ అనుమానం మొదలైంది. నాపై చూపే ప్రేమంతా కేవలం బాధ్యత కోసమేనా? అతని మనసు లోతుల్లో నుంచి కాదా? అనిపిస్తోంది! అతను ముందే కోరుకున్నట్టు బాగా చదువుకున్న భార్య దొరికితే ఇంకా బాగా ఉండేవాడేమో అనిపిస్తోంది. ఒక్కోసారి ఇందుకనే అతనిపై విపరీతంగా కోపం వస్తోంది. అతను ఏమాత్రం కోప్పడ్డా, కసిరినా ఈ ఆలోచనే వచ్చి కుంగిపోతున్నా. కానీ నాతో చక్కగా ఉంటున్నాడు. నాలో ఈ ఆలోచనలు ఎలా పోవాలి? - ఓ సోదరి

ఈ ఆలోచనలు ఎలా పోతాయి? కాస్త తార్కికంగా ఆలోచించడం ద్వారా! మీలోని అభద్రతాభావాన్ని తొలగించుకోవడం ద్వారా! మీ ఉత్తరంలో మీలోని అభద్రతాభావమే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇద్దరి మధ్య చదువు అనే అంతరం.. నిజంగా దూరాన్ని సృష్టిస్తోందా అనే విషయం పక్కనపెడితే మీలోని అభద్రత మాత్రం మిమ్మల్ని అతలాకుతలం చేస్తోంది. మీ భర్త తన జీవిత భాగస్వామి ఎలా ఉండాలో ముందే స్పష్టంగా చెప్పినా పెద్దవాళ్ల ఇష్టాన్నీ, మీ ఇష్టాన్నీ గౌరవించాడు. మీలో తాను ఆశించినంత విద్యార్హత లేకున్నా.. మీ బలాల్ని గుర్తించి ఇష్టపడటం మొదలుపెట్టాడు. అతను అలా మారకుంటే పెళ్లి కుదరగానే మీపట్ల నిజాయతీగా ప్రేమ చూపుతున్నట్టు మీరు గుర్తించేవారే కాదు కదా! కాకపోతే పెళ్లయ్యాక ఆ నిజాయతీ, ఆ పరిణతి, అంతా సవ్యంగా జరగడమనే నిజాన్ని మీ మనసు ఎందుకో నమ్మలేకపోతోంది. ఓ పక్క అతని ప్రేమని అర్థం చేసుకుంటూనే, మరోపక్క ఇది నిజమేనా అనే సంశయం ఇబ్బంది పెడుతోంది. ఈ వైరుధ్య భావాలతో సతమతమవుతున్నారు మీరు. ఇప్పటి నుంచైనా తన నిర్ణయానికి బద్ధుడిగా మీకోసం తననీ, తన ఇష్టాయిష్టాలనీ, ఆలోచనల్ని ఎలా మార్చుకున్నాడో అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. చదువుకి అతీతంగా అతను మీలో చూసిన సానుకూల అంశాలేమిటో అర్థం చేసుకోండి. వాటిని పెంచుకోండి. భార్యగా మీకున్న చనువుతో మీపట్ల ఏవైనా అసంతృప్తులుంటే అడిగి తెలుసుకోండి. పరస్పరం ఒకరి విషయంలో ఒకరికున్న సందేహాలూ నివృత్తి చేసుకునే ప్రయత్నం చేయండి. అతనితో పోల్చుకుని మీ చదువు విషయంలో అభద్రతకి లోనుకావొద్దు. ఇవన్నీ కాదు. . చదువే మీకు పెద్ద అంతరం సృష్టిస్తుందని అనుకుంటున్నారా? దూరవిద్య ద్వారా సులువుగా మీ విద్యార్హతలు పెంచుకునే ఎన్నో మార్గాలున్నాయిప్పుడు. కానీ అది కేవలం అతని ప్రేమ కోసమే కాకూడదు. మీలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంచుకునే ప్రయత్నంగానే మీరు కొత్తగా విద్యాభ్యాసం చేయాలి. చదువొక్కటే కాదు మీకు ఇతరత్రా ఆసక్తి ఉన్న అంశాలూ, నైపుణ్యాలు వృద్ధి చేసుకుని ప్రత్యేకతలు సాధించండి. మీలో ఆత్మవిశ్వాసం వస్తే ఈ అభద్రతకి తావుండదు!



న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,700	29,650
ఆర్నమెంట్	-------	-------	27,500	27,500
వెండి (కిలో)	-------	-------	39,600	39,600
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,600	29,580	29,260	29,250
ఆర్నమెంట్	27,470	27,460	27,360	27,350
వెండి (కిలో)	39,700	39,500	39,000	38,850
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,780	29,670	-------	-------
ఆర్నమెంట్	27,400	27,300	2,736	2,735 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.70	41.50 గ్రా

సందేశాలొద్దు... సంభాషణ చాలు



చాలామంది చెబుతుంటారు కేవలం స్నేహాల కోసమే సామాజిక మాధ్యమాలకి బానిసగా మారామని! కానీ అందులో నిజం లేదు. ఈ మాధ్యమాల ద్వారా ఏర్పడే బంధాలేవీ అంత ప్రగాఢంగా ఉండవు. కానీ అసలైన స్నేహితులతో స్మార్ట్ ఫోన్ వ్యసనం నుంచి బయటపడొచ్చు. ఎలాగో చూడండి..

- **వాటికి బదులు మాటలు :** ఎస్ఎంఎస్‌లూ, వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్‌లలో కన్నా ఫోన్‌లో మాట్లాడటానికి ప్రాధాన్యం ఇవ్వండి. కలిసేంత దూరంలో ఉంటే నేరుగా మాట్లాడటమే మేలు. ఈ విషయం మీ స్నేహితులకీ చెప్పి ఒప్పించండి. మీకే కాదు.. వాళ్లకీ ఇదెంతో ఉపయోగపడుతుంది.
- **కలిసినప్పుడు 'నో' :** మనం ఎంతగా స్మార్ట్‌ఫోన్ నుంచి బయటపడదామనుకున్నా.. స్నేహితులు వాటిని చూస్తుంటే మనకూ చేతులాగవు. చటుక్కున తీసి ఏవో నోటిఫికేషన్స్ చూసేయాలనిపిస్తుంది. అలా కాకుండా.. వారానికి గంటో, రెండుగంటలో అందరూ ఈ ఫోన్‌లకి దూరంగా ఉండాలని నిర్ణయించుకోండి. ఆ సమయాన్ని పెంచుకుంటూ ఉండండి.
- **చేతులారా గ్రీటింగ్స్ :** అంతర్జాలం ద్వారా స్నేహితులకి గ్రీటింగ్స్ పంపడం చాలా సులభం! కానీ మీరు కాస్త పాతపద్ధతికి వెళ్లండి. షాపుకెళ్లి కొన్ని గ్రీటింగ్‌లు తీసుకుని.. మీ స్వహస్తాలతో శుభాకాంక్షలు రాసి పంపించండి. మీరు స్మార్ట్‌ఫోన్‌లతో పంపే వంద సందేశాలకంటే ఎక్కువ ప్రభావం చూపుతాయివి! అప్పుడప్పుడూ అభినందన లేఖలూ పంపించి చూడండి.

ఎండలో కాసేపు...

పనులూ, చదువు.. కారణాలేమైనా కొన్నిసార్లు ఒత్తిడి వలలో చిక్కుకుపోతుంటాం. మరి దాన్నుంచి ఎలా బయటపడాలో చూద్దాం!

నవ్వేయండి: పసి పిల్లలు రోజులో 300 సార్లు నవ్వుతారట. అదే పెద్దవాళ్లు రోజులో 15 సార్లు కూడా నవ్వరట. కానీ నవ్వు శరీరంలోని ఒత్తిడికి కారణమయ్యే అడ్రినలిన్, కార్టిసాల్ హార్మోన్లని నియంత్రిస్తుంది. అందుకే సందర్భం ఉంటే పెదాలు బిగించుకోకుండా నవ్వడానికే ప్రయత్నించండి.

ఓ ఐదునిమిషాలు ఇలా: చపాతీలు ఒత్తే కర్ర తెలుసుగా! అలాంటి గుండ్రని దానిపై నిలబడి గోడని ఆసరాగా చేసుకుని ఓ ఐదునిమిషాలు ముందుక్కీ వెనక్కీ కదలండి. ఇలా చేస్తే మెదడు నుంచి సంతోషానికి కారణమయ్యే ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. దాంతో ఒత్తిడి నియంత్రణలో ఉంటుంది.



బి లోపం రాకుండా: మనం తినే ఆహారంలో బి విటమిన్లు సమృద్ధిగా ఉండేట్టు చూసుకుంటే.. సంతోషాన్ని పెంచే సెరటోనిన్ హార్మోను చక్కగా పనిచేస్తుంది. యాభై నుంచి వంద మి.గ్రా బి కాంప్లెక్స్ విటమిన్ అందేటట్టు చూసుకోవాలి. సెరటోనిన్ విడుదలయ్యేందుకు మరో మార్గం కూడా ఉంది. చక్కగా ఉదయం పూట 25 నిమిషాల పాటూ ఎండలో నడిచినా, ఆహారంలో మెగ్నీషియం సమృద్ధిగా ఉన్నప్పుడూ మెదడు తగినంత సెరటోనిన్ రసాయనాన్ని విడుదల చేస్తుంది. ఆకుకూరలూ, బీన్స్ నుంచి ఈ ఖనిజం సమృద్ధిగా అందుతుంది.

నడక: రోజూ నడవడం, జాగింగ్ చేయడం, పార్కులో గడపడం, నచ్చిన పనిలో ఓ పదినిమిషాలు నిమగ్నం కావడం వంటి పనులు కూడా ఒత్తిడిని అదుపు చేస్తాయి.

ఆ విషయాలకు అబ్బాయిలు గొల్లుమన్నారు!

అదో హైస్కూలు తరగతి గది. రేవతి విద్యార్థుల ఎదుట నిల్చునుంది. గొంతు సవరించుకుంది. 'పన్నెండేళ్ల తర్వాత మన శరీరాల్లో చాలా మార్పులొస్తాయ్. మగవాళ్లలోనైతే మీసాలూ, గడ్డం..' అంటుండగానే అబ్బాయిల వైపు నుంచి ఎవరో కిసుక్కుమన్నారు. రేవతి పట్టించుకోలేదు. 'ఇక స్త్రీలల్లో..' అని మొదలుపెట్టగానే అమ్మాయిలు సిగ్గుతో ముడుచుకుపోతున్నారు. ఈసారి అబ్బాయిలు గొల్లుమన్నారు. 'ఎందుకా నవ్వు? మీ అక్కలకీ, చెల్లెళ్లకి ఇలాగే జరుగుతుంది..!' అని మొదలుపెట్టగానే ఏదో నిశ్శబ్దం. - రేవతి ఇలాగే వందలాది బడుల్లో వేలమందికి పాఠాలు చెబుతుంటుంది. ఆమె ఉపాధ్యాయిని కాదు. ఇంటర్ విద్యార్థిని! మరి బోధనలేమిటీ అంటారా? రండి చూద్దాం.



వల్లిగట్ల రేవతి.. చైల్డ్ రైట్స్ అండ్ యూ(క్రై) సంస్థలో సభ్యురాలు. ప్రపంచవ్యాప్తంగా పిల్లల హక్కుల కోసం పాటుపడుతున్న సంస్థ. అందులో భాగంగానే మనదేశంలోని కొన్ని జిల్లాల్లో బాల్య వివాహాలకి వ్యతిరేకంగా కృషిచేస్తోంది. బడిస్థాయిలోనే పిల్లలు చదువుమానకుండా పథకాలు చేపడుతోంది. చిత్తూరుజిల్లా మదనపల్లెలో ఆ సంస్థ సాయంతో నడుస్తున్న పీపుల్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(పోర్డ్)లో రేవతి రిసోర్స్ పర్సన్. ఇందులో భాగంగా బాల్యవివాహాలని ముందుగా పసిగట్టి ఆపడం, బాలకార్మికులని బడిలో చేర్చడం ఆమె పనులు. అంతేకాదు, పల్లెసీమలకి చెందిన విద్యార్థినులకి 'రుతుక్రమ శుభ్రత'(మెన్‌స్ట్రువల్ హైజీన్)పై పాఠాలు చెబుతుంది. ఇందుకోసం జిల్లాలోని ప్రతిబడికీ వెళుతుంటుంది. అలా ఇప్పటివరకూ పది దాకా బాల్యవివాహాలని ఆపింది. పదిహేనుమంది పిల్లల్ని బడిలో చేర్చింది. వాళ్లలో ముగ్గురు ఇప్పటికే పదో తరగతి ముగించారు! అంతేకాదు.. రేవతి ఇప్పటికే 'క్రై' సంస్థ తరపున రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉత్తమ బోధకురాలిగా అవార్డు సాధించింది! ఒకప్పుడు ఇల్లు వదిలి బయటకు రావడానికే జంకిన ఈ అమ్మాయి.. ఇదంతా ఎలా సాధించింది?



ఆ ఆటలే నేర్పించాయి.. మదనపల్లెకి రెండుగంటల ప్రయాణ దూరంలో ఉన్న దివిటీవారిపల్లె రేవతి సొంతూరు. నాన్న సన్నకారు రైతు. ఏడో తరగతిదాకా అక్కడే చదువుకుంది. చుట్టుపక్కల సరైన విద్యాసదుపాయాలు లేకపోవడంతో మదనపల్లెలో ఉంటున్న అమ్మమ్మవాళ్లింటికొచ్చింది. ఆ పట్టణానికి దగ్గర్లోని నీరుగుంటవారి పల్లె అనే మురికివాడ ప్రాంతం వాళ్లది. 'అమ్మాయిలు బయటకెళ్లడం మంచిదికాదు..' అని నమ్మేవాళ్లట వాళ్లు. దాంతో బడీ, ఇల్లు తప్ప ఇంకెక్కడికీ ఆమెని వెళ్లనిచ్చేవారు కాదు. అప్పుడే ఆమె చదువుతున్న ప్రభుత్వ బడికి ఓ బృందం వచ్చింది. ఓ సరికొత్త పరమపద సోపాన పటాన్ని ఆమె ముందు పరిచింది. చదువులూ, ఆటపాటలనే నిచ్చెనలూ.. బాల్యవివాహాలూ, చిన్నప్పుడే చిరుద్యోగాలనే సర్పాలు అందులో ఉండేవి! దానిసాయంతో వాళ్లు విద్యా విలువని నేర్పించడం రేవతిని కట్టిపడేసింది. అది 'పోర్డ్' సభ్యుల బృందం. ఆ ఎనిమిదో తరగతిలోనే రేవతి ఆ సంస్థ సభ్యురాలైపోయింది. ముందు అమ్మమ్మవాళ్లు ఒప్పుకోలేదు. కానీ పట్టుబట్టి మరీ శిక్షణకి వెళ్లింది. అలా పిల్లల హక్కులపై ఆ చిన్నవయసులోనే ఎంతో నేర్చుకుంది. మన ప్రాథమిక హక్కుల తోపాటూ పిల్లలకి ఆటలాడే హక్కూ, చదువుకునే హక్కూ కచ్చితంగా ఉంటుందని వాళ్లు దాన్ని సాధించుకోవడానికి చుట్టూ ఉన్న ప్రతిఒక్కరూ సాయపడాలని తెలుసుకుంది. తానూ సాయపడటం మొదలుపెట్టింది.

బాల్యవివాహాలు మాన్పించి.. 'ఆ అమ్మాయి మా బడిలో ఎనిమిదో తరగతి చదువుకునేది. వాళ్ల మావయ్యకిచ్చి పెళ్లిచేయాలనుకున్నారందరూ! మాకు ఆరునెలల ముందే విషయం తెలిసింది. నేనే వెళ్లి మాట్లాడాను. ముందు అంతపెద్దవాళ్లతో ఎలా మాట్లాడాలబ్బా అని భయపడ్డాను. ధైర్యంగానే వెళ్లాను. 'నేను పెళ్లిచేయకండి..' అని మొదలుపెట్టగానే 'సిన్నదానివి నీకేం తెలుసు! ఆడపిల్లలు ఎదిగితే నెత్తికిమించిన బరువవుతారు!' అన్నాడు వాళ్లనాన్న. నేను ఒప్పుకోలేదు. ఆ చుట్టుపక్కలే బాల్యవివాహాలైన వాళ్లందర్నీ ఉదాహరణలుగా చూపాను. ఆ అమ్మాయి చదువుకుంటే వచ్చే ఫలితాన్ని చెప్పాను. ఎట్టకేలకు ఒప్పుకున్నారు. అది నా తొలి గెలుపు!' అంటుంది రేవతి. అలా ఇప్పటిదాకా పది వివాహాలని ఆపి ఆ అమ్మాయిల విద్య కొనసాగేలా చేసింది. ఇక మురికివాడలో కాగితాలు ఏరుతూ బతుకుతున్న పదిహేనుమందిని బ్రిడ్జ్ స్కూల్లో, కేజీబీవీల్లో చేర్చింది. వాళ్లలో ముగ్గురు పదోతరగతిలో 80 శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్నారు. వీటితోపాటూ తన పదోతరగతి నుంచే.. వివిధ బడులు తిరుగుతూ నెలసరి సమయంలో వ్యక్తిగత శుభ్రత(మెన్‌స్ట్రువల్ హైజీన్)పై పాఠాలు చెబుతోంది. ఆడపిల్లలే కాదు.. మగవారికీ ఉంటాయీ పాఠాలు! 'ఇలాంటి బోధనవల్ల అమ్మాయిల్లోని సున్నితత్వాన్ని అబ్బాయిలు అర్థం చేసుకుంటారు. నిర్భయలాంటి దురాగతాలు చోటుచేసుకోవన్నది 'క్రై' ఉద్దేశం..' అంటోంది రేవతి.

సహకారం : కొప్పుల రెడ్డప్ప, న్యూస్‌టుడే, మదనపల్లె

ఎర్రటి పళ్లెంలోనే తినండి!

మీరు కోపంగా ఉంటేనో, మీకు బాధగా అనిపిస్తేనో. . ఏదో ఒకటి తినాలనిపిస్తుందా? మనలో చాలామందికి ఉంటుందీ అలవాటు. దీన్నే 'ఎమోషనల్ ఈటింగ్' అంటారు! నిజానికి, ఈ తిండివల్ల మామూలుకంటే వేగంగా మనం బరువు పెరిగిపోతామట. ఈ అలవాటుని తగ్గించుకునే చిట్కాలివి..

- **ఆకలి వేరు :** ఉద్వేగానికి గురైనప్పుడు తినాలనిపించడానికీ, అసలైన ఆకలికీ తేడా తెలుసుకోండి. వేళకానివేళ ఏదో ఒకటి తినాలనిపించినప్పుడు అది ఆకలి కాదని మీ మనసుకి పదేపదే చెప్పుకోండి. ఆ కాసేపు, భోజనం నుంచి దృష్టి మరల్చుకోవడం మీకెంతో ఉపయోగపడుతుంది. ఒత్తిడి తగ్గించుకునే చిన్నపాటి శ్వాసనియంత్రణ వ్యాయామాల్లాంటివి మీకెంతో మేలు చేస్తాయి.
- **ఎరుపు రంగుతో :** అకారణంగా తినాలనుకుంటున్నప్పుడు ఎర్రటి పళ్లేన్ని ఎంచుకోండి. ఈ రంగు మనం ఎంత ఉద్వేగంలో ఉన్నా సరే.. ఎక్కువ తింటున్నామని అప్పటికప్పుడు హెచ్చరిస్తుందని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి.. ఇంట్లో మీరు ఏవి తినాలనుకున్నా దీన్నే ఎంచుకోండి.



- **చేయి మార్చండి :** మీది ఎడంచేతి వాటమా? అయితే కుడిచేత్తో తినండి. కుడిచేతి వాటమైతే.. ఎడంచేత్తో! ఛ.. అంటారా చిరుతిళ్లకి ఏ చేయైతే ఏమిటి చెప్పండి. మరీ ఇబ్బందిగా అనిపిస్తే చెంచా ఎంచుకోండి. ఇలా చేయి మారడం వల్ల, అలవాటు తప్పి చాలా తక్కువగా తింటామట మనం! కోపం, బాధగా ఉన్నప్పుడు ఈ పద్ధతి ఎంతో మంచిదని చెబుతున్నారు నిపుణులు.

సెన్సెక్స్ ▲ 60	నిఫ్టీ ▲ 38	రూపాయి 64.07 ▲	బంగారం 28,645 ▼	వెండి 38,260 ▼	ముడి చమురు 51.39 ▼
32575	10115	(ఒక అమెరికా డాలరుకు) 12 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 45	ముంబయిలో కిలో రూ.లలో 95	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,976	+85
నాస్‌డాక్	6,359	+11
నిక్కీ 225 (జపాన్)	19,986	+61
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,338	+09
షాంఘై(చైనా)	3,292	+19
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,424	+52
డాక్స్ (జర్మనీ)	12,251	+133

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.34	67.64
పౌండ్ స్టెర్లింగ్	77.09	89.42
యూరో	68.98	80.00
జపనీస్ యెన్/100	52.97	61.43
ఆస్ట్రేలియా డాలరు	46.84	54.21
సింగపూర్ డాలరు	43.02	50.95
థాయ్ బాత్/100	175.09	209.59
బ్రహెయిన్ దీనార్	158.06	181.0467
కువైట్ దీనార్	175.24	219.24
సౌదీ రియాల్	15.51	18.39
యూఏఈ దిర్హమ్	15.88	18.56
మలేషియా రింగిట్	13.35	16.41
చైనీస్ యువాన్	6.75	10.95



మంగళవారం నిఫ్టీ కదలికలు



జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం రూ.626 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఏకీకృత ప్రాతిపదికన రూ.626 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థకు వచ్చిన లాభం రూ.1,120 కోట్లతో పోలిస్తే ఇది 44.10 శాతం తక్కువ. సమీక్షిస్తున్న త్రైమాసికంలో సంస్థకు కార్యకలాపాల ద్వారా రూ.15,977 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదే సమయంలో వ్యయాలు రూ.11,383 కోట్ల నుంచి 32.86 శాతం పెరిగి రూ.15,124 కోట్లకు చేరాయి. దోల్వీ, విజయనగరం ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించేందుకు రూ.8,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంస్థ పేర్కొంది.

వైద్య పరికరాలపై గరిష్ఠ చిల్లర ధర తప్పనిసరి

జనవరి 1 నుంచి అమల్లోకి

దిల్లీ: వైద్య పరికరాలపై ఇక గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)ను తప్పనిసరిగా ముద్రించనున్నారు. 2018 జనవరి 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈమేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ నిబంధనలను సవరించింది. ప్రతి పరికరం, ప్యాకెట్‌పైనా సంస్థ పేరు, చిరునామా, ఫోను నెంబరు, ఇ-మెయిల్ వంటివి తప్పనిసరిగా పొందుపరచాలి. ఇ-కామర్స్ సంస్థలు కూడా ప్యాకేజ్ చేసేటప్పుడు ఈ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. శస్త్రచికిత్సలో వినియోగించే పరికరాలు, స్టెంట్లు, కండోమ్స్, వాడి పడేసే సిరంజీలు వంటివి జాబితాలోకి వస్తాయని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయ లోక్‌సభకు వెల్లడించారు.

ఆర్‌బీఐ సమీక్ష అండగా..

- కొనసాగిన సూచీలు జోరు
- కీలక రేట్ల కోతపై ఆశలు

ఆఖరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో, ఈ వారంలో రెండో రోజూ సూచీలు లాభాలు నమోదు చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో మార్కెట్లు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాలు, వాహన విక్రయ గణాంకాలు మెరుగవ్వడం, మదుపర్ల సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. ఆసియా షేర్లు రాణించడం, ఐరోపా మార్కెట్లు సైతం లాభాల్లో ట్రేడవడం ఉపకరించింది.

సెన్సెక్స్ ఉదయం 32,579.80 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అనంతరం ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. ఒకానొకదశలో 32,462.25 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివర్లో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సెన్సెక్స్.. 32,632.02 దగ్గర గరిష్ఠానికి చేరింది. చివరకు 60.23 పాయింట్ల లాభంతో 32,575.17 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ క్రితం గరిష్ఠ ముగింపు అయిన 10,077.10 పాయింట్లను అధిగమించింది. 37.55 పాయింట్లు పెరిగి 10,114.65 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా దూకుడు: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో లాభం 6.5 శాతం పెరగడంతో టెక్ మహీంద్రా షేరు పరుగులు తీసింది. ఒకానొకదశలో 7.43 శాతం పెరిగిన షేరు.. చివరకు 4.56 శాతం లాభంతో రూ.402.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,722.02 కోట్లు పెరిగి రూ.39,301.02 కోట్లకు చేరింది.

✦ జులైలో కంపెనీ అమ్మకాలు ఆకర్షణీయంగా నమోదు కావడంతో మారుతీ సుజుకీ షేరు దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 2.75 శాతం లాభంతో రూ.7,920 వద్ద 52 వారాల గరిష్ఠానికి చేరింది. చివరకు 1.96 శాతం పెరిగి రూ.7,859.10 దగ్గర స్థిరపడింది.



✦ త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ మారికో షేరు 2.50 శాతం నష్టంతో రూ.325.20 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభాలతో ముగిశాయి. మారుతీ సుజుకీ 1.96%, హీరో మోటోకార్ప్ 1.85%, విప్రో 1.82%, ఎం అండ్ ఎం 1.77%, డాక్టర్ రెడ్డీస్ 1.73%, హిందుస్థాన్ యునిలీవర్ 1.70%, అదానీ పోర్ట్స్ 1.67%, కోల్ ఇండియా 1.22%, ఐటీసీ 0.91%, టాటా స్టీల్ 0.78%లు రాణించిన వాటిలో ఉన్నాయి. లుపిన్ అత్యధికంగా 1.36% నష్టపోయింది. ఓఎన్‌జీసీ (1.21%), ఎస్‌బీఐ (1.20%), ఏషియన్ పెయింట్స్ (0.98%), హెచ్‌డీఎఫ్‌సీ (0.66%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.64%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే బీఎస్ఈ వాహన సూచీ 1.57 శాతం పెరిగింది. లోహ, చమురు- గ్యాస్, ఆరోగ్య సంరక్షణ సూచీలు అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

మార్కెట్లు మరింత ముందుకెళ్లే అవకాశం ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లలో పావు శాతం మేర కోత విధించొచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు. బ్యాంక్ నిఫ్టీ మరో 200 పాయింట్ల వరకు పెరగొచ్చని బ్రోకరేజీ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. నేడు నిఫ్టీ 10000- 10250 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. నిఫ్టీ 10,000 పాయింట్ల స్థాయిని నిలబెట్టుకోగలిగితే.. భారీ దిద్దుబాటు రాకపోవచ్చని అంటున్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు రాక చాలా బలంగా ఉందని, దేశీయ సంస్థాగత మదుపర్లు అమ్ముతుంటే.. చిన్న మదుపర్లు, మ్యూచువల్ ఫండ్లు కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ధోరణి సైతం మన మార్కెట్ల ర్యాలీకి దోహదపడుతోంది. అమెరికా రిటైల్ అమ్మకాలు, తయారీ సూచీ, ఇతర ఆర్థిక గణాంకాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. మంగళవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన పవర్‌గ్రిడ్ ఫలితాల ప్రభావం షేరుపై ఉండొచ్చు. రేట్ల కోతపై ఆశలతో వాహన, స్థిరాస్తి, బ్యాంకింగ్ షేర్లు వెలుగులోకి రావొచ్చు.

జులై తయారీ తగ్గింది

- ఈ ఏడాదిలో తొలి క్షీణత
- ఫిబ్రవరి 2009 తర్వాత కనిష్ఠ స్థాయికి

దిల్లీ: భారత్‌లో తయారీ రంగం జులై నెలలో క్షీణించింది. జీఎస్‌టీ అమలు ప్రారంభంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. పెద్ద నోట్ల రద్దు అనంతరం గత డిసెంబరులో తగ్గిన తయారీ, ఆ తర్వాత మళ్లీ క్షీణించడం ఇప్పుడే. తాజా పరిణామంతో ఆర్‌బీఐ తన పరపతి విధాన సమీక్షా సమావేశంలో కీలక రేట్లను తగ్గించాలన్న వాదనలకు బలం చేకూరింది. నిక్కీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) జులైలో 47.9గా నమోదైంది. జూన్‌లో నమోదైన 50.9తో పోలిస్తే ఇది తక్కువ. అంతే కాదు ఫిబ్రవరి 2009 తర్వాత అత్యంత కనిష్ఠం కూడా. 2017లో తొలి క్షీణత కూడా ఇదే. 50 కంటే పైన నమోదైతే దానిని వృద్ధిగానూ.. కిందకు వస్తే క్షీణతగానూ పరిగణిస్తారు. 'జీఎస్‌టీ అమలు వల్ల గిరాకీపై ప్రభావం పడింది. ఉత్పత్తి తగ్గడంతో పాటు కొత్త ఆర్డర్లు, కొనుగోలు కార్యక్రమాలు డీలా పడ్డాయ'ని ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రధాన ఆర్థికవేత్త పాలియానా డీ లీమా అభిప్రాయపడ్డారు.

బీఎస్ఈ ఛైర్మన్‌గా ధీరేంద్ర స్వరూప్

నియామకానికి సెబీ ఆమోదం

దిల్లీ: బీఎస్ఈ కొత్త ఛైర్మన్‌గా ధీరేంద్ర స్వరూప్ నియామకానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం స్వరూప్ బీఎస్ఈ పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. సుధాకర్ రావు స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. అంతకు ముందు స్వరూప్ పింఛన్ నిధుల నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఫైనాన్స్, బడ్జెట్, ప్రజా రుణ నిర్వహణ, ప్రజా విధానాలు, పింఛన్ సంస్కరణలు వంటి వాటిల్లో స్వరూప్‌కు నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 2000 నుంచి 2003 మధ్య ఆర్‌బీఐ నగదు, రుణ నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా స్వరూప్ పనిచేశారు.

రూ.2.04 లక్షల కోట్ల రుణాల పునర్‌వ్యవస్థీకరణ: జైట్లీ

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో బ్యాంకులు రూ.2.04 లక్షల కోట్ల మేర కార్పొరేట్ రుణాలను పునర్‌వ్యవస్థీకరించాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. అంతక్రితం మూడు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఈ మొత్తం తక్కువేనని రాజ్యసభకిచ్చిన సమాధానంలో తెలిపారు. 2014-15, 2015-16ల్లో వరుసగా రూ.3,70,279 కోట్లు, రూ.2,99,111 కోట్లు చొప్పున కార్పొరేట్ రుణాలను బ్యాంకులు పునర్‌వ్యవస్థీకరించాయని జైట్లీ వెల్లడించారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు.. సంయుక్త రుణదాతల ఫోరం, వ్యూహాత్మక రుణ పునర్‌వ్యవస్థీకరణ, ఒత్తిడి ఆస్తుల స్థిర వ్యవస్థీకరణ ఆధారంగా రుణాల పునర్‌వ్యవస్థీకరణ చేస్తున్నట్లు వివరించారు.

శామ్‌సంగ్ ఆఫర్లు

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గెలాక్సీ ఎస్7 స్మార్ట్‌ఫోన్లపై శామ్‌సంగ్ ఆఫర్లు ప్రకటించింది. గెలాక్సీ ఎస్7 ఫోనుపై రూ.4-8వేలు, ఎస్7 ఎడ్జ్‌పై రూ.8వేల మేర నగదు వెనక్కి పథకాన్ని ప్రారంభించింది. అదనంగా పాత మొబైళ్ల మార్పిడిపై రూ.12వేల వరకు నగదు వెనక్కి పొందవచ్చు. ఈ ఆఫర్లు శామ్‌సంగ్ విక్రయశాలలతో పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది.

ఇంటెక్స్ 4జీ ఫీచర్‌ఫోన్

4జీ ఫీచర్ ఫోన్ 'టర్బో+'తో పాటు మరో 2జీ సాంకేతికతతో పనిచేసే మరో 8 ఫీచర్ ఫోన్లను రూ.700-1,500 శ్రేణిలో విక్రయిస్తామని మొబైల్ సంస్థ ఇంటెక్స్ తెలిపింది. నవరత్న శ్రేణిలో ఇవి లభ్యమవుతాయి.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017-18	నికర లాభం/(నష్టం) 2016-17	మొత్తం ఆదాయం 2017-18	మొత్తం ఆదాయం 2016-17
డీసీఎం శ్రీరామ్ (కన్సా)	233.47	167.18	2,065.03	1,524.96
మారికో (కన్సా)	235.94	267.90	1,715.28	1,781.78
పీసీ జువెలర్స్	135.83	106.59	2,140.03	1,674.60
పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్(కన్సా)	247.46	172.93	2,337.91	1,829.23
రిలయన్స్ డిఫెన్స్	(230.40)	(134.50)	231.70	74.30
పవర్ గ్రిడ్ కార్పొరేషన్	2,052.40	1,801.70	7,181	6,119.80
డెన్ నెట్‌వర్క్స్	(10.11)	(45.51)	322.42	278.55
తాజ్ జీవీకే హోటల్స్	1.96	2.46	59.63	58.34

నేటి బోర్డు సమావేశాలు

★ లుపిన్ ★ పీఎన్‌బీ ★ క్యాపిటల్ ఫస్ట్ ★ వోకార్డ్ ★ గోద్రేజ్ ప్రోపర్టీస్ ★ ఎడెల్‌వైజ్ ఫైనాన్షియల్ ★ వీఎస్‌టీ ఇండస్ట్రీస్ ★ వోల్టాస్ ★ టీసీఐ ★ యూకో బ్యాంక్ ★ టీబీజెడ్ ★ రిలయన్స్ ఇన్‌ఫ్రా ★ మహీంద్రా హాలిడేస్ ★ మ్యాక్స్ వెంచర్స్ ★ నారాయణ హృదయాలయ ★ కాయా ★ కేఈసీ ఇంటర్నేషనల్ ★ మాగ్మా ఫిన్‌కార్ప్ ★ గ్రీన్ ప్లై ఇండస్ట్రీస్ ★ ఇమామీ ★ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ★ బాటా ★ దిలీప్ బిల్డ్‌కాన్

రూ.1.9 లక్షల కోట్లు అవసరం

- వచ్చే రెండేళ్లలో బ్యాంకులకు కావాలి
- మూలధనంపై ఎస్ అండ్ పీ అంచనాలు

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులకు మార్చి 2019 కల్లా కనీసం రూ.1.9 లక్షల కోట్ల మూలధనం అవసరమని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. మొండి బకాయిలకు కేటాయింపులు చేయడానికి; బాసెల్-3 నిబంధనలను పాటించడానికి బ్యాంకులకు భారీ మొత్తంలో నిధులు అవసరమని ఆ రేటింగ్ సంస్థకు చెందిన గీతా చుగ్ పేర్కొన్నారు. 'మూలధన సామర్థ్యం లేకపోవడం వల్ల భారత ప్రభుత్వ రంగ బ్యాంకులు మొండి బకాయిలను రద్దు చేయలేకపోతున్నాయి. బలహీన లాభదాయకతకు తోడు.. బాసెల్-3 నిబంధనలు అమలుకు చాలా వరకు బ్యాంకులపై మూలధనం విషయంలో ఒత్తిడి ఎదురవుతోంద'ని చుగ్ అన్నారు. బ్యాంకులు మూలధన సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ అండ్ పీ తన నివేదికలో ఏమందంటే..



✦ భారత ప్రభుత్వ రంగ బ్యాంకులకు నిబంధనలు, మార్కెట్లో గట్టి పోటీ, తక్కువ మార్కెట్ విలువల రూపంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. నిధుల సమీకరణకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అదనపు టైర్-1 బాండ్లపై నష్టభయం పెరగడంతో వాటి జారీ ద్వారా నిధులు సమీకరించడమూ కష్టతరమవుతోంది.

✦ ప్రభుత్వం నుంచి మద్దతు లభిస్తుందని అంచనా వేస్తున్నాం.

✦ బ్యాలెన్స్ షీట్లను ప్రక్షాళించుకోవడంతో పాటు.. బాసెల్-3 నిబంధనలను పూర్తి స్థాయిలో పాటించగల బలమైన బ్యాంకులకు ఎక్కువ మార్కెట్ వాటా లభించే అవకాశం ఉంది.


✦ బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ మార్కెట్ వాటాను మెరుగైన పనితీరు చూపే ప్రైవేటు బ్యాంకులకు, లాభదాయకత ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు కోల్పోతున్నాయి.

ఐషర్ మోటార్స్



రూ.30223.30 వద్ద ప్రారంభమై రూ.30213- 31600 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.30081.20తో పోలిస్తే రూ.1423.60 (4.73%) లాభంతో రూ.31504.80 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,28,219.

బ్యాంక్ ఆఫ్ బరోడా



రూ.166.75 వద్ద మొదలై రూ.162.60- 167 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.166.05తో పోలిస్తే రూ.2.55 (1.54%) నష్టంతో రూ.163.50 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 78,47,054 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
అవంతీ ఫీడ్స్	1762.55	డాక్టర్ రెడ్డీస్	2369.80
బీఈఎంఎల్	1746.90	క్రిసిల్	1836.00
ఇన్‌సెక్టిసైడ్స్	754.00	అజంతా ఫార్మా	1378.40
అదానీ పోర్ట్స్	405.30	లుపిన్	1016.10
మదర్‌సన్ సుమీ	331.00	జెన్సార్ టెక్నాలజీస్	783.90
హిందాల్కో	226.65	జీటీపీఎల్ హాత్‌వే	147.75

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
01/08	4,516	5,461	−946	4,313	2,923	1,391
31/07	5,485	6,682	−1,197	4,865	3,096	1,768
28/07	5,141	5,364	−223	3,627	3,202	425
27/07	9,720	7,850	1,870	5,750	6,410	−660
26/07	5,423	5,484	−61	3,545	2,868	677

కోడిగుడ్లు



1వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	310	వరంగల్	312
చిల్లరగా(ఒక గుడ్డు)	3.70	విశాఖపట్నం	318
బెంగళూరు	360	చెన్నై	372
2న		చిత్తూరు	365
విజయవాడ/గోదావరి	308	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1737.75 (1733.20) 217585
ADANI PORT & 404.00 (395.90) 3391013
AMBUJA CEMEN 260.80 (263.15) 2370928
ASIAN PAINTS 1148.20 (1161.70) 1176561
AUROBIND PHA 734.45 (718.60) 2540358
AXIS BANK LT 516.55 (519.80) 4562630
BAJAJ AUTO L 2823.40 (2808.55) 190726
BANK OFBAROD 163.50 (166.05) 7847054
BHARTI AIRTE 417.05 (418.95) 2206614
BHARTI INFRA 403.70 (401.40) 1633983
BOSCH LTD 24666.50 (24178.10) 18007
BPCL 485.60 (471.15) 3492479
CIPLA 562.45 (560.10) 712732
COAL INDIA L 251.45 (249.10) 5248187
DR. REDDYS 2431.55 (2383.20) 1034078
EICHER MOTOR 31504.80 (30081.20) 128219
GAIL 373.85 (376.75) 2225107
HCL TECH 884.20 (892.90) 1332277
HDFC 1779.10 (1789.25) 3259641
HDFC BANK 1797.20 (1784.40) 2129215
HERO MOTOCOR 3727.85 (3655.75) 685598
HINDALCO IND 225.75 (219.65) 10837725
HINDUSTAN UN 1173.95 (1155.75) 1359063
ICICI BANK 302.60 (302.60) 10722862
INDIABULLS H 1225.20 (1175.25) 2694072
INDIAN OIL 370.35 (367.65) 4757745
INDUSINDBANK 1665.70 (1645.75) 1150244
INFOSYS LTD 1005.55 (1011.20) 3844699
ITC 287.85 (285.25) 13542016
KOTAK MAHIND 1015.30 (1021.65) 2063948
LARSEN & TOU 1190.05 (1193.95) 2721660
LUPIN 1017.90 (1032.00) 2668911
M&M 1429.25 (1403.30) 1941740
MARUTI SUZIK 7856.10 (7750.05) 1096934
NTPC LTD 165.20 (164.20) 5942810
ONGC 167.40 (169.40) 6705176
POWER GRID C 224.40 (223.30) 8585870
RELIANCE IND 1603.60 (1615.20) 2814298
SBI 309.00 (312.50) 14888804
SUN PHARMA 533.80 (531.65) 3699349
TATA CONSULT 2501.65 (2491.80) 873730
TATA MOT DVR 262.60 (260.50) 1254081
TATA MOTORS 446.90 (444.60) 4012791
TATA POWER 82.80 (82.00) 2365558
TATA STEEL L 572.40 (567.10) 5091142
TECH MAHINDR 402.45 (385.85) 12617014
ULTRATECH 4067.85 (4056.90) 243417
VEDANTA LIMI 282.05 (279.85) 6301465
WIPRO 294.80 (288.45) 4035172
YES BANK LTD 1827.25 (1809.50) 2910564
ZEE ENTERTAI 543.60 (541.75) 1854664

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1426.80 (1421.00) 22933
ASHOK LEYLAN 111.05 (109.50) 17902937
BAJAJ FINANC 1716.25 (1703.10) 692591
BAJAJ FINSER 5067.25 (4991.85) 146487
BEL 180.95 (178.75) 8834373
BHEL 144.60 (145.10) 2776932
BRITANNIA 3907.50 (3921.60) 114470
CADILA HEALT 540.65 (543.65) 913963
COLGATE PALM 1069.75 (1079.55) 119519
CONTAINER 1175.70 (1143.85) 896563
CUMMINS INDI 970.60 (987.75) 242615
DABUR INDIA 301.70 (310.00) 1760770
DIVIS LAB 667.75 (672.90) 971964
DLF LIMITED 193.55 (193.35) 6750072
EMAMI LIMITE 1072.00 (1108.10) 186421
GLAXOSMI CON 5467.70 (5469.65) 9537
GLAXOSMI PHA 2385.65 (2400.95) 6298
GLENMARK PHA 699.85 (697.05) 1093719
GODREJ CONSU 964.40 (1037.25) 2971850
HAVELLS INDI 467.60 (472.80) 1170715
HINDUSTAN ZI 282.25 (282.90) 1316008
HPCL 386.75 (383.20) 4466496
ICICI PRU LI 443.95 (458.95) 1109257
IDEA CELLULR 92.55 (92.45) 10279578
INTERGLOBE A 1290.25 (1290.75) 2405404
JSW STEEL LT 223.15 (221.25) 5408688
LIC HOUS.FIN 690.95 (690.45) 3597159
MARICO LIMIT 326.35 (334.70) 5253719
MCDOWELL 2643.55 (2535.70) 633610
MOTHERSON 329.50 (325.00) 2633261
NHPC LTD 30.00 (30.35) 5308602
NMDC LTD 125.95 (126.75) 2703800
OIL INDIA 286.15 (287.50) 464923
ORACLE FIN S 3615.10 (3622.65) 8334
P&G HYG&HEAL 8119.50 (8041.95) 2508
PETRONET LNG 211.65 (203.95) 7353278
PIDILITE IND 795.95 (795.85) 454420
PIRAMAL ENTE 2957.90 (2952.50) 526040
PNB 157.50 (162.30) 11446128
POWER FIN CO 122.25 (124.40) 7924110
RURAL ELEC C 174.85 (175.05) 5797184
SAIL 63.10 (63.25) 2346252
SHREE CEMENT 18631.70 (18601.70) 21000
SHRIRAM TRAN 1033.80 (1017.00) 1871867
SIEMENS 1396.85 (1455.15) 292511
SUN TV LTD 782.45 (780.35) 1079849
TITAN IND 539.35 (544.25) 1346764
TORRENT PHAR 1292.15 (1318.05) 310603
UNITED BREWE 816.70 (820.60) 212498
UPL LIMITED 894.10 (877.15) 1702074

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 185.20 (184.50) 492351
ADANI ENTERP 140.20 (137.90) 2635910
ADANI POWER 33.35 (33.50) 3488648
ALL BANK 74.15 (74.85) 1968767
AMARA RAJA 847.45 (834.40) 171042
ANANT RAJIND 62.75 (63.45) 681386
ANDHRA BANK 56.60 (57.15) 1454828
APOLLO HOSPI 1267.80 (1259.00) 119289
APOLLO TYRES 266.95 (266.50) 2285358
APTECH 209.55 (214.45) 708397
BAJAJ ELECT. 323.05 (327.70) 78526
BAJAJ HIND 15.75 (15.90) 3078263
BAJAJ HOLDIN 2423.20 (2420.90) 9363
BALAJI TELE 173.50 (172.90) 581438
BALLARPUR IN 16.60 (16.60) 1154024
BALRAMPUR CH 162.45 (165.40) 3163387
BANK OF MAHA 28.45 (29.20) 175609
BANK OFINDIA 162.30 (166.00) 4327687
BATA INDIA 586.10 (588.15) 777533
BGR ENERGY S 147.70 (150.25) 60226
BHARAT FORGE 1150.10 (1148.70) 309426
BHUSHAN STEE 71.30 (73.15) 742691
BIOCON LTD 376.70 (384.70) 3282809
BOMBAY DYE 83.15 (83.60) 705792
CANARA BANK 362.70 (368.10) 2017458
CEAT LIMITED 1876.95 (1877.15) 408148
CENTRAL BANK 90.20 (90.55) 1716036
CHAMBAL FERT 135.20 (135.45) 461860
CHENNAI PETR 414.30 (387.00) 4317748
CITY UNIBANK 174.95 (176.35) 845643
CORPO BANK 50.15 (50.65) 337570
COX & KINGS 289.30 (284.85) 309361
D B REALTY L 42.65 (44.35) 1521258
DELTA CORP L 168.55 (170.75) 2080455
DENA BANK 34.95 (34.00) 1732956
DHANALAKBANK 39.45 (40.05) 746836
EDELWEISS CA 204.30 (204.95) 802914
EDUCOMP SOLU 9.30 (9.40) 138570
EID PARRY 338.65 (336.85) 247795
EIH 131.85 (138.75) 163328
ESSAR SHIPPI 27.55 (28.20) 35327
ESTER INDUST 37.00 (37.85) 57690
EXIDE INDUST 223.80 (217.50) 3035465
FEDERAL BANK 115.10 (115.25) 6973313
FINOLEX CABL 477.55 (466.80) 70969
G E SHIP LTD 394.85 (397.60) 32407
GAMMON INDIA 9.35 (9.45) 406867
GAMMON INFRA 4.55 (4.70) 1759807
GATI LIMITED 119.15 (121.20) 404999
GAYATRI PROJ 168.85 (169.60) 29540
GITANJALIGEM 63.50 (64.15) 265135
GMR INFRASTR 18.70 (18.80) 20289231
GODREJ IND 654.65 (663.00) 322811
GRASIM IND 1099.40 (1070.25) 1112239
GUJ ALK&CHEM 402.30 (399.70) 71009
GUJ NRE COKE 2.25 (2.50) 5485723
HCL INFOSYS 47.90 (48.60) 945023
HEXA TECH 256.45 (261.95) 3276195
HIMACHAL FUT 17.70 (18.15) 4734012
HINDU MOTORS 8.40 (8.75) 525603
HOUSING DEV 85.45 (86.75) 7746527
IDBI 59.65 (59.45) 3147048
IDFC 58.70 (58.75) 4789084
IFCI 26.85 (27.05) 3096316
IL&FS TRANS 90.25 (92.00) 412185
IND SWIFTLAB 37.00 (36.75) 14007
INDBULLS REL 233.00 (227.20) 11218974
INDIA CEM 203.50 (203.95) 4505967
INDIAN BANK 306.55 (313.35) 1237908
INDO RAMA SY 30.50 (30.10) 57037
INDRAPRASTHA 1189.95 (1179.10) 331050
IND-SWIFTLTD 9.65 (9.20) 54561
INGERSOLL-R 873.50 (861.95) 28703
IOB 25.15 (24.95) 717003
IPCA LAB 481.40 (478.60) 37526
IRB INFRA DE 227.90 (225.30) 2505875
J&K BANK 83.45 (83.25) 282033
JAI CORP 84.70 (85.85) 507917
JAIN IRRIGAT 105.35 (106.05) 2478310
JAYPEE INFRA 21.55 (21.85) 4149533
JAYSHREE TEA 104.00 (106.35) 522067
JET AIRWAYS 595.50 (596.70) 1257476
JINDAL SAW 105.50 (102.70) 3531650
JINDAL STEEL 155.05 (153.40) 6201163
JK LAKSHMI C 454.95 (457.65) 22092
JK PAPER LIM 94.85 (97.20) 2414015
JM FINANCIAL 119.90 (120.15) 409253
JP ASSOCIATS 28.45 (29.40) 93706856
JSW ENERGY L 70.00 (70.45) 7464286
JUBILANT FOO 1293.95 (1317.75) 563946
JUBILANT ORG 716.50 (714.95) 143023

ఘనం (+)

నిఫ్టీ	1న	మార్పు %
EICHER MOTOR	31504.80	4.73
TECH MAHINDRA	402.45	4.30
INDIABULLS HSG	1225.20	4.25
BPCL	485.60	3.07
HINDALCO	225.75	2.78
AUROBINDO PHA	734.45	2.21
WIPRO	294.80	2.20

గ్రహణం (-)

నిఫ్టీ	1న	మార్పు %
BANK OF BARODA	163.50	-1.54
LUPIN	1017.90	-1.37
ONGC	167.40	-1.18
ASIAN PAINTS	1148.20	-1.16
SBI	309.00	-1.12
HCL TECH	884.20	-0.97
AMBUJA CEM	260.80	-0.89

JYOTHY LABS 372.65 (370.60) 435634
JYOTI STRUC 12.45 (11.90) 257176
KARNATA BANK 152.90 (153.90) 1079399
KEC INTL LTD 306.70 (304.60) 642131
KOLTE PATIL 164.60 (168.05) 84300
KPIT CUMMINS 129.20 (127.95) 1201499
L&TFIN.HOLD 173.45 (175.00) 3314173
LAK VIL BANK 180.65 (178.45) 695474
M & M FINANC 400.65 (401.00) 1631761
MANAPPURAM G 105.80 (106.75) 1996226
MMTC LIMITED 60.55 (61.25) 663310
MOSER-BEAR 5.10 (5.30) 278170
MPHASIS LTD 592.75 (604.60) 74127
MRPL 128.85 (124.25) 4240173
MTNL 20.60 (20.75) 587620
NCC LIMITED 88.90 (88.90) 2417176
NETWORK18 FI 55.25 (55.60) 398585
NEULAND LAB 1439.55 (1438.70) 3182
NIIT LTD 94.50 (98.15) 1516752
NIIT TECHNOL 505.65 (515.50) 405903
OMAXE LTD 202.70 (204.60) 704858
ONMOBILE GLO 63.15 (64.60) 308266
ORIENT PAPER 101.25 (100.20) 4331752
ORIENTALBANK 145.50 (148.05) 2142488
PARSVNATH DE 22.80 (23.35) 500724
PATEL ENGG 81.25 (82.40) 148203
PFIZER 1795.90 (1782.60) 6366
POLARIS SOFT 228.05 (230.55) 96402
POWERTRADING 119.25 (120.50) 2769617
PRAJ IND 76.95 (76.95) 163130
PRISM CEMENT 121.60 (119.80) 126015
PROVOGUE (IN 4.40 (4.45) 58509
PUNJ LLOYD 20.80 (21.25) 1605601
PUNJAB & SIN 53.95 (54.35) 57228
PURAVANKARA 75.30 (75.70) 140567
PVP VENTURES 5.45 (5.75) 103005
PVR LIMITED 1375.10 (1340.55) 301429
RADICO KHAIT 141.65 (141.50) 739257
RAJ OIL MILL 1.45 (1.50) 60657
RAJESH EXPOR 721.45 (711.20) 326074
RALLIS INDIA 238.95 (240.85) 80057
RAMCO IND 227.85 (232.00) 102906
RAMCO SYS 428.70 (431.85) 41937
RAMKY INFRA 99.95 (96.25) 267580
RAYMOND 789.30 (791.75) 268893
RELIANCE CAP 723.30 (724.40) 2761906
RELIANCE COM 25.80 (26.25) 8980784
RELIANCE INF 526.60 (528.65) 1296488
RELIANCE POW 44.30 (45.35) 2986051
ROLTA INDIA 60.00 (58.10) 1228676
SAGAR CEMENT 830.25 (841.45) 13139
SAREGAMA 402.95 (402.15) 132554
SHANTHI GEAR 142.20 (145.15) 33519
SHIPPNG CORP 82.30 (82.80) 290117
SHREE RENUKA 17.80 (18.15) 4343236
SINTEX IND 36.20 (37.20) 18593093
SOBHA DEVELO 394.75 (399.30) 386404
SOUTHINDBANK 29.90 (30.15) 5423710
STERLITE TEC 211.50 (211.60) 1120886
SUJANA METAL 1.95 (2.10) 191104
SUN PHARMA 375.40 (378.75) 416363
SUND FASTNER 404.70 (414.50) 281240
SUZLON ENERG 18.90 (18.95) 18555600
SYND. BANK 73.05 (73.70) 2272650
TATA CHEM 614.10 (619.90) 315243
TATA COFFEE 130.40 (129.20) 359404
TATA COMMUN 657.40 (671.10) 265625
TATA GLOBAL 167.50 (169.55) 2140964
TATA METALIK 659.05 (672.00) 169539
TATA TELESER 7.65 (7.85) 4735315
THE INDIAN H 127.10 (124.65) 261149
TORRENT POWE 181.90 (181.95) 7090360
TRIVENI ENGG 80.95 (81.00) 851033
TTK PRESTIGE 6320.50 (6382.25) 2838
TV TODAY NET 242.20 (241.30) 128156
TV18 BROADCA 39.65 (40.05) 2488877
TVS MOTOR 596.40 (582.10) 1291424
UCO BANK 33.55 (33.10) 449700
UNION BANK 154.20 (158.05) 3829223
UNITECH 8.55 (8.70) 31888620
UNITED BANK 19.50 (19.50) 263177
USHA MARTIN 22.45 (22.55) 6846693
VADILAL INDU 939.80 (911.10) 134029
VENKYS 2125.45 (2114.90) 60646
V-GUARD IND 180.80 (178.15) 1532109
VIJAYA BANK 70.05 (70.00) 523827
VIP 176.60 (172.45) 283387
VOLTAS 533.65 (504.25) 3099028
ZEE LEARN LI 43.00 (43.30) 238267
ZUARI GLOBAL 131.10 (134.65) 54687
ZYDUS WELLNE 890.15 (892.65) 3975

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 855.45 (854.35) 4349
AMAR RAJA BA 848.60 (834.50) 11687
ANDHRA BANK 56.65 (57) 69076
ANDHRA CEMEN 9.80 (9.91) 16617
ANDHRA PAPER 317.60 (321) 14298
ANDHRA PETRO 26.30 (26.80) 35991
ANDHRA SUGAR 339.20 (342.15) 7003
ANJANI PORTL 224.25 (223.15) 1401
ASTRA MICROW 133.90 (134.20) 109812
AUROBINDO PH 734.50 (719.40) 221698
AVANTI FEEDS 1706.15 (1638.60) 47783
AVON ORG 6.44 (5.91) 15399
BALAJI AMIN 331.75 (330.20) 2387
BARTRONICS 15.35 (15.46) 7374
BHAGIRA CHEM 185.25 (187.20) 7474
BHAGYA NAG 24.45 (24.80) 4572
BRILLIANT SE 8.24 (8.14) 1374746
CAMBRIDGE TE 76.25 (77.40) 23633
CONT COFFEE 282.85 (283) 1687
COROMAN FERT 446.45 (448.70) 544138
CYBERMATE 3.48 (3.41) 59487
CYIENT LIMIT 525.05 (525) 7679
DECCAN CEMEN 1144 (1159.95) 1478
DIVI'S LAB 668.35 (671.90) 61408
DR REDDY 2426.75 (2385.50) 80773
GATI CORPN 119.40 (120.90) 43642
GAYATRI PROJ 168.75 (169.35) 1962
GMR INFRASTR 18.70 (18.75) 1283281
GRANULES (I) 137.80 (136.10) 106568
GVK POWER 12.93 (12.83) 3024581
HBL NIFE POW 47.45 (47.70) 29970
HERITAGE FOO 1255.30 (1239) 965
HYD INDUS 1136.80 (1165.10) 2524
IDL INDUSTRS 492.95 (440) 32228
ILFS ENGINEE 46.40 (47.25) 14481
INNAREDY COM 3.20 (3.30) 227437
IVRCL INFRAS 6.47 (6.77) 576560
KAVERI SEED 682.20 (691.95) 21691
KCP LTD 102.80 (103.65) 26816
KERNEX MICRO 36.25 (36.15) 6692
KNR CONSTRUC 211.50 (211.25) 1855
LANCO INDUS 370.05 (375.45) 15063
LANCO INFRAT 1.27 (1.21) 25363493
LAURUS LABS 582.30 (580.75) 5203
MADHUCON PRO 31.75 (32.05) 20257
MIC ELECTRON 8.53 (8.66) 64700
MOLDTK PLA 278.80 (280.30) 4486
NAGARJAGRICH 37.45 (38.40) 19031
NATCO PHARMA 967 (973.55) 29469
NAVA BH VENT 135.40 (137.10) 18170
NCC 88.90 (88.85) 403523
NCL IND 209.55 (196.25) 16120
NETTLINX 98.50 (92.85) 15981
NEULAND LAB 1440.40 (1446.40) 706
NIHAR INFO 16.05 (17.60) 2082
OIL COUNTRY 45.85 (46.85) 2947
PANYAM CEMEN 66.25 (66.60) 14334
PENNER IND 55.30 (54.75) 89459
PHYTOCHEM I 59.25 (59.90) 2295
PIONEER DIST 220.05 (221.60) 1411
PITTI LAMIN 56.05 (54.95) 10889
PRAJAY ENGS 9.38 (9.33) 20098
PREMIER EXPL 481.70 (487.15) 5646
PRISM CEMENT 121.40 (119.75) 16204
PRUDENTL PHA 4.56 (4.46) 155270
RAIN INDUSTR 128.45 (129.90) 107455
SAMKRG PIST 298.60 (296.45) 10247
SAMPRE NUTRI 48 (46.50) 13306
SMS PHARMA 77.10 (77.55) 11003
SREE RAYAL A 32.05 (32.90) 548842
STEEL EXCHAN 92 (94.10) 172810
SUJANA METAL 1.99 (2.13) 57153
SUJANA TOWER 4.82 (4.96) 40473
SUJANA UNIVE 1.20 (1.29) 14633
SURYALAKSH.C 109.70 (110.40) 6989
SURYALATA SP 137.85 (143.65) 504
SUVEN PHARMA 170.10 (166.40) 47954
TAJ GVK HOTE 166.40 (163.45) 106184
TANLA 37.45 (39.05) 52610
TERA SOFTWAR 73.30 (75.30) 4623
VICEROY HOTE 19.15 (19.25) 33777
VIMTA LABS 146.65 (150.10) 6989
VISAKA IND 469.60 (473.90) 8583
VISTA PHARMA 31.20 (32.10) 23045
VIVIMED LABS 121.75 (124.85) 128251
YBRANT DIGIT 6.94 (7.30) 108394
ZENTECH 56.25 (57.10) 6037

ఈనాడు బిజినెస్

కేన్సర్ చికిత్సకు ఎస్‌బీఐ లైఫ్ బీమా పథకం

కోల్‌కతా: ఆరోగ్య సంరక్షణ విభాగంలో మరిన్ని రకాల బీమా పథకాలను తేవడంపై ఎస్‌బీఐ లైఫ్ దృష్టి సారించింది. కేన్సర్ చికిత్స అవసరాలు తీర్చే మొట్టమొదటి బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. 6-65 ఏళ్ల మధ్య వయసున్నవారు ఈ పాలసీని తీసుకోవచ్చని కంపెనీ తెలిపింది. కనీస బీమా మొత్తం (సమ్ అష్యూర్డ్) రూ.10 లక్షలు కాగా గరిష్ఠంగా రూ.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో అత్యధిక కేన్సర్ రోగులున్న దేశాల్లో భారత్ రెండో స్థానానికి చేరుతుందని ఎస్‌బీఐ లైఫ్ అంచనా వేస్తోంది. పబ్లిక్ ఇష్యూకు వెళ్లే నిమిత్తం ఎస్‌బీఐ లైఫ్‌కు ఐఆర్‌డీఏఐ అనుమతులు లభించిన సంగతి తెలిసిందే.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.1.80 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.1.80 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో జరిగిన వసూళ్ల కంటే ఈ మొత్తం 21.4% అధికం. 'బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యంలో 15.32% తొలి మూడు నెలల్లో సాధించాం' అని లోక్‌సభకిచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోశ్ కుమార్ గంగ్వార్ తెలిపారు. క్రెడిట్ కార్డ్, ఏటీఎం, డెబిట్ కార్డ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల సంఖ్య 4.4% పెరిగిందని అన్నారు. 2014-15లో 13,083, 2016-17లో 13,653 కేసులు నమోదయ్యాయన్నారు.



ముకేశ్.. ఆసియా అద్వితీయం

- ఆర్ఐఎల్ షేరు దూకుడుతో ఈ ఘనత
- బ్లూమ్‌బర్గ్ సంపన్నుల జాబితా

దిల్లీ

ఆసియాలోనే రెండో అత్యంత సంపన్నుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ నిలిచారు. హాంకాంగ్‌కు చెందిన స్థిరాస్తి రంగ కుబేరుడు లి కా-షింగ్‌ను వెనక్కినెట్టి ఈ స్థానాన్ని ముకేశ్ దక్కించుకున్నారు. అలీబాబా అధినేత జాక్‌మా అగ్రస్థానంలో నిలిచారు. బ్లూమ్‌బర్గ్ సంపన్నుల సూచీ ప్రకారం ముకేశ్ అంబానీ సంపద ఈ సంవత్సరం 1250 కోట్ల డాలర్లు (సుమారు రూ.81,000 కోట్లు) మేర పెరిగింది. మొత్తం 3520 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,30,000 కోట్లు) నికర సంపదతో బ్లూమ్‌బర్గ్ సూచీలో 19వ స్థానానికి ముకేశ్ చేరారు. 2016లో ఆయన 29వ స్థానంలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా రూపొందించిన ఈ సూచీలో బిల్‌గేట్స్ (మైక్రోసాఫ్ట్), జెఫ్ బెజోస్ (అమెజాన్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. జియోఫోన్ ఆవిష్కరణ అనంతరం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు కనబర్చిన దూకుడు ముకేశ్ సంపద పెరగడానికి కారణమైంది. 4జీ సేవలు అందించే ఈ చౌక ఫీచర్ ఫోన్‌కు రూ.1,500 డిపాజిట్ చేస్తే, మూడేళ్ల తరవాత అంతేమొత్తం తిరిగి పొందవచ్చు. ఈ ఫోన్ అందుబాటులోకి వచ్చాక, నెలకు రూ.153 చొప్పున చెల్లిస్తే, అపరిమిత కాల్స్ ఉచితంగా చేసుకునే వీలుతో పాటు డేటా కూడా పొందొచ్చు. అందువల్ల ప్రస్తుతం 2జీ సేవలు పొందుతున్న 50 కోట్ల మందిలో, అత్యధికులు రిలయన్స్ జియోకు మారతారనే అంచనాలు విపణిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జియో మాతృసంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేరు దూసుకెళ్తోంది. రిలయన్స్ జియోలో ఇప్పటివరకు ఆర్ఐఎల్ 3100 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టింది. టెలికాం వ్యాపారానికి ఆయన ఎంతలా ప్రాధాన్యం ఇస్తున్నారనడానికి ఇదే సంకేతం. రిఫైనింగ్, పెట్రో రసాయనాల వ్యాపారాల నుంచే ఆర్ఐఎల్‌కు దాదాపు 90 శాతం ఆదాయం వస్తుంది. అయితే టెలికాం వ్యాపారంలో పెట్టుబడుల కారణంగా కంపెనీ రుణం 15 ఏళ్ల గరిష్ఠానికి చేరిందని బ్లూమ్‌బర్గ్ నివేదిక తెలిపింది.

సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యం

డ్రాగన్ కంపెనీపై భారత్ కొరడా?

ఫోసన్, గ్లాండ్ ఫార్మా ఒప్పందానికి మంత్రిమండలి కమిటీ విముఖత!



ఈనాడు, హైదరాబాద్, దిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మాలో 86 శాతం వాటాను చైనాకు చెందిన షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ (ఎస్ఎఫ్‌పీ) సొంతం చేసుకునే ప్రతిపాదన సందిగ్ధంలో పడినట్లు కనిపిస్తోంది. వాటా కొనుగోలు ఒప్పందంలో స్వల్ప సవరణ (అమెండ్‌మెంట్ 2) జరిగిందని, ఒప్పందం గడువును (టెర్మినేషన్ తేదీ) 2017 సెప్టెంబరు 26 వరకు పొడిగించామని ఫోసన్ ఫార్మా తన వాటాదారులకు వెల్లడించింది. భారత్‌కు చెందిన ఆర్థిక వ్యవహారాల మంత్రి మండలి కమిటీ (సీసీఈఏ) వద్ద తమ ప్రతిపాదన పరిశీలనకు ఉందని, దీంతో ఒప్పందం గడువును పొడిగించాలని నిర్ణయించామని ఫోసన్ వెల్లడించింది. ఇందుకు ఫోసన్ ఫార్మా, వాటాను విక్రయించిన కేకేఆర్, గ్లాండ్ ఫార్మా ప్రమోటర్లు అంగీకరించారని ఫోసన్ పేర్కొంది. ఫోసన్ ఫార్మా ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల మంత్రిమండలి కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిందని తెలుస్తోంది. చైనా, భారత్‌ల మధ్య ఇటీవల తలెత్తిన సరిహద్దు ఉద్రిక్తత పరిస్థితులే ఇందుకు కారణమన్న వాదనల వినిపిస్తున్నాయి. అటువంటిదేమీ లేదని, గ్లాండ్ ఫార్మాకు చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం చైనా కంపెనీ సొంతం కావడంపై అభ్యంతరాల వల్లే, మంత్రివర్గ సంఘం దీన్ని నిలిపి ఉంచిందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒప్పందం అసలు మంత్రివర్గ సంఘం ముందుకే రాలేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

గ్లాండ్ ఫార్మాలో 86.08 శాతం వాటాను దాదాపు రూ.8,500 కోట్లకు సొంతం చేసుకుంటున్నట్లు గత ఏడాది జులైలో ఫోసన్ ఫార్మా ప్రకటించింది. గ్లాండ్ ఫార్మా ప్రమోటర్లు, అమెరికాకు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ కేకేఆర్ నుంచి ఈ వాటా కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఔషధ తయారీ రంగంలో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో, ఈ వాటాను చైనా గ్రూప్ కొనుగోలు చేసింది. ఒప్పందానికి భారత్‌కు చెందిన కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) కొద్ది నెలల క్రితం ఆమోదం తెలిపాయి. అయితే రూ.5,000 కోట్లకు మించిన ప్రతిపాదనలకు సీసీఈఏ ఆమోదం కావాల్సి ఉన్నందున, దాని పరిశీలనకు పంపింది. ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘ సమావేశానికి ప్రధాన మంత్రి అధ్యక్షత వహిస్తారు. ఒప్పందం తాజా స్థితిపై ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి అధికార సమాచారమేమీ లేదని గ్లాండ్ ఫార్మా పేర్కొంది. వాటా విక్రయం ఒప్పందానికి ముందు గ్లాండ్ ఫార్మా ప్రమోటరు రవి పెన్మెత్స కుటుంబానికి, కేకేఆర్‌కు కంపెనీలో 95 శాతం వాటా ఉంది. గ్లాండ్ ఫార్మా చైనా కంపెనీ సొంతమైతే.. భారత్‌లో ఇదే చైనాకు అతిపెద్ద కొనుగోలవుతుంది.

60 రకాలకు పైగా సూది మందుల తయారీ

హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మాకు ఇంజెక్షన్లను తయారు చేయడంలో మంచి పట్టు ఉంది. కంపెనీకి ఉన్న నాలుగు యూనిట్లలో వివిధ రోగాల చికిత్సల్లో వినియోగించే 60 పైగా ఇంజెక్షన్లను తయారు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్, పాశమైలారం, మరో చోట మూడు యూనిట్లు, విశాఖట్నంలో ప్రత్యేక ఆర్థిక మండలం (సెజ్) యూనిట్ ఉన్నాయి. విశాఖ యూనిట్‌లో కేన్సర్ ఇంజెక్షన్లను తయారు చేస్తోంది.

పావు శాతమా.. అర శాతమా?

కీలక రేట్లపై నేడే నిర్ణయం

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) రెండు రోజుల సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం కీలక రేట్లపై ప్రకటన వెలువడనుంది. ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయిలకు దిగిరావడంతో, రెపో రేటులో కనీసం పావు శాతం మేర కోత విధించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం చరిత్రాత్మక కనిష్ఠ స్థాయి అయిన 1.54 శాతానికి చేరిన నేపథ్యంలో ఆర్‌బీఐ అర శాతం దాకా రెపో రేటు తగ్గించొచ్చని మరి కొంత మంది విశ్లేషకులు భావిస్తున్నారు. జూన్‌లో జరిగిన ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో, వరుసగా నాలుగోసారి ఎటువంటి మార్పులూ చేయకుండా రెపో రేటును 6.25 శాతం వద్దే ఎమ్‌పీసీ ఉంచింది. 'ఆగస్టు 2, 2017 మధ్యాహ్నం 2:30కు ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో మూడో ద్వైమాసిక పరపతి విధానంపై ఎమ్‌పీసీ నిర్ణయాన్ని ఉంచుతామ'ని గత నెలలో ఆర్‌బీఐ పేర్కొంది.

ఝుమ్మంది జులై

- వాహన విక్రయాలు భళా
- దుమ్మురేపిన మారుతీ
- ఐషర్, అశోక్ లేలాండ్ అదుర్స్

దిల్లీ: జులైలో వాహనాల అమ్మకాలు ఝుమ్మన్నాయి. కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు.. ఇలా ప్రతి వాహన కంపెనీ విక్రయాల్లో వృద్ధి నమోదైంది. ధరల తగ్గింపు, జీఎస్‌టీ అమలు అనంతరం కొత్త నిల్వల రాక ఇందుకు తోడ్పడింది. మారుతీ సుజుకీ రికార్డు అమ్మకాలతో దుమ్మురేపింది. గత నెలలో ఎన్నడూ లేని విధంగా 1,65,346 వాహనాలను విక్రయించింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదైన 1,44,492 వాహన అమ్మకాల రికార్డు బద్దలైంది. కంపెనీ దేశీయ విక్రయాలు కూడా 22.4 శాతం వృద్ధితో 1,54,001 వాహనాలకు చేరాయి. గత నెలలో ఆల్టో, వ్యాగన్‌ఆర్ సహా చిన్న కార్లను 42,310 వరకు కంపెనీ విక్రయించింది. గతేడాది జులైలో విక్రయించిన 35,051 వాహనాలతో పోలిస్తే ఈ సంఖ్య ఎక్కువ. మారుతీ కాంపాక్ట్ కార్ల (స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనో) విభాగం కూడా రాణించింది. టాటా మోటార్స్, హ్యుందాయ్, హోండా కార్ల అమ్మకాలు కూడా అంచనాలను అందుకున్నాయి. మరోవైపు అశోక్ లేలాండ్, ఐషర్ మోటార్స్ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. ఎస్కార్ట్స్ ట్రాక్టర్ల అమ్మకాలు 34% పెరగగా.. మహీంద్రా ట్రాక్టర్ల అమ్మకాల్లో స్వల్పంగా 7.29% వృద్ధి ఉంది. ద్విచక్రవాహనాల విషయానికొస్తే.. హీరో మోటోకార్ప్, హోండా మోటార్‌సైకిల్స్, టీవీఎస్ అమ్మకాలు ఆకట్టుకునే రీతిలోనే ఉన్నాయి. గత నెలలో ఆయా కంపెనీల మొత్తం విక్రయాలు (దేశీయ అమ్మకాలు, ఎగుమతులు కలిపి) పట్టికలో..



జులైలో వాహనాల అమ్మకాలు

కంపెనీ	2016	2017	వృద్ధి/క్షీణత
మారుతీ సుజుకీ	1,37,116	1,65,346	20.6
టాటా మోటార్స్	43,160	46,216	7
హోండా కార్స్ ఇండియా	14,033	17,085	21.74
ఫోర్డ్ ఇండియా	17,742	26,075	46.96
ఫోక్స్‌వ్యాగన్	4,301	4,753	10.5
మహీంద్రా అండ్ మహీంద్రా	39,458	41,747	6
హ్యుందాయ్	41,201	43,007	4.38
ఐషర్ మోటార్స్	53,378	64,459	20.75
అశోక్ లేలాండ్	10,492	11,981	14.19
వీఈసీవీ	4,374	4,359	---
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	4,035	5,418	34.3
మహీంద్రా	17,553	18,832	7.29
ద్విచక్రవాహనాలు			
హీరో మోటోకార్ప్	5,32,113	6,23,269	17.13
హోండా మోటార్‌సైకిల్	4,53,884	5,44,508	19.96
టీవీఎస్ మోటార్	2,48,002	2,71,171	9.34
సుజుకీ మోటార్‌సైకిల్	24,703	40,038	62

పేటీఎం మెసేజింగ్ సేవలు!

వాట్సాప్‌తో పోటీపడే అవకాశం

దిల్లీ: మొబైల్ వాలెట్ సంస్థ పేటీఎం ఈ నెలాఖరుకి మెసేజింగ్ సేవలను ప్రారంభించనుందని సమాచారం. తద్వారా ఫేస్‌బుక్‌కు చెందిన వాట్సాప్‌తో పోటీపడనుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. పేటీఎం తమ ప్లాట్‌ఫామ్‌పై ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి తీసుకురానుంది. దీనిపై వినియోగదారులు చాటింగ్ చేసుకోవడంతో పాటు వీడియోలు, దృశ్యాలు, ఆడియోలను సైతం పంచుకోవచ్చని సమాచారం. దీనిపై స్పందించేందుకు పేటీఎం అధికార ప్రతినిధి నిరాకరించారు. పేటీఎం గత మూడు నెలల నుంచి ఈ కొత్త ఫీచర్‌పై పనిచేస్తోందని, మెసేజింగ్ సేవలను తీసుకొస్తే.. వినియోగదారులు మరింత పెరిగే అవకాశం ఉందని సంస్థ భావిస్తోంది. డిజిటల్ చెల్లింపుల విభాగంలోకి అడుగుపెట్టేందుకు వాట్సాప్ సన్నాహాలు చేస్తోన్న తరుణంలోనే, పేటీఎం ఈ ప్రయత్నాలు చేయడం గమనార్హం.

బ్లాక్‌బెర్రీ కొత్త స్మార్ట్‌ఫోన్ కీవన్

ధర రూ.39,990

దిల్లీ: దేశీయ విపణిలోకి బ్లాక్‌బెర్రీ మళ్లీ ప్రవేశించింది. సరికొత్త స్మార్ట్‌ఫోన్ కీవన్‌ను బ్లాక్‌బెర్రీ భాగస్వామి ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ దేశీయ విపణిలోకి మంగళవారం విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి అమెజాన్‌లో ఈ 4జీ డ్యూయల్ సిమ్‌ఫోన్లు లభ్యమవుతాయని సంస్థ పేర్కొంది. రూ.39,900 విలువైన ఈ ఫోన్‌కు 4.5 అంగుళాల తెర, 4జీబీ ర్యామ్, 2.5గిగాహెర్ట్జ్ ఆక్టాకోర్ క్వాల్‌కామ్ ప్రాసెసర్, 64జీబీ అంతర్గత మెమొరీ (2టీబీ వరకు విస్తరించుకోవచ్చు), 12-8 మెగాపిక్సెల్ కెమేరాలు, 3,505 ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చారు. ఆండ్రాయిడ్ 7.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది.



ఇంటి వద్ద ఆరోగ్య సేవలకు క్లినికోపిడియా

ఈనాడు, హైదరాబాద్: ఇంటి వద్దే చికిత్స అనంతర ఆరోగ్య సంరక్షణ సేవలు, మంచంపైనే ఉండి లేవలేని రోగులు, వృద్ధులకు సంరక్షణ సేవలను అందించడానికి క్లిక్2క్లినిక్ హెల్త్‌కేర్ అంకుర కంపెనీ ముందుకు వచ్చింది. అమెరికాలోని దాదాపు 10 మంది తెలుగు డాక్టర్లు దీన్ని ప్రారంభించారు. వృద్ధులను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సంరక్షణ రంగంలో 'అగ్రిగేటర్'గా డాక్టర్ సలహాలు, నర్సుల సేవలు, ఔషధాల సరఫరా మొదలైన సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి 'క్లినికోపిడియా' అప్లికేషన్‌ను (యాప్) విడుదల చేసినట్లు క్లిక్2క్లినిక్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి మురళీ భరద్వాజ్ తెలిపారు. ఇప్పటికే ఈ రంగంలో కంపెనీలు ఉన్నప్పటికీ.. క్లిక్2క్లినిక్ డాక్టర్లు ప్రారంభించి, నిర్వహిస్తున్న కంపెనీ అని, పూర్తి స్థాయిలో వైద్య ప్రమాణాలకు అనుగుణంగా రోగులకు సేవలందుతాయని వివరించారు. భారత్‌తో పాటు అనుబంధ సంస్థల ద్వారా మలేషియా, వియత్నాం, థాయ్‌లాండ్‌లలో కూడా కార్యకలాపాలను ప్రారంభించింది. భారత్‌లో ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరుల్లో కార్యకలాపాలను ప్రారంభించింది. జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రోగులు ఉండే సమీప ప్రాంతంలోని డాక్టర్లు, నర్సుల ద్వారా సేవలు పొందే అవకాశం కల్పిస్తారు. టెలిమెడిసన్ ద్వారా సలహాలు ఇచ్చేందుకు హైదరాబాద్‌లో 2,000 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు పేర్లను నమోదు చేసుకున్నారని కంపెనీ ఛైర్మన్ సుజిత్ ఆర్ పున్నం తెలిపారు. నర్సులు, ఫిజియో థెరపీ నిపుణులు కూడా అగ్రిగేటర్ సేవలను వినియోగించుకోనున్నారు. వచ్చే రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 35 పట్టణాలకు సేవలను విస్తరిస్తామని, లక్ష మంది డాక్టర్లను ఈ వేదికపైకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఒక్క భారత్‌లోని సేవలకే ఇప్పటి వరకూ రూ.4 కోట్లు వెచ్చించామని, ఇందులో ఏంజెల్ ఇన్వెస్టర్ల ద్వారా రూ.2 కోట్లు సమకూరాయని క్లిక్2క్లినిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వివేక్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో 2 మిలియన్ డాలర్ల వరకూ సమీకరించాలని భావిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో ఉండి రోజుకు రూ.5,000 వరకూ చెల్లింపుతో పొందే వైద్యం, ఇతర సేవలను ఇంటి వద్ద రూ.1,000కే అందుబాటులోకి తీసుకురావాలన్నది తమ లక్ష్యమని సుజిత్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 12,000 మంది క్లినికోపిడియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, 2017 చివరి నాటికి లక్ష డౌన్‌లోడ్‌లను లక్ష్యంగా పెట్టుకున్నామని భరద్వాజ్ చెప్పారు.



హైదరాబాద్‌లో లాంఛనంగా సేవలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతున్న క్లిక్2క్లినిక్ సీఓఓ వివేక్ రెడ్డి (ఎడం నుంచి మూడో వ్యక్తి). పక్కన సీఈఓ మురళీ భరద్వాజ్, ఛైర్మన్ సుజీత్ రెడ్డి పున్నం తదితరులు

భారత్‌లో తయారీకి గూగుల్ బాసట

దేశీయ యాప్ రూపకర్తలకు చేయూత

బెంగళూరు: 'భారత్‌లో తయారీ' (మేకిన్ ఇండియా) కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నట్లు గూగుల్ ఇండియా తెలిపింది. ఇందులో భాగంగా భారత్‌లోని యాప్ రూపకర్తలకు తన వంతు సహకారం అందించనున్నట్లు పేర్కొంది. 'భారత్ కోసం భారత్ తయారుచేసే' అత్యంత నాణ్యతతో కూడిన యాప్‌ల అభివృద్ధిలో తయారీదార్లు విజయవంతం అయ్యేలా చేయూత అందించేందుకు కట్టుబడి ఉన్నామని గూగుల్ ఇండియా పునరుద్ఘాటించింది. 'భారత విపణికి అనువైన యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్‌లోని ప్రత్యేక విభాగంలో పొందుపరిచాం. వీటి కోసం భారత్‌లోని తయారీదార్లు ఇకనుంచి దరఖాస్తు చేసుకోవచ్చ'ని తెలిపింది. 'స్థానిక సంబంధిత వ్యాపార అభివృద్ధి, విజయవంతం నిమిత్తం అన్ని స్థాయిల తయారీదార్లకు గూగుల్ ప్లే ద్వారా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామ'ని ఇక్కడ జరిగిన యాప్ ఎక్సలెన్స్ సదస్సులో గూగుల్ ఇండియా డైరెక్టర్ (వ్యాపార అభివృద్ధి, గేమ్స్ అండ్ అప్లికేషన్స్) పూర్ణిమా కోచికర్ తెలిపారు. భారత్‌లో అత్యధిక ఇంటర్నెట్ వినియోగదార్లు స్మార్ట్‌ఫోన్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని గూగుల్ తెలిపింది. ఇటీవల ఈ ధోరణి గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ప్రస్తుతం అమెరికాతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువ మంది ఆండ్రాయిడ్ ఫోన్లు ఉపయోగిస్తున్నారని వెల్లడించింది. భారత్‌లోని ప్రజలు గూగుల్ ప్లే నుంచి ప్రతి నెలా 100 కోట్లకు పైగా యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారని పేర్కొంది. భారత్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటున్న యాప్‌ల సంఖ్యలో ఏటా 150 శాతం వృద్ధి ఉంటోందని తెలిపింది. యాప్స్, గేమ్స్ వినియోగంలో గణనీయ వృద్ధి కనిపిస్తోందని, గతేడాదిలో ఇది మూడు రెట్లు పెరిగిందని వివరించింది.

ఫ్లిప్‌కార్ట్ వైపు సాఫ్ట్‌బ్యాంక్ అడుగులు

- 2 బి.డాలర్ల వరకు పెట్టుబడులు
- విలీనానికి స్నాప్‌డీల్ తిరస్కరణ నేపథ్యం

దిల్లీ

అనుకున్నట్లే జరుగుతోంది.. ఫ్లిప్‌కార్ట్ ఆఫర్‌ను స్నాప్‌డీల్ తిరస్కరించడంతో, ఫ్లిప్‌కార్ట్‌లో వాటా కోసం నేరుగా పెట్టుబడులు పెట్టాలని సాఫ్ట్‌బ్యాంక్ భావిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌లో స్నాప్‌డీల్ విలీనమై ఉంటే, స్నాప్‌డీల్‌లో ముఖ్య వాటాదారైన సాఫ్ట్‌బ్యాంక్‌కు ఫ్లిప్‌కార్ట్‌లో వాటా వచ్చేది. అయితే ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందానికి స్నాప్‌డీల్ అంగీకరించకపోవడంతో, ఇపుడు మరో మార్గంలో వెళుతోంది. ఎలాగంటే.. సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ ద్వారా ఫ్లిప్‌కార్ట్‌లో కనీసం 1.5-2 బిలియన్ డాలర్ల (రూ.9750-13,000 కోట్లు) పెట్టుబడులు పెట్టనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.





పెట్టుబడుల పరంపర

- ✦ ఇప్పటికే సాఫ్ట్‌బ్యాంక్ భారత అంకుర సంస్థలైన స్నాప్‌డీల్, ఓలా వంటి వాటిలో పెట్టుబడులు పెట్టింది.
- ✦ 2014 నుంచి భారత్‌లో ఈ కంపెనీ 10 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు పెట్టింది.
- ✦ ఈ ఏడాది మేలోనూ పేటీఎమ్‌లో 1.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9079 కోట్లు) పెట్టుబడులు పెట్టింది.

తాజా పరిణామాలపై సాఫ్ట్‌బ్యాంక్ ప్రతినిధిని సంప్రదించగా.. 'సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ ప్రతి పెట్టుబడినీ సొంతంగా పరిశీలిస్తుంది. సొంతంగా నిర్ణయం తీసుకుంటుంద'ని అన్నారు. ఫ్లిప్‌కార్ట్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ అంటే..: జపాన్‌కు చెందిన టెలికాం, ఇంటర్నెట్ దిగ్గజ సంస్థ సాఫ్ట్‌బ్యాంక్ (గ్రూప్ ఛైర్మన్ మసయోషి సన్ ఈ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రత్యేక కంపెనీగా పనిచేస్తోంది. ఇందులో యాపిల్, ఫాక్స్‌కాన్, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఆఫ్ ద కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియా వంటివి భాగస్వాములుగా ఉన్నాయి. మేలో సాఫ్ట్‌బ్యాంక్ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం.. తదుపరి తరం వినూత్నతను ప్రదర్శించే కంపెనీల్లో 'అర్థవంతమైన, దీర్ఘకాల' పెట్టుబడులే లక్ష్యంగా ఈ ఫండ్ పనిచేస్తుంది.

- ✦ ఫ్లిప్‌కార్ట్ తరపున చూస్తే, సాఫ్ట్‌బ్యాంక్ ద్వారా వచ్చే నిధులు అమెరికాకు చెందిన దిగ్గజ ఇకామర్స్ సంస్థ అమెజాన్‌తో పోటీ పడడానికి ఉపయోగపడతాయి. ఈ రెండూ(ఫ్లిప్‌కార్ట్, అమెజాన్) దేశీయ ఇ-కామర్స్ రంగంలో తీవ్ర స్థాయిలో పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.

ఇ-బే ఇండియా విలీనం పూర్తి

ఇ-బే ఇండియా కార్యకలాపాలు విలీనం చేసుకోవడాన్ని పూర్తి చేసినట్లు ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. దీంతో ఇబే డాట్ ఇన్ ఇకపై ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ కంపెనీగా మారుతుంది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ ఇబే, టెన్సెంట్, మైక్రోసాఫ్ట్‌ల నుంచి 1.4 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించిన సందర్భంలో, ఈ ఒప్పందాన్ని ప్రకటించిన సంగతి విదితమే. ఫ్లిప్‌కార్ట్‌లో ఈక్విటీ వాటా మార్పిడి కోసం ఇ-బే 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టింది. 'తాజా పరిణామంతో ఫ్లిప్‌కార్ట్ వినియోగదార్లకు మరిన్ని ఉత్పత్తులు ఎంచుకోడానికి వీలవుతుంది. ఇ-బే వినియోగదార్లు సైతం ఫ్లిప్‌కార్ట్ విక్రేతల నుంచి భారత ఉత్పత్తులను పొందొచ్చ'ని ఫ్లిప్‌కార్ట్ ఒక ప్రకటనలో పేర్కొంది. 'రెండు కంపెనీల కలయిక వల్ల భారత వినియోగదార్లు, విక్రేతలు ప్రయోజనాలు పొందుతార'ని ఫ్లిప్‌కార్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కల్యాణ్ కృష్ణమూర్తి పేర్కొన్నారు.



రామోజీ ఫిలింసిటీలో యుద్ధాలు.. భావోద్వేగాలు... పాటలు



రామోజీ ఫిలింసిటీలో సినీ తారల సందడి జోరుగా సాగుతోంది. కొంతమంది నటులు కుటుంబ భావోద్వేగాలతో మనసుని పిండేసే ప్రయత్నంలో ఉంటే...మరి కొంత మంది జాతర సంబరాల్లో తేలియాడుతున్నారు. ఇంకొందరు యుద్ధ భూమిలో పోరాడుతున్నారు. ఇంకా చాలానే విశేషాలు ఉన్నాయి. మరి ఆ సందడేంటి? ఆ నటీనటులు ఎవరు? ఓ సారి చూసేద్దాం..!

మణికర్ణిక యుద్ధం

గుర్రాలు...కత్తులు..సైనికులు...గుడారాలు... ఇలా రామోజీ ఫిలింసిటీలోని ఓ ప్రాంతంలో ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణమే కనిపిస్తోంది. భారీ యుద్ధ సన్నివేశాల్ని వెండితెరపై ఆవిష్కరించే పనిలో బిజీగా ఉన్నారు దర్శకుడు క్రిష్. రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత కథని 'మణికర్ణిక' పేరుతో తెరకెక్కిస్తున్నారు క్రిష్. ఇందులో లక్ష్మీబాయిగా కంగనా రనౌత్ నటిస్తోంది. ఇప్పటికే కంగనాపై కొన్ని కీలక సన్నివేశాలను ఫిలింసిటీలో తెరకెక్కించారు. ప్రస్తుతం యుద్ధంలో ప్రతినాయకుడికి సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. ఈ నెల 9 నుంచి యుద్ధానికి సంబంధించిన కీలక సన్నివేశాల్లో కంగనా పాల్గోనుంది. కమల్ జైన్ నిర్మాతగా తెరకెక్కుతోన్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15 వరకు ఇక్కడే జరగనుంది.

జాతరలో శర్వా



ఫిలింసిటీలోని వుడ్ ల్యాండ్‌లో జాతర సందడి మొదలైంది. శర్వానంద్, మెహరీన్ కౌర్, నాజర్ తదితరులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఈ ఖుషీ అంతా యువీ క్రియేషన్స్ నిర్మిస్తోన్న 'మహానుభావుడు' చిత్రం కోసం. ఈ సినిమాలోని జాతరకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని వంశీ కృష్ణ, ప్రమోద్ రాజు నిర్మిస్తున్నారు. ఈ నెల 5 వరకు ఇక్కడే షూటింగ్ చేయనున్నారు.

పాటేసుకుంటున్న వరుణ్




రైల్వే స్టేషన్‌లో రాశీ ఖన్నాతో ఓ పాటేసుకుంటున్నాడు వరుణ్‌తేజ్. ఈ ఇద్దరూ జంటగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి బి.బాపినీడు నిర్మాత. ఈ చిత్రంలో నాయకానాయికలపై వచ్చే ఓ పాటను శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే ఫిలింసిటీలో ఓ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించారు. త్వరలోనే ఫిలింసిటీలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించబోతున్నారు.

పల్లెటూరి శ్రీను



రామోజీ ఫిలింసిటీలోని ఎమ్‌సిటీలోని రామచంద్రాపురం స్ట్రీట్ పల్లెటూరి వాతావరణంతో కళకళలాడుతోంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా శ్రీ అభిషేక్ పిక్చర్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వెంకట్ అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆవు నేపథ్యంగా వచ్చే సన్నివేశాలను రామోజీ ఫిలింసిటీలో తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. ఇక్కడే మరిన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

భావోద్వేగాల నాగశౌర్య



భావోద్వేగాలతో ప్రేక్షకుల్ని కట్టిపడేసే పనిలో ఉన్నాడు నాగశౌర్య. ఆయన కథానాయకుడిగా స్వాజిత్ మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. నాగశౌర్య, షామిలి, రావు రమేష్, హేమ తదితరులపై కుటుంబ నేపథ్యంగా వచ్చే సన్నివేశాలను రామోజీ ఫిలింసిటీలో ఎమ్ సిటీ మండువా హౌస్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ నెల 15 వరకు ఫిలింసిటీలోనే చిత్రీకరణ చేయనున్నారు. పి.సుందర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి డి.కుమార్ రాజా నిర్మాత.

ఈనాడు సినిమా



'జవాన్'లో సాయిధరమ్ తేజ్

దేశభక్తి కిరీటం కాదు... కృతజ్ఞత

కొంతమంది కలిస్తే కుటుంబం అవుతుంది. కొన్ని లక్షల కుటుంబాలు కలిస్తే దేశం అవుతుంది. దేశభక్తి అంటే కిరీటం కాదు, కృతజ్ఞత... అంటూ సాయిధరమ్ తేజ్ సందేశం ఇచ్చాడు. 'జవాన్'గా ఆయన ఇంకా ఏమేం చెబుతాడో, ఎలాంటి సందడి చేస్తాడో తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. సాయిధరమ్ తేజ్, మెహరీన్ జంటగా నటిస్తున్న చిత్రం 'జవాన్'. బి.వి.ఎస్.రవి దర్శకత్వం వహిస్తున్నారు. కృష్ణ నిర్మాత. దిల్‌రాజు సమర్పిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "దేశానికి జవాన్ ఎంత అవసరమో... ప్రతి ఇంటికీ మా కథానాయకుడిలా ఒకరు ఉండాలని చెప్పే ప్రయత్నమే మా చిత్రం. మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో సాయిధరమ్ తేజ్ కనిపిస్తారు. భావోద్వేగాలతో కూడిన చిత్రమిది. తమన్ పాటలు అలరిస్తాయి. మెహరీన్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సెప్టెంబరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ప్రసన్న, జయప్రకాష్, ఈశ్వరీ రావు తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కె.వి.గుహన్.

రైతన్నల కోసం పోరాటం... 'అన్నదాత సుఖీభవ'



ఆర్.నారాయణమూర్తి

ఆర్. నారాయణమూర్తి నటిస్తూ స్వీయ దర్శకత్వంలో సామాజిక సమస్యలే ఇతివృత్తాలుగా చిత్రాలు తీస్తుంటారు. ఇప్పుడాయన మరో కొత్త ప్రయత్నం చేస్తున్నారు. అదే... 'అన్నదాత సుఖీభవ'. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ "ఈ నెల 4న పశ్చిమగోదావరి జిల్లాలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. అందరికీ అన్నం పెట్టే రైతు లేనిదే రాజ్యం లేదు. కానీ ఈనాడు ఆ రైతు ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. పంటకి గిట్టుబాటు ధర లభించకపోవడమే ఇందుకు ప్రధానకారణం. ఈ సమస్యే నా చిత్రానికి ఇతివృత్తం. రైతు ఆత్మహత్యలు ఆగాలంటే గిట్టుబాటు ధరల్ని అందించాల్సిందే. ఆ బాధ్యత మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. ఈ విషయాన్నే నా చిత్రం ద్వారా చెబుతున్నాను. దేశవ్యాప్తంగా పేరుకుపోయిన దళారీ వ్యవస్థను సమూలంగా నిర్మూలిస్తేనే రైతులకి గిట్టుబాటు ధరలు లభిస్తాయి. 11 పాటలున్నాయి. రికార్డింగ్ కూడా పూర్తయింద"న్నారు.

2015లో నాలుగు సినిమాలు... 2016లో మూడు సినిమాలు... ఇదీ అక్షయ్ కుమార్ ఎక్స్‌ప్రెస్ వేగానికి నిదర్శనం. అందుకే అక్షయ్‌కు బాలీవుడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అని బిరుదివ్వొచ్చు. ఇతర స్టార్ కథానాయకులు ఏడాదికో సినిమా చేయడమే కష్టంగా ఉంటే అక్షయ్ మాత్రం దూసుకెళ్లిపోతున్నాడు. ఇంత వేగంలోనూ ప్రతి సినిమాకూ ఓ వినూత్నమైన కథతో, విభిన్నమైన పాత్రతో వహ్వా అనిపిస్తున్నాడు. ఈ ఏడాది 'జాలీ ఎల్ఎల్‌బీ 2'తో నవ్వులు పూయించిన అక్షయ్ 'నామ్ షబానా'లో అతిథి పాత్రలో మెరిశాడు. త్వరలో 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ'తో పలకరించబోతున్నాడు. దీంతో పాటు మరిన్ని చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అవేంటో చూద్దాం.

బాలీవుడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్..!



టాయిలెట్... ఏక్ ప్రేమ్‌కథ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ పథకం నేపథ్యంలో, మరుగుదొడ్ల ఆవశ్యకతను చెప్పేలా ఓ సరదా ప్రేమ కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మరుగుదొడ్డి ఉంటేనే పెళ్లికి అంగీకరిస్తున్న యువతుల స్ఫూర్తితో ఈ కథను రాసుకొన్నట్లు సమాచారం. అక్షయ్ కుమార్ గ్రామీణ యువకుడిగా నటిస్తున్నారు. ఆయన సరసన భూమిపడ్నేకర్ నాయికగా కనిపించనుంది. శ్రీ నారాయణ సింగ్ దర్శకుడు. ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం ఈ నెల 11న విడుదలకానుంది.

2.0: ఈ చిత్రంతో తొలిసారి పూర్తిస్థాయి ప్రతినాయకుడిగా మారుతున్నాడు అక్షయ్. సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ఢీకొనే దీటైన ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడాయన. 'రోబో'కు సీక్వెల్‌గా శంకర్ తెరకెక్కిస్తున్న '2.0'లో డాక్టర్ రిచర్డ్ అనే పాత్రలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారు అక్షయ్. ఇందులో ఆయన విభిన్నమైన మేకప్‌తో ఓ భయంకరమైన గెటప్‌లో కనిపించబోతున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌కు విశేష స్పందన వచ్చింది. తన కెరీర్‌లో ఇదో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని అక్షయ్ చెప్పారు. వచ్చే జనవరిలో ఈ చిత్రం విడుదలవుతుంది.

ప్యాడ్‌మ్యాన్: తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనాథమ్ అనే వ్యక్తి జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. స్త్రీలకు అవసరమైన శానిటరీ న్యాప్‌కిన్లను అతి తక్కువ వ్యయంతో తయారుచేయడానికి వీలైన యంత్రాన్ని రూపొందించి వార్తల్లో నిలిచారు అరుణాచలం. ఈ చిత్రానికి ఆర్.బాల్కి దర్శకుడు. అక్షయ్ భార్య ట్వింకిల్ ఖన్నా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అక్షయ్ సరసన సోనమ్ కపూర్ నాయికగా నటిస్తోంది. రాధికా ఆప్టే ఓ కీలక పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. వచ్చే ఏడాది జనవరి 26న విడుదలవుతుంది.

మొఘల్: ఓ వైపు సినిమా చిత్రీకరణలతో బిజీగా ఉన్నప్పటికీ కొత్త కథలు వినడానికి అక్షయ్ ఆసక్తి చూపిస్తున్నారు. ఇటీవలే ఓ కథను ఓకే చేశాడు. అది కూడా ఓ బయోపిక్ కావడం విశేషం. టి సిరీస్ ఆడియో సంస్థను స్థాపించి క్యాసెట్ కింగ్‌గా ఓ వెలుగు వెలిగి అనూహ్యంగా దారుణ హత్యకు గురైన గుల్షన్ కుమార్ జీవితకథతో ఈ చిత్రం తెరకెక్కనుంది. దీనికి 'మొఘల్' అనే పేరు ప్రచారంలో ఉంది.

క్రాక్.. బేబీ 2: అక్షయ్, నీరజ్ పాండేలది విజయవంతమైన జోడీ. వీరి కలయికలో వచ్చిన 'స్పెషల్ 26', 'బేబీ' ఆకట్టుకున్నాయి. ఇప్పుడు వీరి నుంచి మరో రెండు చిత్రాలకు రంగం సిద్ధమైంది. 'బేబీ' సీక్వెల్‌గా 'బేబీ 2' చేస్తామని వీరు ప్రకటించారు. దాంతో పాటు అక్షయ్‌తో 'క్రాక్' పేరుతో మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు నీరజ్ సన్నాహాలు చేస్తున్నారు.

పంచ్ డైలాగ్

స్నేహితుడిలో... మంచి స్నేహితుడు, చెడ్డ స్నేహితుడు ఏంటి...? స్నేహితుడు అంటేనే మంచివాడు! చిత్రం: ఒక రాజు ఒక రాణి
- పంపినవారు: షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512 మెయిల్ ఐడీ: cinema@eenadu.net

దేవిశ్రీకి నాపై కోపం వచ్చింది

దర్శకులు నిర్మాతలుగా మారుతున్నారు. తమ అభిరుచులకు అనుగుణంగా చిన్న చిత్రాల్ని రూపొందిస్తున్నారు. నిర్మాతగా సుకుమార్ ప్రయాణం 'కుమారి 21 ఎఫ్'తో ప్రారంభమై విజయం అందుకున్నారు. ఆ స్ఫూర్తితో ఇప్పుడు 'దర్శకుడు'ని రూపొందించారు. హరి ప్రసాద్ జక్కా ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ఈ చిత్రం శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సుకుమార్ పాత్రికేయులతో ముచ్చటించారు.



'దర్శకుడు' ఫైనల్ కాపీ చూశారా? ఏం అనిపించింది?

బాగా నచ్చింది. హరిప్రసాద్ ఈ కథని బాగా తీర్చిదిద్దాడు. అశోక్ బాగా నటించాడు. చిన్న చిన్న భావోద్వేగాల్ని చక్కగా పలికాడు.

అశోక్ హీరోగా మారతానంటే మీరు ఒప్పుకోలేదట..

అవును. మా అన్నగారి అబ్బాయి అశోక్. దర్శకుడు కావాలని కలలు కన్నాడు. ఈ కథకు పేరున్న హీరో అయితే బాగుంటుంది అనిపించింది.

మీ ప్రభావం హరిప్రసాద్‌పై ఎంత వరకూ ఉంది?

ఏమాత్రం లేదు. ఎందుకంటే నా దగ్గర ఒక్క సినిమాకీ తను సహాయకుడిగా పని చేయలేదు. నా ఆలోచనలకంటే భిన్నంగా ఉంటుంది అతని ఐడియాలజీ.

నిర్మాతగా ఒత్తిడేం ఎదుర్కోలేదా?

ఒక్క శాతం కూడా ఒత్తిడి అనిపించలేదు. ఎందుకంటే ఈ కథ నాది కాదు. అందులో మార్పులూ చేర్పులూ చెప్పాల్సిన అవసరం రాలేదు. సెట్‌కి ఒక్క రోజు కూడా వెళ్లలేదు.

మీ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ని ఈ సినిమాకి దూరం పెట్టారు.. బడ్జెట్ సమస్యతోనేనా?

దేవిని అడిగితే తప్పకుండా చేస్తాడు. కానీ ప్రతీసారీ దేవిని వాడుకోవడం నాకెందుకో నచ్చలేదు. అశోక్‌కి ఇదే తొలి సినిమా. అన్న కొడుకు సినిమా కోసం తనని వాడుకొన్నాడనే పేరు నాకొద్దు. అయితే ఈ విషయంలో దేవికి నాపై కోపం వచ్చింది. నన్ను తిట్టాడు కూడా. 'అడిగితే చేస్తాను కదా డార్లింగ్' అన్నాడు.

ప్రచార చిత్రాల్లో చెబుతున్నట్టు నిజంగా దర్శకులంతా స్వార్థంగా ఆలోచిస్తారా?

ఆలోచించాలి. ఓసారి నా భార్య నన్ను షాపింగ్‌కి రమ్మంది. రెండు మూడు చీరలు చూపించి.. ఏది తీసుకోను అని అడిగింది. 'నీ ఇష్టం.. అన్నీ బాగున్నాయ్' అనేశా. రెండు నిమిషాల్లో మా షాపింగ్ అయిపోయింది. కానీ '100 % లవ్' షూటింగ్‌లో తమన్నాకి ఏరకమైన చీర కట్టించాలి? అనే విషయంలో రోజంతా ఆలోచించా. నేను తీసిన ఓ సినిమా హిట్ అయితే ఆ సంతోషం ముందు అన్నీ చిన్నవి అయిపోతాయి.

రామ్ చరణ్‌తో తెరకెక్కిస్తున్న 'రంగస్థలం' కబుర్లేంటి?

నేను చేస్తున్న తొలి పూర్తి స్థాయి కమర్షియల్ చిత్రమిది. 1985 నేపథ్యంలో సాగుతుంది. అందుకే ఆ పేరు పెట్టా.

రామ్‌చరణ్ కావడి మోస్తూ కనిపిస్తున్నాడు.. ఏమిటా కథ?

పల్లెటూరి నేపథ్యంలో సాగే సినిమా ఇది. 1985.. ఆ ప్రాంతంలో వాతావరణం ఇలానే ఉండేది కదా? చరణ్ ఆ పాత్రలో లీనమైపోతున్నాడు. సమంత పాత్ర కూడా చాలా బాగా వచ్చింది. తను బాగా ఆస్వాదిస్తోంది.

డ్రగ్స్ వ్యవహారంలో మీ దర్శక సన్నిహితుడు పూరి చిక్కుకొన్నారు కదా..? ఈ విషయం తెలియగానే ఏమనిపించింది?

చాలా ఈర్ష్యగా అనిపించింది. ఎందుకంటే.. పూరి గారికి ఓ మంచి కథ దొరికేసింది (నవ్వుతూ). నిజం చెబుతున్నా ఆయన ఈపాటికే ఓ కథ ఆలోచించేసి ఉంటారు. నిజాయతీ ఉన్న వ్యక్తి ఆయన. తప్పకుండా క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారు.

రుసుం చెల్లించాలన్నందుకు వీరంగం

- టోల్‌ప్లాజా సూపర్‌వైజర్‌పై కత్తితో యువకుల దాడి
- ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు
- నిందితుల్లో ఒకరు తెరాస ఎల్బీ నగర్ ఇన్‌ఛార్జి-బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ దంపతుల కుమారుడు



టోల్‌ప్లాజా వద్ద మహేశ్‌గౌడ్‌పై దాడిచేసిన ఆరుగురు నిందితులు

అమనగల్లు, న్యూస్‌టుడే: రుసుము చెల్లించమన్నందుకు టోల్‌ప్లాజా సూపర్‌వైజర్‌పై కత్తితో దాడి చేసి వీరంగం సృష్టించిన ఆరుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదైంది. నిందితుల్లో ఒకరైన మనీష్‌గౌడ్.. హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, ఎల్బీనగర్ తెరాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌గౌడ్ దంపతుల కుమారుడు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రామ్మోహన్ గౌడ్ కడ్తాల్ మండలంలోని మైసిగండిలో ఇటీవల ఓ ఫంక్షన్‌హాల్ నిర్మించారు. తన మిత్రుడు సాయితేజ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకను నిర్వహించడానికి ఇతర మిత్రులు అరుణ్‌రెడ్డి, నిశిత్, సాయికుమార్, అనిరుధ్‌తో కలిసి రామ్మోహన్‌గౌడ్ కుమారుడు మనీష్‌గౌడ్ సోమవారం మైసిగండి ఫంక్షన్‌హాల్‌కు వచ్చాడు. రోజంతా విందువినోదాల మధ్య వేడుకలను నిర్వహించుకున్నారు. సోమవారం రాత్రి కారులో తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలను నిలిపి ఉన్నాయి. తొందరగా వెళ్లడానికి అక్కడి బారికేడ్లను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మాదారం మహేశ్‌గౌడ్ వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు. నిబంధనల ప్రకారం రుసుము చెల్లించాలని కోరడంతో కారులో ఉన్న ఆరుగురు కిందకు దిగారు. మమ్మల్నే అడ్డుకుంటావా అంటూ మహేశ్‌గౌడ్‌పై దాడిచేశారు. వారిలోని అరుణ్‌రెడ్డి అనే యువకుడు తన వద్దగల కత్తితో మహేశ్‌గౌడ్‌ను పొడవడానికి యత్నించాడు. దీంతో మహేశ్‌గౌడ్ చేతులకు గాయాలయ్యాయి. వారు మరింత రెచ్చిపోతూ వీరంగం సృష్టిస్తుండటంతో మహేశ్‌గౌడ్ అరిచాడు. అరుపులను విని టోల్‌ప్లాజా మిగతా సిబ్బంది అక్కడికి వెళ్తుండగా ఆ ఆరుగురు కారులో హైదరాబాద్ వైపు పరారయ్యారు. అనంతరం టోల్‌ప్లాజా సిబ్బంది పోలీసులకు సెల్‌ఫోన్లో సమాచారమిచ్చారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ వెంబడించి కారును పట్టుకొని ఆ ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు మహేశ్‌గౌడ్‌పై కత్తితో దాడి చేసిన అరుణ్‌రెడ్డి(ఏ-1), నిశిత్(ఏ-2), సాయితేజ్‌రెడ్డి(ఏ-3), మనీష్‌గౌడ్(ఏ-4), సాయికుమార్(ఏ-5), అనిరుధ్(ఏ-6)లపై 307, హత్యాయత్నం కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నా కుమారుడి ప్రమేయం లేదు: రామ్మోహన్‌గౌడ్

ఈ ఘటనలో తన కుమారుడు మనీష్ ప్రమేయం లేదని తెరాస ఎల్బీనగర్ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. మనీష్ స్నేహితులే టోల్ ప్లాజా సిబ్బందితో గొడవకు దిగారని, తన కుమారుడు వారిని విడిపించడానికి ప్రయత్నించాడని తెలిపారు. కత్తితో దాడి చేసింది మనీష్ కాదని స్పష్టంచేశారు. పోలీసుల దర్యాప్తులో నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.



నారాయణపుర జలాశయం నుంచి నీటి విడుదల ఇలా..

జూరాల దిశగా బిరబిరా కృష్ణమ్మ

యాదగిరి, న్యూస్‌టుడే: ఎగువన వర్షాలు కురవడంతో ఆలమట్టి జలాశయం, నారాయణపుర జలాశయాలు నిండుకుండలయ్యాయి. కృష్ణమ్మ బిరబిరమంటూ ఆంధ్ర రాష్ట్రం వైపు పరుగులు తీస్తోంది. నారాయణపుర జలాశయం నుంచి 18,199 క్యూసెక్కుల నీటిని జూరాల జలాశయానికి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నారాయణపురకు 25,301 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇప్పటికే జలాశయంలో 26.14 టీఎంసీ(గరిష్ఠం 26.97)ల నీరుంది. ఎగువన ఆలమట్టి జలాశయంలో పూర్తిస్థాయిలో 119. 26 టీఎంసీల అడుగుల నీరుంది. జలాశయానికి 35,672 క్యూసెక్కుల నీరు వస్తుండగా 18,388 క్యూసెక్కులు దిగువకు పంపుతున్నారు.

రైతులకు 'పరిహారం' చెల్లింపుపై వివరాలు సమర్పించండి

విద్యుత్ లైన్ల ఏర్పాటుపై తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రైతుల భూముల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్లు, లైన్ల వ్యవహారంలో పరిహారం చెల్లించే విషయమై వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల్ని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యుత్ నియంత్రణ మండళ్లు, వివిధ విద్యుత్ సంస్థలకు నోటీసులు జారీచేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రైతుల భూముల్లో విద్యుత్ టవర్లు, లైన్ల నిర్మాణం చేస్తూ రైతులకు పరిహారం చెల్లించడం లేదని పేర్కొంటూ కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్(సీఐఎఫ్ఏ) ప్రధాన సలహాదారు పి.చంగల్‌రెడ్డి రాసిన లేఖను హైకోర్టు వ్యాజ్యంగా స్వీకరించిన విషయం తెలిసిందే.

వర్షాభావం.. 'బీమా' జాలం

- అదను చూసి రైతును దెబ్బ తీస్తున్న కంపెనీలు
- ప్రీమియం గడువు తేదీలను పొడిగించాలని కోరిన వ్యవసాయశాఖ
- అంగీకరిస్తూనే.. కౌలు రైతుల నుంచి సొమ్ము తీసుకోని కంపెనీలు

ఈనాడు, హైదరాబాద్: వాతావరణ ఆధారిత పంటబీమాకు ప్రైవేటు బీమా కంపెనీలు, బ్యాంకులు సహకరించకపోవడంతో పత్తి, మిరప సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు. ఈ రెండు పంటలకు ప్రీమియం చెల్లింపు గడువు తేదీలను పొడిగించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ చేసిన విన్నపానికి తొలుత సరేనన్న బీమా కంపెనీలు క్షేత్రస్థాయిలో ఏమాత్రం సహకరించకుండా రైతులను దెబ్బతీశాయి. గత పక్షం రోజులుగా రాష్ట్రంలో వానలు లేక పత్తి పంట పలుచోట్ల ఎండిపోతోంది. ఈ పంట 'వాతావరణ ఆధారిత పంటలబీమా పథకం (డబ్ల్యూబీసీఐ)' పరిధిలో ఉంది. పంట దెబ్బతింటే బీమా కంపెనీలు పరిహారం విడుదల చేసి తీరాల్సిందే. దీంతో కంపెనీలు జాగ్రత్త పడుతున్నాయి. పంటరుణాలు ఇవ్వకున్నా నేరుగా ప్రీమియం చెల్లించడానికి ముందుకొచ్చిన రైతుల నుంచి సొమ్ము తీసుకోకుండా నష్టపరిచాయి. మిరపకు గత నెల 9గా ఉన్న గడువు తేదీని 15కు, పత్తికి ఆఖరు తేదీని జులై 15 నుంచి 31కి పొడిగించాలని కంపెనీలకు వ్యవసాయశాఖ సూచించింది. ఈ పొడిగింపునకు బీమా కంపెనీలు అంగీకరించాయి. అయితే, ఇంకా కేంద్రం నుంచి ఆమోదం రానందున ప్రీమియం స్వీకరించబోమంటూ తిరకాసు పెట్టాయి. ఎక్కువమంది నుంచి ప్రీమియం తీసుకుంటే భవిష్యత్తులో పరిహారం భారీగా చెల్లించాల్సి ఉంటుందని కంపెనీలు ముందు జాగ్రత్తగా రైతులను తిరస్కరించాయని మండల వ్యవసాయాధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు.

బ్యాంకులూ రుణాలివ్వలేదు..

ఈ వానాకాలం (ఖరీఫ్) సీజన్ పంటరుణాల లక్ష్యం రూ.23,500 కోట్లలో సగమైనా రైతులకు బ్యాంకులివ్వలేదు. పత్తికి ప్రీమియం చెల్లింపు గడువును గత నెల 15 వరకే తొలుత నిర్ణయించగా, అప్పటికి అన్ని పంటలకూ కలిపి బ్యాంకులు రూ.7,800 కోట్ల పంటరుణాలనే ఇచ్చాయి. దీంతో పత్తి పంట సాగైన విస్తీర్ణంలో కనీసం నాలుగో వంతైనా బీమా పరిధిలోకి రాలేదని, ప్రీమియం చెల్లింపు గడువును గత నెల 31కి పొడిగించారు. మిరప పంట పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దీనికి తొలుత జులై 9 వరకే నిర్ణయించినందున అప్పటికి రుణాల పంపిణీ నిర్దేశిత లక్ష్యంలో 4వ వంతయినా కాలేదు. పంట విస్తీర్ణంలో 30 శాతమైనా బీమా పరిధిలోకి రాలేదు.

మిరపకు ప్రీమియం తిరస్కరించారు

మిరప పంటకు బీమా చేయించడానికి జులై 14న గ్రామీణ బ్యాంకులో రూ.3675కు డీడీ తీసుకున్నాను. బీమా కంపెనీ వారు ప్రీమియం చెల్లింపు గడువు 9వ తేదీతోనే ముగిసిందంటూ తీసుకోలేదు. చేసేదిలేక పత్తి పంటకు బీమా చేయించాను. ఈ రెండు పంటలూ సాగు చేసినందున నష్టం తప్పింది.

– బి.వెంకటేశ్వర్లు, సుడిమల్ల గ్రామం, ఎల్లెందు, భద్రాద్రి జిల్లా

గీతదాటితే జరిమానాతో పాటూ 'పాయింట్లు'

గ్రేటర్ పరిధిలో 2 వేల మందిపై కేసులు.. మొదలైన కొత్తవిధానం

ఈనాడు, హైదరాబాద్: రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలతో పాటు కొత్తగా పాయింట్లను విధిస్తున్నారు. రెండేళ్లలో ఉల్లంఘనల ద్వారా 12 పాయింట్లు పొందితే.. వారి వాహనచోదక అనుమతి (లైసెన్స్) రద్దవుతుంది. ప్రమాదాల నియంత్రణ, రహదారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వెంటనే అమలు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించింది. తెలంగాణలో తొలిసారిగా గ్రేటర్ పరిధిలో ఈ విధానాన్ని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం నుంచి ఆరంభించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో ట్రాఫిక్ పోలీసులు రహదారులపై, కూడళ్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు నిర్వహించి, 2 వేల మందిపై కేసులు నమోదు చేశారు. వారిఖాతాల్లో 3 వేల పాయింట్లు జమయ్యాయని హైదరాబాద్ పోలీస్ సంయుక్త కమిషనర్(ట్రాఫిక్) డాక్టర్ వి.రవీందర్ తెలిపారు. శిరస్త్రాణం ధరించకుండా వెళ్తున్న పరశురాములు అనే వాహనచోదకుడిని మలక్‌పేటలో గుర్తించి, కేసు నమోదు చేసి తొలి పాయింటు ఆయన ఖాతాలోకి జమచేశామని వివరించారు.

శాకాహార జంతువుల కోసం గడ్డి మైదానాలు

ఈనాడు, హైదరాబాద్: అడవుల్లో సంచరించే శాకాహార జంతువుల మేతకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా గడ్డి మైదానాలను పెంచాలని తెలంగాణ అటవీ శాఖ నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఒక్కో డివిజన్‌లో పదేసి హెక్టార్ల విస్తీర్ణంలో మొత్తంగా 1350 ఎకరాల్లో గడ్డిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సాధారణంగా అడవుల్లో మేతకు ఉపయోగకరంకాని కలుపు గడ్డి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి గడ్డిని మొత్తం తీసేసి.. శాస్త్రీయ పద్ధతిలో చదునుచేసి ఆ ప్రాంతంలో గింజలు చల్లి గడ్డి పెంచనున్నట్లు అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు 52 డివిజన్లవారీగా గడ్డి మైదానాలకు అవసరమైన భూముల్ని గుర్తించాలని జిల్లాల అధికారులకు ఇటీవల అటవీ శాఖ ఆదేశాలిచ్చింది. దీని కోసం రూ.2-3 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

భూసేకరణ చట్ట నిబంధనలు గెజిట్‌లో ప్రచురితమయ్యాయా?

- స్పష్టతనివ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర భూసేకరణ నిబంధనలు 2017 గెజిట్‌లో ప్రచురితమయ్యాయా? లేదా? అనే అంశంపై స్పష్టతనివ్వాలని ప్రభుత్వానికి మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసింది. గెజిట్‌ను తమ ముందుంచాలని ఆదేశించింది. తెలంగాణ భూసేకరణ (అంగీకార అవార్డు, స్వచ్ఛంద భూసేకరణ, ఏకమొత్త పరిహారం చెల్లింపు, పునరావాసం, పునర్నిర్మాణం) నిబంధనలు 2017ను సవాలు చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అధికారులు డ్రాఫ్ట్‌తోపాటు తుది నిబంధనలను జులై 10న నోటిఫై చేశారని, ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్నారు. నిబంధనలను తెలుగులో ప్రచురించలేదని, ప్రజలకు అందుబాటులో ఉంచలేదని తెలిపారు. అందువల్ల వాటిని కొట్టివేయాలని కోరారు.

నిబంధన 6పై విచారణ 17న

ఈనాడు, హైదరాబాద్: భూసేకరణ ప్రక్రియ ప్రారంభమై అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండటంతోపాటు అవార్డు ప్రకటించే దశలో కలెక్టర్ భూమి యజమానితో ఒప్పందం చేసుకోవచ్చా? అన్న అంశంపై విచారణ చేపడతామని ఉమ్మడి హైకోర్టు తెలిపింది. దీనికి సంబంధించి తెలంగాణ భూసేకరణ నిబంధనలు 2017లోని నిబంధన 6పై ఈనెల 17న విచారిస్తామంది. నిబంధన 6ను సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ మరో ఆరుగురు రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించదలచిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ నిమిత్తం ములుగు మండలంలోని మామిడ్యాల, బైలాంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండాల్లో రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిష్కరించకుండానే కలెక్టర్ ఇతర రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని చెప్పారు. విచారణదశలో కలెక్టర్ రైతుల అంగీకారం తీసుకోవాల్సి ఉండగా దానికి భిన్నంగా ఏ దశలో అయినా అంగీకార అవార్డు ప్రకటించవచ్చన్న నిబంధన 6 చెల్లదన్నారు. అనుమతుల్లేకుండా పనులు మొదలుపెడుతున్నారన్నారు.

560 వైద్య పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు

వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: వైద్య విద్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో మొత్తం 560 వైద్యుల పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులు జారీచేశారు. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో 274 సహాయ ఆచార్యుల పోస్టులకు, 65 ట్యూటర్స్, ఆరు లెక్చరర్, రేడియోలాజికల్, ఫిజిక్స్, ఫిజిస్ట్ పోస్టులకు.. వైద్యవిధాన పరిషత్ పరిధిలో 205 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 10 దంత సహాయ సర్జన్ పోస్టులకు సంబంధించిన వివరాలను ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వైద్యులు రాష్ట్ర వైద్య మండలిలో తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకొని ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి గరిష్ఠ వయోపరిమితి, వయసు సడలింపు, రిజర్వేషన్ల వర్తింపు తదితరాలు ఉంటాయని వివరించారు.

పోటీ పడే శక్తి లేకనే దిల్లీ నేతలతో రాజకీయాలు

కాంగ్రెస్‌పై మంత్రి తుమ్మల విమర్శ

పెద్దపల్లి: ప్రజలు ఛీ కొట్టినా కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి పొందేందుకు కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. తెరాసతో పోటీ పడే శక్తి లేకనే దిల్లీ నుంచి నేతలను తెప్పించి భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి-తాడిచెర్ల మధ్య మానేరు నదిపై రూ.50 కోట్లతో నిర్మించతలపెట్టిన వంతెన నిర్మాణం పనులకు మంగళవారం ఆయన ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు వివేక్, మంథని శాసనసభ్యుడు పుట్ట మధుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నేరెళ్ల ఘటనను భూతద్దంలో చూపెట్టి గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఈటల మాట్లాడుతూ.. 50 ఏళ్లలో చేయని అభివృద్ధిని మూడేళ్లలో చేసి చూపించామని తెలిపారు. 2018 నాటికి మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తిచేసి తీరుతామన్నారు.

'అమ్మినవాళ్లు, వాడినవాళ్లు అందరూ దోషులే'

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలు వాడిన వాళ్లు, అమ్మిన వాళ్లు అందరూ దోషులేనని, అందర్నీ నిందితులుగానే చూడాలని మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి చెప్పారు. సినిమావాళ్లను బాధితులుగా చూడాలని సీఎం అనడం కేసును నీరుగార్చడమేనని విమర్శించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియాహాలులో మాట్లాడుతూ..డబ్బు అహంకారంతో జల్సాల కోసం పార్టీలు చేసుకుంటున్న వాళ్లు బాధితులా? అని ప్రశ్నించారు.





హన్మకొండ విద్యుత్తు భవన్ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు ★ విద్యుత్తు సౌధలో తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ, తదితరులు

ఆ విలీనాన్ని అడ్డుకోవడం తగదు

- ఒప్పంద విద్యుత్తు కార్మికుల అంశంపై పలు ప్రాంతాల్లో సంఘాల నిరసనలు
- పిల్ వేయడం అన్యాయం: ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్ హస్తముందంటూ హన్మకొండలో ఆందోళన

పంజాగుట్ట, ఖైరతాబాద్, వడ్డేపల్లి(వరంగల్), న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం విద్యుత్తు ఒప్పంద కార్మికులను విలీనం చేయడానికి నిర్ణయం తీసుకుంటే, కొందరు న్యాయస్థానంలో వ్యాజ్యం వేయడం అన్యాయమని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. దీనిపై హైదరాబాద్, హన్మకొండలలో మంగళవారం ఆందోళనలు జరిగాయి. తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల ఐకాస, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో విద్యుత్తు సౌధలో నిరసన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల విలీన అవకాశం ముఖ్యమంత్రి కల్పిస్తే కొందరు కావాలని న్యాయస్థానంలో పిటిషన్లు వేయించడం దుర్మార్గ చర్య అన్నారు. టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ, కోశాధికారి జానయ్య, ప్రతినిధులు రవి, తెలంగాణ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు. కార్మికులకు ప్రభుత్వం మంచి చేస్తే, అడ్డుకోవాలని ప్రయత్నించడం సరికాదని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల సంఘం (1104) ప్రధాన కార్యదర్శి సాయిబాబా మింట్ కాంపౌండ్‌లోని ఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పేర్కొన్నారు. 1104 సలహాదారు జనార్దన్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్, కాంట్రాక్టు కార్మికుల సంఘం నేత సాయిలు, ఇతర నేతలు బాబు, సురేంద్రాచారి, కమలాకర్‌రెడ్డి, వేణు, వరప్రసాద్ ఉన్నారు.

హన్మకొండలో...: హైకోర్టులో దాఖలైన వ్యాజ్యానికి వ్యతిరేకంగా మంగళవారం హన్మకొండలోని విద్యుత్తు భవన్ ఎదుట ఉద్యోగులు ఆందోళనకు దిగారు. వ్యాజ్యం వెనక కాంగ్రెస్ హస్తముందని టీఆర్‌వీకేఎస్ నేతలు ఆరోపించగా, వ్యాజ్యం ఒక నిరుద్యోగి వేశారని ఐఎన్‌టీయూసీ నేతలు అన్నారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్ నేతలకు, తెరాస అనుబంధ టీఆర్‌వీకేఎస్ సంఘాల నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. టీఆర్‌వీకేఎస్, 1104 యూనియన్ సంఘాల తరపున విద్యుత్తు సిబ్బంది విలీనానికి అడ్డంకులు సృష్టించకుండా న్యాయం చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశారు.

పొరుగు సేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణపై నేడు విచారణ

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పొరుగుసేవల ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీచేసిన ఉత్తర్వులపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుంది. క్రమబద్ధీకరణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఈ వ్యవహారమై దరఖాస్తు దాఖలు చేయాలని, బుధవారం విచారణ జరుపుతామని పేర్కొంది.

'మాజీ సర్పంచి, ఎంపీటీసీలకూ పింఛను ఇవ్వాలి'

సోమాజిగూడ, న్యూస్‌టుడే: మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లకు పింఛను ఇవ్వాలని ప్రజా తెలంగాణ సంస్థ కన్వీనర్ గాదె ఇన్నయ్య కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఐదేళ్లు కొనసాగితే నెలసరి పింఛను వస్తోందని.. కానీ స్థానిక ప్రజాప్రతినిధులకు ఆ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను సంఘం కొ-కన్వీనర్లు మంచాల వెంకటస్వామి, శ్రీశైల్‌రెడ్డిలతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సదస్సులు సెప్టెంబరు ఒకటిన వరంగల్, 8న కామారెడ్డి, 15న భువనగిరి, 22న వికారాబాద్, 29న వనపర్తిలో ఉంటాయని తెలిపారు.

దళితులకు అన్యాయం చేసిందెవరో ప్రజలకు తెలుసు

ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: దళితులకు అన్యాయం చేసిందెవరో ప్రజలకు బాగా తెలుసునని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి మండలి(టీఎస్ఐడీసీ) ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో దళితులకు గుడిసె, రెండు క్వింటాళ్ల బియ్యం ఇచ్చారని, భూపంపిణీ పేరుతో కాగితాలపై భూములు చూపారని, కొన్నిచోట్ల రాళ్లూరప్పలు ఇచ్చారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ సాగుకు యోగ్యమైన మూడు ఎకరాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మంగళవారం ఆయన తెరాస రాష్ట్ర నాయకుడు కావేటి లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడుతూ..సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటన పేరుతో సీఎంను, ప్రభుత్వాన్ని దళితుల వ్యతిరేకంగా చిత్రీకరిస్తుండటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పోలీసు కేసులు నమోదైనవారిలో ఇతర వర్గాల వారు ఎక్కువగా ఉన్నా కాంగ్రెస్ దళితులను ముందుపెట్టి రాజకీయాలు చేస్తోందన్నారు. లోక్‌సభ మాజీస్పీకర్‌ను తీసుకొచ్చి ప్రభుత్వాన్ని అపనిందల పాలు చేయాలనుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డివి పగటికలలని విమర్శించారు.

వర్గీకరణ చేయకుంటే భాజపా నేతలను తిరగనివ్వం

తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి

ఈనాడు, దిల్లీ: ఎస్సీ వర్గీకరణ చేయకుంటే తెలంగాణలో భాజపా నేతలను తిరగనివ్వబోమని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పిడమర్తి రవి చెప్పారు. మంగళవారమిక్కడి ఏపీ/తెలంగాణ భవన్‌లో వందలాది మందితో ఆయన నల్లరిబ్బను కట్టుకొని నిరసన వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామన్న భాజపా మూడేళ్లు గడిచినా పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించే సభకు తెలంగాణ ఎంపీలందరూ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, ఐకాస కోకన్వీనర్ కొడారి ధీరన్, టీఎమ్మార్పీఎస్ మహిళా జాతీయ అధ్యక్షురాలు జీవ మాదిగ పాల్గొన్నారు.



దిల్లీలోని ఏపీ, తెలంగాణభవన్ వద్ద సభ్యులతో కలసి ఆందోళన చేస్తున్న తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి

కాంగ్రెస్‌ను ప్రశ్నించే అర్హత కేటీఆర్‌కు లేదు: మాజీ మంత్రి గీతారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: మంత్రి కేటీఆర్‌కు రాజ్యాంగం మీద గౌరవముంటే నేరెళ్ల ఘటనపై స్పందించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే గీతారెడ్డి డిమాండ్ చేశారు. సొంత నియోజకవర్గంలో దళితులు, బలహీన వర్గాల వారిని పోలీసులు చిత్రహింసలకు గురి చేస్తే పట్టించుకోని కేటీఆర్‌కు కాంగ్రెస్‌ను ప్రశ్నించే అర్హత లేదన్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ సిరిసిల్ల పర్యటన విజయవంతమైందని తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, అధికార ప్రతినిధులు దాసోజు శ్రవణ్, మహేష్‌గౌడ్‌లతో కలిసి ఆమె మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మీరాకుమార్ స్వయంగా జైలుకు వెళ్లి బాధితులను పరామర్శించారని, ఘటనపై స్పందించాల్సిన బాధ్యతను మరిచిపోయిన కేటీఆర్.. మీరాకుమార్‌చేత కాంగ్రెస్ అబద్ధాలు చెప్పించిందని అనడం దారుణమన్నారు.

కొత్త జిల్లాల్లో ఉద్యోగులపై భారం తగ్గించాలి

- టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌లను సన్మానించిన టీఎన్జీవోలు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: కొత్తగాఏర్పడిన జిల్లాల్లో ఉద్యోగులపై భారం పెరగకుండా అర్హతలను బట్టి ఎస్ఓడీలను నియమించాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీవో) అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టీఎన్జీవో అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి రెండోసారి ఎన్నికైన సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయంలో సంఘం స్థానిక కమిటీ ఆధ్వర్యంలో అభినందనసభ ఏర్పాటు చేశారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలసంఖ్య పెరిగిన తర్వాత స్థానిక ఉద్యోగులపై తీవ్రభారం పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ఉద్యోగులపై పక్షపాతపూరితంగా వ్యవహరిస్తున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కు రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి సహా సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌ను నిర్వాహక కమిటీ పక్షాన ఘనంగా సత్కరించారు. సంఘం నగర నాయకులు ప్రతాప్, విజయ, విఠల్ పాల్గొన్నారు.

పంటల కాలనీలతో దిగుబడుల పెంపు

శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లకు వివరించిన పార్థసారథి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పంటల కాలనీల ఏర్పాటుతో దిగుబడుల పెంపునకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. శిక్షణలో ఉన్న కొత్త ఐఏఎస్ అధికారులు తెలంగాణ వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు దిల్లీ నుంచి రాష్ట్రానికి వచ్చారు. వారితో మంగళవారం సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ రంగంపై పార్థసారథి వారికి వివరించారు. పంటల బీమా పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను వివరించి వాటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మొత్తం 35 లక్షల మంది రైతుల రుణాల మాఫీకి ప్రభుత్వం రూ.16,105 కోట్లను ఖర్చు చేసిందని తెలిపారు. కోటి ఎకరాలకు నీరందించేందుకు ప్రాజెక్టులను చేపట్టినట్లు ఆయన చెప్పారు.

ఈశాన్యానికి రూ.2,350 కోట్లు

- ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని మోదీ
- మృతులకు రూ.2 లక్షలు.. క్షతగాత్రులకు రూ.50 వేలు
- అసోంకు రూ.250 కోట్ల తక్షణ సాయం
- బ్రహ్మపుత్ర నదిపై అధ్యయనానికి రూ.100 కోట్లు
- వరదల పరిస్థితి అంచనాకు ప్రధాని పర్యటన



వరదలపై గువాహటిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ప్రధాని మోదీ

గువాహటి: వరద కష్టాల్ని ఎదుర్కొనేందుకు ఈశాన్య రాష్ట్రాలకు రూ.2,350 కోట్ల సహాయ ప్యాకేజీని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈశాన్యంలో వరదల పరిస్థితిని అంచనా వేసేందుకు మంగళవారం చేపట్టిన పర్యటనలో భాగంగా ప్రధాని ఈ సాయాన్ని ప్రకటించారు. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, త్రిపురల్లో వరదల కారణంగా మరణించిన వారి పిల్లలకు రూ.2 లక్షల చొప్పున సాయం అందించనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) తెలిపింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున అందిస్తామని వెల్లడించింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ ముఖ్యమంత్రులను కలిశారు. వరదల పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్యాకేజీతో మౌలిక సదుపాయాలు, బ్రహ్మపుత్రలో నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా మెరుగవుతాయని ప్రధాని మోదీ తర్వాత 'ట్విటర్'లో ప్రకటించారు. ఈశాన్యంలో జలవనరుల్ని సమర్థంగా వినియోగించుకునే అన్నిరకాల అవకాశాల్నీ అన్వేషిస్తున్నట్లు ట్వీట్ చేశారు. అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనీ, వరదల్నీ, భూక్షయాన్ని ఎదుర్కొనేందుకు స్వల్ప, దీర్ఘకాలిక చర్యల్ని చేపట్టాలన్నారు.

వరదలతో అతలాకుతలమైన అసోంలో సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం రూ.250 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ప్రధాని ప్రకటించినట్లు ఆసోం ఆర్థికమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు. జూన్‌లో విడుదలైన రూ.300 కోట్లకు ఇది అదనమని వెల్లడించారు. ఇదే కాకుండా, బ్రహ్మపుత్ర నదిపై అధ్యయనానికి పరిశోధన ప్రాజెక్టు కోసం రూ.100 మూలనిధినీ ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. తాజా వరదలతో తమ రాష్ట్రానికి రూ.3,888.09 కోట్ల నష్టం వాటిల్లినట్లు అసోం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ ప్రధానికి విన్నవించారు. నాగాలాండ్‌కు రూ.700 కోట్ల నష్టం వాటిల్లినట్లు సీఎం జెలియాంగ్ ప్రధాని మోదీతో సమావేశం అనంతరం వెల్లడించారు. ప్రధానమంత్రి స్వయంగా వచ్చి ఈశాన్య ముఖ్యమంత్రులను కలవడం మంచి పరిణామమని వ్యాఖ్యానించారు.

సొంత విత్తనాలు అమ్ముకొనే స్వేచ్ఛ రైతులకే

స్థాయీసంఘం సిఫార్సులమేరకు విత్తనబిల్లుకు సవరణలు

ఈనాడు, దిల్లీ: రైతులు తమ పొలాల్లో పండించుకున్న విత్తనాలను ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అమ్ముకొనే స్వేచ్ఛను విత్తన బిల్లు ద్వారా కల్పించబోతున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. ఆయన మంగళవారం లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. పార్లమెంటు స్థాయీ సంఘం చేసిన ప్రధానమైన సిఫార్సులన్నింటినీ పరిగణనలోకి తీసుకొని 2004 విత్తన బిల్లుకు తగిన సవరణలు చేసినట్లు తెలిపారు. రైతులు సొంతంగా పండించుకున్న విత్తన రకాలకు రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపునిచ్చినట్లు కూడా ఆయన చెప్పారు. అలాగే రైతు అన్న నిర్వచనానికి స్పష్టత కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొక్కల రకాల సంరక్షణ, రైతుల హక్కుల చట్టం 2001 ప్రకారం రైతుల విత్తన మార్పిడికీ అనుమతిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర విత్తన సమితిలో రైతు ప్రతినిధులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. విత్తనరకాల నమోదు కాల పరిమితిని తగ్గించడం, జన్యు మార్పిడి విత్తనరకాల విక్రయాలను నియంత్రించడం వంటి సవరణలు చేశామన్నారు.

పార్టీ ఎంపీల గైర్హాజరీపై అమిత్ షా అసంతృప్తి

దిల్లీ: విప్ జారీ చేసినప్పటికీ రాజ్యసభకు గైర్హాజరైన (కొందరు మంత్రులు సహా) భాజపా సభ్యుల నుంచి పార్టీ లిఖితపూర్వక సంజాయిషీ అడిగింది. గైర్హాజరీని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా తీవ్రంగా పరిగణించారు. మంగళవారం భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. వారి పేర్లను వెల్లడించి అవమానించాలనుకోవడం లేదంటూ.. ఇలాంటివి పునరావృతం కాని వ్వవద్దని హెచ్చరించారు. బీసీల బిల్లుకు సంబంధించి - రాజ్యసభలో పూర్తిస్థాయి సంఖ్యాబలం లేని భాజపాసోమవారం ఇరకాటాన్ని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా కొందరు మంత్రులు సహా 17 మంది ఎంపీలు గైర్హాజరైనట్లు సీనియర్ భాజపా నేత తెలిపారు. సభకు హాజరు కాని మంత్రుల్లో రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్‌లు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అందరి సంజాయిషీలు కోరిన పార్టీ.. వారి సమాధానాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందని ఆవర్గాలు వెల్లడించాయి.

ఎన్‌సీబీసీ బిల్లు ఆమోదానికి ప్రభుత్వ కృత నిశ్చయం

వెనకబడిన తరగతుల జాతీయ కమిషన్ (ఎన్‌సీబీసీ) బిల్లును పార్లమెంటు ప్రస్తుత సమావేశాల్లోనే ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. లోక్‌సభ ఇదివరకే ఆమోదించిన ఈ బిల్లుకు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన కొన్ని సవరణలు సోమవారం రాజ్యసభలో ఆమోదం పొందడం ప్రభుత్వానికి ఇరకాట పరిస్థితి సృష్టించిన విషయం తెలిసిందే. ఈ బిల్లులో ముఖ్యమైన మూడో నిబంధనను రాజ్యసభ తొలగించింది. స్వయానా ప్రధాని మోదీ ఆసక్తి చూపిస్తున్న ఎన్‌సీబీసీ బిల్లుకు ఆ విధమైన మార్పు జరగడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. నిబంధన ప్రకారం రాజ్యసభ నుంచి బిల్లు మళ్లీ లోక్‌సభకు వెళ్తుంది. రాజ్యసభ ప్రతిపాదించిన సవరణల్ని లోక్‌సభ తిరస్కరించి, తిరిగి రాజ్యసభకు పంపిస్తుంది. దిగువ సభలో ఆమోదం తెలిపి, ఈ నెల 11వ తేదీ కంటే తగినంత ముందుగానే బిల్లు రాజ్యసభకు చేరేలా చూస్తామని భాజపా నేత ఒకరు వెల్లడించారు.

'రాజ్యసభ ఛైర్మన్‌ను ఆహ్వానించరా..'

దిల్లీ: రాజ్యసభలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంది. పార్లమెంటు ప్రాంగణంలో నిర్మించిన నూతన భవన ప్రారంభానికి రాజ్యసభ ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ సహా ఆ సభలోని ఎంపీలు ఎవరికీ ఆహ్వానాలు రాకపోవటంపై విపక్ష సభ్యులందరూ అభ్యంతరం తెలిపారు. ఎగువసభను కేంద్రం చిన్నచూపు చూస్తోందంటూ మండిపడ్డారు. ఈ చర్య రాజ్యసభ ఛైర్మన్ అయిన ఉపరాష్ట్రపతి అన్సారీని అవమానించటమేనని పేర్కొన్నారు. పార్లమెంటు ప్రాంగణంలోని నూతన భవనాన్ని ప్రధానిమోదీ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ ఛైర్మన్‌ను అయినా ఆహ్వానించి ఉండాల్సిందని డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ అభిప్రాయపడ్డారు.

'ఆర్టికల్ 170' సవరణతోనే సీట్ల పెంపు

- లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలోని సెక్షన్ 26కి అనుగుణంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 170ని సవరించేంతవరకూ అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని కేంద్రహోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ జి. అహిర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో తెలుగుదేశం ఎంపీ మాగంటి మురళీమోహన్, తెరాస ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానమిచ్చారు. ఆర్టికల్ 170కింద పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా, విభజన చట్టంలోని సెక్షన్ 15కి ఇబ్బంది కల్గించకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కి, తెలంగాణలోని సీట్లను 119 నుంచి 153కి పెంచుకోవచ్చని విభజన చట్టంలోని సెక్షన్ 26(1) చెబుతోందన్నారు. తాము ఈ అంశాన్ని కేంద్ర న్యాయశాఖ దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారు అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు ప్రచురించేంతవరకూ రాష్ట్రాల్లోని అసెంబ్లీ సీట్లను పునఃసర్దుబాటు చేయడానికి వీల్లేదని అటార్నీజనరల్ అభిప్రాయపడ్డారన్నారు. అందువల్ల ఆర్టికల్ 170ని సవరిస్తేనే అసెంబ్లీ సీట్లను పెంచడం సాధ్యమవుతుందని మంత్రి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు.

అలాగైతే 2039 వరకు సాధ్యం కాదు: అటార్నీజనరల్ చెప్పినట్లు 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు ప్రచురించిన తర్వాతే అసెంబ్లీ సీట్లు పెంచాలంటే 2039వరకు ఇది సాధ్యంకాదని తెదేపా ఎంపీ మురళీమోహన్ పేర్కొన్నారు. పార్లమెంటు ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. "మళ్లీ 2021లోనే కొత్త జనాభా లెక్కలు తీస్తారు. ఆ తర్వాత 2031లో చేస్తారు. 2026 తర్వాత జనాభా లెక్కంటే 2031నే పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జనాభా లెక్కల ముద్రణకు కనీసం మూడేళ్లు పడుతుంది. అంటే 2034లో ప్రచురిస్తారు. అప్పుడు దేశవ్యాప్తంగా పునర్విభజన ప్రక్రియ మొదలుపెడితే అది పూర్తికావడానికి కనీసం మూడేళ్ల సమయం పడుతుంది. అంటే 2039 ఎన్నికలకు సీట్లపెంపు అమల్లోకి వస్తుంది. ఆ నిబంధనలతో సంబంధం లేకుండా కేంద్రం చొరవ తీసుకొని విభజన చట్టంలో చెప్పినట్లుగా సీట్ల పెంపుపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలి" అని. పేర్కొన్నారు.

అసెంబ్లీ సీట్లు పెంచమని అధిష్ఠానం చెప్పలేదు: రెండు రాష్ట్రాల్లో రాజకీయ సుస్థిరత కోసమే విభజన సమయంలో 2019 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ప్రతిపాదనను విభజన చట్టంలో పెట్టినందున దాని స్ఫూర్తిని అమలుచేయాలని ఏపీ భాజపా అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. అసెంబ్లీ సీట్లు పెంచబోమని ఇప్పటివరకూ తమ అధిష్ఠానం తమతో చెప్పలేదన్నారు. దీనిపై తమ అభిప్రాయాలు కూడా కోరలేదన్నారు. ఆర్టికల్ 170కి లోబడి సీట్ల పెంపు చేపట్టాలని విభజన చట్టంలోని సెక్షన్ 26ని రాయడంవల్లే ప్రస్తుత సమస్య తలెత్తిందన్నారు. సీట్లు పెంచితే ఎవరికి లాభం జరుగుతుందనే అభిప్రాయాన్ని పక్కనపెట్టి రెండురాష్ట్రాల విశాల హితం దృష్ట్యా అందరూ సీట్ల పెంపు ప్రతిపాదనను సమర్థించాలని హరిబాబు పేర్కొన్నారు.

'చీలిక'ల కలయిక.. ఎన్డీఏలో చేరిక!

- అన్నాడీఎంకే పయనమటే..!
- తమిళనాట ఆసక్తికర రాజకీయాలు

దిల్లీ/చెన్నై: తమిళనాట అధికార అన్నాడీఎంకేలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముందు పార్టీలోని చీలిక వర్గాలు ఏకం కావడం.. అనంతరం ఆ పార్టీ భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరడం.. ఈ దిశగా అడుగులు పడుతున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అసలు చీలిక వర్గాల విలీనం జరిగిందంటే.. దానర్థం అన్నాడీఎంకే కేంద్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం కోరుకుంటున్నట్లేనని చెబుతున్నారు. దీనికి బలం చేకూర్చేలా - చీలికవర్గాలు ఏకమైన వెంటనే ఎన్‌డీఏలో చేరిక జరుగుతుందని దిల్లీలో భాజపా నేత ఒకరు పేర్కొన్నారు. అవి ఏకమవుతాయని తమిళనాడుకు చెందిన భాజపా నేత ఒకరు గట్టిగా చెబుతున్నారు. 2013లో యూపీఏ ప్రభుత్వం నుంచి డీఎంకే బయటకొచ్చిన తరువాత నాలుగేళ్లుగా కేంద్ర మంత్రివర్గంలో తమిళనాడుకు తగిన ప్రాతినిధ్యం లేదు. అన్నాడీఎంకేకు పార్లమెంటు ఉభయసభల్లో 50 మంది ఎంపీలుండగా. . 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎన్‌డీఏను మరింత పటిష్ఠపరిచే దిశగా భాజపా యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే అన్నాఏడీఎంకే కలయికపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కాగా ఈ పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు రాష్ట్ర భాజపా అధ్యక్షుడు టి.సౌందర్‌రాజన్ మాత్రం నిరాకరించారు. రెండు వర్గాలూ తమతో ఉన్నాయని.. అయితే వారి మధ్య వారికి కొన్ని విభేదాలున్నట్లు మరో భాజపా నేత తెలిపారు. ఈ విషయంలో తమకు తొందరేమీ లేదని స్పష్టం చేశారు.

చీలిక వర్గాల 'అంతర్గతం'

అన్నాడీఎంకే ఒక్కటి కావాలంటే - జయలలిత మృతిపై దర్యాప్తు.. మన్నార్‌గుడి కుటుంబాన్ని బయటకు పంపే విషయంలో మరోమాటకు తావుండకూడదని ఓ పన్నీర్‌సెల్వం వర్గం కరాఖండిగా చెబుతోంది. శశికళ, దినకరన్‌లను పార్టీ పదవుల నుంచి తొలగించి.. ప్రభుత్వానికి దూరంగా ఉంచితేనే విలీనం జరుగుతుందని పన్నీర్‌సెల్వం ఇప్పటికే తేల్చేశారు. కాగా ఆయన నాయకత్వంలోనే విలీనం జరుగుతుందని మాజీ మంత్రి పాండియరాజన్ తెలిపారు. మన్నార్‌గుడి కుటుంబాన్ని పార్టీ నుంచి తప్పక సాగనంపుతారని అన్నాడీఎంకేలో పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న భాజపా నేత ఒకరు మంగళవారం తెలిపారు. విలీనంపై చర్చలు జరుగుతున్నాయని.. త్వరలోనే జరుగుతుందని తమిళనాడు ఆర్థికమంత్రి డి.జయకుమార్ మంగళవారం విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జవాబిచ్చారు. కాగా మరో వర్గానికి సంబంధించి - తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి తనను కొనసాగించాలని పట్టుబడుతున్నారు. విలీన అంశాలను చర్చించేందుకు పన్నీర్ సెల్వం మరో కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

విలీనం ఉండదు..

దినకరన్ మాత్రం విలీనం జరిగే పని కాదని చెబుతున్నారు. ఎన్డీఏలో కలిసే విషయమై తమ మంత్రులు కొందరు సొంత భయాలతో ఏవో చెబుతున్నారని.. అది జరగదని, వారంతా భయాల నుంచి బయటపడతారని దినకరన్ విలేకరులకు తెలిపారు. అంతర్గత వ్యవహారాలు తెలిసిన వ్యక్తిగా విలీనం జరగనే జరగదని పేర్కొన్నారు. దినకరన్ వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి పళనిస్వామి, సీనియర్ మంత్రులు సచివాలయంలో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

క్షయతో ప్రతి 3 నిమిషాలకు ఇద్దరు బలి!

ఈనాడు, దిల్లీ: దేశంలో క్షయ వ్యాధి కారణంగా ప్రతి మూడునిమిషాలకు ఇద్దరు ప్రాణాలు కోల్పోతున్నట్లు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయమంత్రి ఫగన్ సింగ్ కులస్థే తెలిపారు. ఆయన మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ 2016 ప్రపంచ టీబీ నివేదిక ప్రకారం 2015లో దేశంలో 4.80 లక్షలమంది మరణించారన్నారు. క్షయ నివారణకు తాజాగా టీబీ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిపోతున్నట్లు వెల్లడించారు. దీన్ని ప్రాథమికదశలోనే నివారించడానికి రాష్ట్రస్థాయి క్యాన్సర్‌సంస్థల ఏర్పాటుకు కేంద్రం ఆర్థికంగా చేయూతనందిస్తున్నట్లు చెప్పారు.

ఆర్‌టీఈ ఉపాధ్యాయుల శిక్షణకు గడువు పొడిగింపు

దిల్లీ: విద్యా హక్కు (ఆర్‌టీఈ) చట్టం కింద 2015 మార్చి వరకూ నియమితులైన లక్షలాది ఉపాధ్యాయులు తగిన అర్హతలు సాధించేందుకు గడువును పొడిగిస్తూ రూపొందించిన బిల్లును పార్లమెంటు ఆమోదించింది. ఇందుకు సంబంధించిన 'పిల్లల ఉచిత, నిర్బంధ విద్య (సవరణ) బిల్లు, 2017' - ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందగా మంగళవారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. బిల్లును కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ సభలో ప్రవేశపెట్టారు. 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ప్రస్తుత చట్టం ప్రకారం అలాంటి ఉపాధ్యాయులంతా ఐదేళ్లలోపు (2015 మార్చి 31 నాటికి) కనీస అర్హతలను సాధించాల్సి ఉంది. తాజాగా ఆ గడువును 2019 వరకు పొడిగిస్తూ సవరణ చేయడంతో వారంతా ఉద్యోగాలను కాపాడుకోవడానికి వీలు కలిగింది. ఆర్‌టీఈ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత కొత్త పాఠశాలలు ఏర్పాటు చేసినప్పటికీ అర్హులైన ఉపాధ్యాయులు దొరకలేదు. దీంతో తగిన అర్హతలు లేకున్నా నియామకాలు చేపట్టారు. అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి సేకరించిన వివరాల ప్రకారం 7 లక్షల మందికి ప్రాథమిక అర్హతలు లేవని తేలినట్లు మంత్రి జావడేకర్ తెలిపారు.

నోట్ల లెక్కకు సమయం పడుతుంది

- లోక్‌సభలో ప్రకటించిన అరుణ్ జైట్లీ

దిల్లీ: రద్దయిన రూ.1000, రూ.500 నోట్ల విలువను లెక్కించే ప్రక్రియను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొనసాగిస్తోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. దొంగ నోట్లను గుర్తించి తొలగించిన తర్వాత తుది లెక్కల్ని ఆర్‌బీఐ ప్రకటిస్తుందని తెలిపారు. రద్దయిన పెద్దనోట్లలో ఎంత మేర తిరిగి వెనక్కి వచ్చాయనే లెక్కను ఇప్పటి వరకు స్పష్టంగా తేల్చిచెప్పకపోవడంపై మంగళవారం లోక్‌సభలో విపక్షాలు మండిపడ్డాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి అనుబంధ పద్దులపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో విపక్ష సభ్యులు అనేక అంశాలు లేవనెత్తారు. వీటిపై జైట్లీ సవివరంగా సమాధానం ఇచ్చారు. రద్దయిన పెద్దనోట్లలో చివరి విడత కట్టల్ని జులై నెలలో ఆర్‌బీఐకి అందజేశామనీ, కోట్ల సంఖ్యలో ఉన్న నోట్లను లెక్కించడానికి ఆ సంస్థకు కొంత సమయం అవసరమనీ వివరించారు. ప్రతి ఒక్క నోటునూ ఆర్‌బీఐ లెక్కించాల్సి ఉందనీ, వాటి నుంచి నకిలీవి తొలగించాలనీ చెప్పారు. ఈ కసరత్తు- చాలా ముందస్తు దశకు చేరుకుందన్నారు.

నల్లధనంపై ఉపేక్షించడం లేదు: నల్లధనం వెల్లడిపై జైట్లీ మాట్లాడుతూ- దీనిపై ప్రభుత్వం ఎంతమాత్రం ఉపేక్షించడం లేదని చెప్పారు. రూ.వెయ్యి, రూ.500 నోట్ల రద్దుతో ఉగ్రవాదులకు, మావోయిస్టులకు నిధుల సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. వస్తు-సేవల పన్ను (జీఎస్‌టీ) వల్ల లభించాల్సిన పన్ను తగ్గింపు ప్రయోజనాన్ని బదలాయించని వ్యాపారులపై ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాన్ని ఈ నెల 5న జరగబోయే జీఎస్టీ పాలకమండలి సమావేశంలో నిర్ణయిస్తామని చెప్పారు. కొన్ని అంశాలపై (బీడీలు, గ్రానైట్‌పై పన్నులు) తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళన చాలా ముఖ్యమైనదనీ, దానిని పాలక మండలి చర్చిస్తుందనీ చెప్పారు. విపక్ష సభ్యులు మాట్లాడుతూ- బ్యాంకుల్లో జమఅయిన పాత నోట్లు, వాటి స్థానంలో ఇప్పటివరకు ముద్రించిన కొత్త నోట్లు, వెలుగులోకి వచ్చిన నల్లధనం... ఈ వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు నిర్ణయమే సరైనది కాదని విమర్శించారు. చర్చ అనంతరం అనుబంధ పద్దుల్ని లోక్‌సభ ఆమోదించింది.


ఎల్పీజీ భారంపై వాకౌట్: రాయితీని ఎత్తివేయడానికి వీలుగా వంటగ్యాస్ సిలిండర్‌పై నెలకు రూ.4 చొప్పున పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి.

11.44 లక్షలకు పైగా 'పాన్' నంబర్ల తొలగింపు!

దిల్లీ: సుమారు 11.44 లక్షలకు పైగా 'పర్మనెంట్ అకౌంట్ నంబర్ల'(పాన్)ను తొలగించి వేసినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ మంగళవారం రాజ్యసభకు తెలిపారు. ఒకే వ్యక్తికి పలు 'పాన్'లు ఉన్నట్లు కనుగొన్న నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు వివరించారు. సుమారు 1,566 'పాన్'లను నకిలీవిగా గుర్తించినట్లు తెలిపారు. ఏవైనా తేడాలున్న సందర్భాల్లో వాటిని తొలగించివేసే సదుపాయం సంబంధిత అంచనా అధికారి వద్ద ఉన్నట్లు చెప్పారు.

రాజ్యసభను కుదిపేసిన నోటా

- ఎగువసభ సభ్యుల ఎన్నికల్లో ఆ ఐచ్ఛికాన్ని చేర్చటంపై విపక్షాల తీవ్ర అభ్యంతరం
- ఆందోళనలతో సభ రెండు మార్లు వాయిదా
- ఈ ఐచ్ఛికం కొత్తదేమీ కాదు: జైట్లీ



దిల్లీ: రాజ్యసభలో ఖాళీ కానున్న స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఓటర్లు అయిన ఎమ్మెల్యేలకు బ్యాలెట్ పత్రంలో నోటా(పై అభ్యర్థులెవరూ నచ్చలేదనే అభిమతం తెలిపే) ఐచ్ఛికాన్ని ఎన్నికల సంఘం కల్పించటంపై ఎగువసభలో విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రతిపక్షసభ్యులు ఆందోళనకుదిగటంతో సభ రెండుసార్లు వాయిదా పడింది. మంగళవారం మధ్యాహ్నం సభ ప్రారంభంకాగానే తొలుత ఈ అంశాన్ని కాంగ్రెస్ ఉపనేత ఆనంద్ శర్మ ప్రస్తావనకు తీసుకొచ్చారు. రాజ్యాంగానికి, ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేయకుండా రాజ్యసభ ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని, ప్రశ్నావధిని కొనసాగించాలని ఛైర్మన్ హమీద్ అన్సారీ విజ్ఞప్తి చేసినా కాంగ్రెస్ సభ్యులు శాంతించలేదు. అధికారపక్ష నేత, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునను సరించి నోటా ఆచరణలోకి వచ్చిందని, అధికరణం 324 ప్రకారం ఎన్నికల సంఘం ఇప్పటికే నోటాను అమలుచేస్తూ వస్తుందని వివరించారు. "అలాగైతే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లోనూ నోటాను చేర్చి ఉండాలి కదా"అని ఆనంద్ శర్మ తిరిగి ప్రశ్నించారు. గుజరాత్‌కు ప్రత్యేకమైన రాజ్యాంగం ఏమైనా ఉందా? అంటూ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సతీశ్ చంద్ర మిశ్రా(బీఎస్పీ), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ) తదితరులు కూడా రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని చేర్చటంపై అభ్యంతరం తెలిపారు.

ఈసీని కలిసిన కాంగ్రెస్ ప్రతినిధులు

ఈనెల 8న నిర్వహించనున్న రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని వినియోగించరాదని, బ్యాలెట్ పత్రాల నుంచి దానిని తొలగించాలని ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ ప్రతినిధులు ఆనంద్ శర్మ, మనీశ్ తివారీ కోరారు. పరోక్ష ఎన్నికల్లో నోటాను ఉపయోగించటం రాజ్యాంగం, ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని తాము సమర్పించిన విజ్ఞాపన పత్రంలో వారు పేర్కొన్నారు. కేవలం నిబంధనలను మార్చితే సరిపోదని, రాజ్యాంగాన్ని, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాల్సి ఉంటుందని తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ నేతలు రాజ్యసభ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత నోటా నిబంధనను చేర్చారని ఆరోపించారు. "మొదట రాజ్యసభ ఎన్నికను వాయిదావేశారు. ఇప్పుడు అధికారిక ప్రకటన వెలువరించాక నోటాకు అనుమతించారు. దీనికి కారణాలు ఎన్నికల సంఘానికే బాగా తెలుసుంటాయి"అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న అహ్మద్ పటేల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. అహ్మద్ పటేల్‌ను గెలిపించుకోవటం కోసం గుజరాత్‌లోని తన ఎమ్మెల్యేలను కాపాడుకోవటానికి కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్న పరిస్థితుల్లో నోటా ఐచ్ఛికం ఆ పార్టీకి ఇబ్బందికరంగానే మారనుంది.

బ్యాలెట్ పత్రాల్లో నోటా ఉంటుంది: ఈసీ

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లో నోటా ఐచ్ఛికం తప్పని సరిగా ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ దిశగా ఎన్నికల అధికారులకు ఆదేశాలిచ్చింది. "2013 సెప్టెంబరు 27న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో నోటా ఐచ్ఛిక అమలుపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని పూర్తిస్థాయిలో పరిశీలించాం. రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని వర్తింపజేస్తూ నిర్ణయంతీసుకున్నాం" అని ఎన్నికలసంఘం తెలిపింది.

అఖిలభారత వైద్యసేవల విభాగం ఏర్పాటుపై కసరత్తు

ఎయిమ్స్‌ల్లో 24 వేల పోస్టులు ఖాళీ

ఈనాడు,దిల్లీ: అఖిలభారత వైద్యసేవల విభాగం ఏర్పాటుపై కసరత్తు జరుగుతున్నట్లు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయమంత్రి ఫగన్‌సింగ్ కులస్థే తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల తరహాలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన మంగళవారం రాజ్యసభలో వెల్లడించారు. కేడర్ సమీక్షా సంఘం చేసిన సిఫార్సులకు అనుగుణంగా అఖిలభారతస్థాయి వైద్య సేవల విభాగం ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాన్ని కోరినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం నడుస్తున్న 7'ఎయిమ్స్'లో 24,426 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. వీటి భర్తీకి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

దేశంలో 33 లక్షల ఎకరాల అటవీభూమి ఆక్రమణ

దేశంలో 33.21 లక్షల ఎకరాల అటవీభూమి ఆక్రమణకు గురైనట్లు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ వెల్లడించారు. గోవా, లక్షద్వీప్, పుదుచ్చేరి మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో అటవీభూములు ఆక్రమణకు గురైనట్లు మంగళవారం లోక్‌సభలో తెలిపారు. తెలంగాణలో 7,551 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 4,177 ఎకరాలు ఆక్రమణల చెరలో ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 13 లక్షలు, అసోంలో 7 లక్షల ఎకరాల అటవీభూమి ఆక్రమణల పాలైందన్నారు. పలు రాష్ట్రాల్లో ఇలాంటి భూముల్లో వ్యవసాయం సాగుతోందన్నారు. ఆక్రమణల నివారణకు నిరంతర పెట్రోలింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు వంటివి చేపడుతున్నట్లు చెప్పారు. డిజిటల్ పద్ధతిలో అటవీ సరిహద్దులను గుర్తించి రికార్డులను భద్రపరుస్తున్నట్లు తెలిపారు.

గోధుమ, బియ్యంపై రాయితీ

దిల్లీ: గోధుమలు, బియ్యంపై ప్రస్తుతం ఇస్తున్న రాయితీ ధరలు 2018 వరకూ ఇలాగే కొనసాగుతాయి. ప్రస్తుతం గోధుమను కిలో రూ.2లు, బియ్యాన్ని రూ.3ల రాయితీ ధరకు అందచేస్తున్నారు. అదే ముతకధాన్యాలపై రాయితీ ధర కిలోకు రూ.2గా ఉంది. ఇదే రాయితీ 2018 దాకా కొనసాగుతుందని ఆహార, వినియోగ వ్యవహారాల మంత్రి రామ్ విలాస్ పాసవాన్ మంగళవారం లోక్‌సభలో వెల్లడించారు. దేశంలోని 81కోట్ల మంది ఈ రాయితీ ద్వారా లబ్ధిపొందుతున్నారు.



12వ శతాబ్దంనాటి విగ్రహం లభ్యం

కాంబోడియాలోని ప్రపంచ ప్రసిద్ధ ఆంగ్‌కోర్ దేవాలయం సముదాయం వద్ద లభ్యమైన 12వ శతాబ్దానికి చెందిన విగ్రహమిది. కాంబోడియా, సింగపూర్ పురాతత్వ అధికారులు సంయుక్తంగా జరిపిన తవ్వకాల్లో సియెమ్‌రీప్ వద్ద లభ్యమైంది. 1.9 మీటర్ల పొడవు, 58 సెం.మీ. వెడల్పు ఉన్న ఈ విగ్రహం ఇటీవల కాలంలో లభ్యమైన పెద్ద విగ్రహాల్లో ఒకటి అని చరిత్రకారులు చెబుతున్నారు.

భారత్‌లో రైతుల ఆత్మహత్యల వెనక వాతావరణ మార్పులు

- గత 30 ఏళ్లలో 59 వేలమంది అన్నదాతలు బలవన్మరణం
- అమెరికా వర్సిటీ అధ్యయనం వెల్లడి

లాస్‌ఏంజెలెస్: భారత్‌లో గత 30 ఏళ్లలో వాతావరణ మార్పులు 59 వేలమంది రైతుల ఆత్మహత్యలకు కారణమైనట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. భూతాపం ఇలాగే పెరిగితే దేశవ్యాప్తంగా ఆత్మహత్యల ప్రభావం పెరుగుతుందని హెచ్చరించింది. పంట దిగుబడులు విఫలమైనప్పుడు రైతులు పేదరికంలోకి అడుగు పెడుతున్నారనీ, ఇది కీలకమైన సమస్య అని అమెరికాలోని బెర్కిలే కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధకులు పేర్కొన్నారు. పంటలు ఎదిగే సీజన్‌లో పగటి ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్‌పైగానే ఉన్నప్పుడు ఒక్క రోజు ఒక డిగ్రీమేర పెరిగినా దేశవ్యాప్తంగా సుమారు 65 ఆత్మహత్యలకు కారణమవుతున్నట్లు పేర్కొన్నారు. ఉష్ణోగ్రత ఐదు డిగ్రీల మేరకు పెరిగితే దాని ప్రభావం ఐదు రెట్లు అధికంగా ఉంటున్నట్లు వెల్లడించారు. వేలమంది ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటుండటం దిగ్భ్రాంతికరమని పరిశోధకులు టామ్మా కార్లెటన్ పేర్కొన్నారు. సరైన విధానాలే వేలమందిని కాపాడగలవని అభిప్రాయపడ్డారు. పంటలు ఎదిగే సమయంలో అత్యధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం వార్షిక ఆత్మహత్యలపై ప్రభావం చూపుతుండగా, సీజన్ కానివేళలో ఇలాంటి ప్రభావం ఉండటం లేదని తేలిందని వివరించారు. 1980ల నుంచి ఆత్మహత్యల రేటు రెట్టింపైందనీ, ఏటా 1.30 లక్షల మంది ప్రాణాలు వదులుతున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 75శాతం ఆత్మహత్యలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే సాగుతుండగా, ఇందులో భారత్‌లో ఐదింట ఒక వంతు ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఆత్మహత్యల్ని తగ్గించేందుకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన పంటల బీమా పథకం తగినంత ప్రభాం చూపుతోందా లేదా అనేది తెలియలేదని పరిశోధకులు వివరించారు.

తెలంగాణలో రుణ వితరణ వృద్ధి

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో 2016-17 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణ ఖాతాల సంఖ్య తగ్గినా, రుణ మొత్తం మాత్రం భారీగా పెరిగింది. 2017 మార్చి 31నాటికి ఏపీలో 58 లక్షలు, తెలంగాణలో 19 లక్షల ఖాతాలకు రుణాలు మంజూరు చేశారు. అంతకుముందు సంవత్సరం కంటే ఏపీలో 7%, తెలంగాణలో 5% ఖాతాలు తగ్గిపోయాయి. రుణ మొత్తం మాత్రం ఏపీలో 6% పెరిగింది. తెలంగాణలో ఏకంగా 46%పెరిగింది. ఇది జాతీయ సగటుకంటే చాలా అధికం. జాతీయ స్థాయిలో 2016, 17సంవత్సరాల మధ్య రుణాలుఇచ్చిన ఖాతాల సంఖ్య 5% తగ్గగా, రుణమొత్తం 7% వృద్ధి చెందింది.

రుణ వితరణ వివరాలు

సంవత్సరం	రాష్ట్రం	ఖాతాలు	రుణం (రూ.కోట్లలో)
2016	తెలంగాణ	20,69,872	29,748
2017	తెలంగాణ	19,14,878	43,533
2016	ఏపీ	62,45,232	68,835
2017	ఏపీ	58,91,341	72,973

గుండెపోట్లతోనే జవాన్ల మరణాలు ఎక్కువ

- సీఆర్పీఎఫ్ జవాన్లపై ప్రభుత్వం వెల్లడి

దిల్లీ: గత మూడేళ్లలో సీఆర్పీఎఫ్ జవాన్లు నక్సలైట్ల వ్యతిరేక పోరాటంలోకన్నా గుండెపోటు, కుంగుబాటు తదితర కారణాలతో 16 రెట్లు అధికంగా మరణించినట్లు ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ రాతపూర్వక సమాధానంలో ఈ అంశాన్ని వెల్లడించారు. 2015 నుంచి 2017 మధ్య నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో 74 మంది జవాన్లు మరణించగా, విభిన్న వైద్యపరమైన సమస్యలతో 1,196మంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఇందులో 219 మంది జవాన్లు, అధికారులు గుండెపోటుతో, 77 మంది కుంగుబాటు, ఆత్మహత్యలతో, 20 మంది మలేరియా, డెంగీలతో ప్రాణాలుకోల్పోయినట్లు వివరించారు. 880 మంది ఇతరత్రా వైద్య కారణాలతో చనిపోయినట్లు చెప్పారు.

■ వివిధ సంస్థల్లో మేనేజ్‌మెంట్‌లో కార్మికులు పాలుపంచుకోవడానికి సంబంధించిన బిల్లును రాజ్యసభలో ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కార్మిక మంత్రి దత్తాత్రేయ బిల్లును ఉపసంహరించారు.



2024 పారిస్‌లో.. 2028 లాస్ ఏంజిలెస్‌లో..!

ఒలింపిక్స్ ఆతిథ్యంపై కుదిరిన ఒప్పందం

లాస్ ఏంజిలెస్: 2020 ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యమివ్వనుంది. ఆ తర్వాత జరిగే రెండు ఒలింపిక్స్ ఆతిథ్య నగరాలు కూడా ఖరారైనట్లే..! 2024 ఒలింపిక్స్‌కు పారిస్, 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజిలెస్ ఆతిథ్యమివ్వడం దాదాపుగా ఖాయం. సెప్టెంబరు 13న లిమ (పెరు)లో జరిగే సమావేశంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆతిథ్య నగరాల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనుంది. నిజానికి 2024 ఒలింపిక్స్ ఆతిథ్య రేసులో పారిస్‌తో పాటు లాస్ ఏంజిలెస్ కూడా ఉంది. ఐతే 1924లో తొలిసారి ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చిన పారిస్.. వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2024లో మళ్లీ ఒలింపిక్స్ నిర్వహించాలని పట్టుదలగా ఉంది. దీంతో లాస్ ఏంజిలెస్ నాలుగేళ్ల తర్వాత మెగా సంబరానికి ఆతిథ్యమిచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు ఐఓసీతో ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఒలింపిక్స్ నిర్వహణ కోసం ఆ నగరం చెల్లించాల్సిన ఫీజులను మాఫీ చేసేందుకు ఐఓసీ ఒప్పుకుంది. లాస్ ఏంజిలెస్‌కు 180 మిలియన్ డాలర్లను ముందే చెల్లించేందుకు కూడా ఐఓసీ అంగీకరించింది! ఐఓసీతో లాస్ ఏంజిలెస్ చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఆ నగరం 2024 ఆతిథ్య రేసు నుంచి వైదొలగాలి. దీనికి లాస్ ఏంజిలెస్ నగర మండలితో పాటు.. అమెరికా ఒలింపిక్ కమిటీ కూడా అంగీకారం తెలపాలి. ఐతే అది లాంఛనమేనని సమాచారం.

వీర్‌దేవ్‌కు కాంస్యం

దిల్లీ: ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ కొట్టింది. 74 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో వీర్ దేవ్ గులియా కాంస్యం నెగ్గాడు. మంగళవారం జరిగిన కాంస్య పోరులో వీర్‌దేవ్ 8-5తో యజురో యమసాకి (జపాన్)ని ఓడించాడు. మరో పతకం భారత్ చేజారింది. 60 కిలోల కాంస్య పోరులో రవీందర్ 6-9తో హిరోమి సకాకి (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

ఛాంపియన్



శాస్త్రి పొగడ్తల వర్షం

దిగ్గజాల వల్ల కానిది కోహ్లీసేన సాధించింది

కొలంబో: దిగ్గజ ఆటగాళ్లతో కూడిన భారత జట్లకు సాధ్యం కాని విజయాన్ని విరాట్ కోహ్లి సారథ్యంలోని యువ జట్టు అందుకుందని టీమ్‌ఇండియా కోచ్ రవి శాస్త్రి ప్రశంసించాడు. రెండు దశాబ్దాల కెరీర్లో పెద్ద పేరున్న ఆటగాళ్లు చాలాసార్లు శ్రీలంకలో పర్యటించినా వట్టి చేతుల్తో తిరిగెళ్లారని, కోహ్లీసేన తొలిసారే సిరీస్ విజయంతో సత్తా చాటిందని, మరెన్నో ఘనతలను అందుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. "టీమ్‌ఇండియాలో రెండేళ్లుగా పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. జట్టులోని ఆటగాళ్లందరూ మంచి అనుభవం సంపాదించారు. అంతేకాదు గతంలో దిగ్గజ ఆటగాళ్లతో కూడిన జట్లకు సాధ్యం కాని విజయాలను ఇప్పటికే ఈ కుర్రాళ్లు అందుకున్నారు. రెండేళ్ల క్రితం శ్రీలంక పర్యటనే అందుకు ఉదాహరణ. పెద్ద పేరున్న ఆటగాళ్లు టీమ్‌ఇండియా తరఫున 20 ఏళ్ల పాటు ఆడారు. వాళ్లు శ్రీలంకలో చాలాసార్లు పర్యటించినా ఎప్పుడూ సిరీస్ గెలవలేదు. కానీ ఈ కుర్ర జట్టు సాధించింది. మిగతా భారత జట్లకు, ప్రత్యేకంగా విదేశీ పర్యటనల్లో సాధ్యం కాని ఘనతలను అందుకునే సత్తా ఈ జట్టుకు ఉంది" అని రవిశాస్త్రి అన్నాడు. 1993లో మహ్మద్ అజహరుద్దీన్ సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో సిరీస్ గెలిచింది. 22 ఏళ్ల తర్వాత కోహ్లి నేతృత్వంలో భారత్ 2015లో మళ్లీ సిరీస్ గెలిచింది.

అతడిలో ఎంతో మార్పు వచ్చింది: కెప్టెన్‌గా కోహ్లి ఎంతో పరిణతి సాధించాడని రవి అభిప్రాయపడ్డాడు. "కోహ్లి ఇంకా కుర్రాడే. సారథిగా అతడి తొలి టెస్టుతో పోల్చుకుంటే ఎంతో పరిణతి సాధించాడు. అడిలైడ్‌లో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నప్పుడు నేను అక్కడే ఉన్నా. కెప్టెన్‌గా ఇప్పుడు అతడికి 27 టెస్టుల అనుభవం ఉంది. కోహ్లిలో ఎంతో మార్పు కనిపిస్తోంది" అని అన్నాడు. శ్రీలంకతో రెండో టెస్టు గురువారం ఆరంభం కానుంది. జ్వరం కారణంగా తొలి టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్ మంగళవారం నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశాడు.

గుణరత్నె స్థానంలో తిరిమానె: టీమ్‌ఇండియాతో తొలి టెస్టులో గాయపడిన అసేల గుణరత్నె స్థానంలో శ్రీలంక లాహిరు తిరిమానెను జట్టులోకి తీసుకుంది. వెన్ను నొప్పితో ఇబ్బందిపడుతున్న పేసర్ లక్మల్ స్థానంలో లంక లెఫ్టార్మ్ స్పిన్నర్ లక్షణ్ సందాకన్‌ను జట్టులోకి తీసుకున్నట్లు సమాచారం. న్యుమోనియా కారణంగా తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ దినేశ్ చండిమాల్ కూడా జట్టుతో చేరనున్నాడు.



రంజీ మళ్లీ పాత పద్ధతికే

తటస్థ వేదికల్లో నిర్వహణకు స్వస్తి

కోల్‌కతా: తటస్థ వేదికల్లో రంజీ ట్రోఫీ ఒక్క సీజన్‌కే పరిమితమైంది. వివాదాస్పదంగా మారిన ఈ విధానానికి స్వస్తి పలికిన బీసీసీఐ మళ్లీ పాత పద్ధతిలోనే దేశవాళీ టోర్నీని నిర్వహించాలని నిర్ణయించింది. ఈసారి అక్టోబరు 6న ఆరంభమయ్యే రంజీ ట్రోఫీ ఇంటా బయట ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ నేతృత్వంలోని బీసీసీఐ సాంకేతిక కమిటీ తీసుకున్న ఈ నిర్ణయానికి బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఐతే నాకౌట్ మ్యాచ్‌లు ఎప్పట్లాగే తటస్థ వేదికల్లో నిర్వహిస్తామని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి చెప్పాడు.

హైదరాబాద్‌లో టీ20.. వైజాగ్‌లో వన్డే

వేదికలు ఖరారు చేసిన బీసీసీఐ

కోల్‌కతా: స్వదేశీ సీజన్‌లో టీమ్‌ఇండియా మ్యాచ్‌ల వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. సెప్టెంబరు నుంచి డిసెంబరు ఆఖరి వరకు స్వదేశంలో భారత జట్టు 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లను ఆడనున్న భారత జట్టు శ్రీలంకతో మూడేసి టెస్టులు, వన్డేలు, టీ20 సిరీస్‌ను ఆడనుంది. మంగళవారం బీసీసీఐ పర్యటనల ప్రణాళిక కమిటీ ఈ మ్యాచ్‌ల వేదికలను ప్రకటించింది. ఆస్ట్రేలియాతో టీ20కి హైదరాబాద్, శ్రీలంకతో వన్డేకు వైజాగ్ ఆతిథ్యమివ్వనున్నాయి. ఐతే మ్యాచ్‌ల తేదీలను ఇంకా ఖరారు చేయలేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు కోల్‌కతా, దిల్లీ, నాగ్‌పూర్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

సిరీస్‌లు, వేదికల వివరాలు: **ఆస్ట్రేలియా సిరీస్: వన్డేలు (5):** చెన్నై, బెంగళూరు, నాగ్‌పూర్, ఇండోర్, కోల్‌కతా **టీ20లు (3):** హైదరాబాద్, రాంచి, గువహాటి, **న్యూజిలాండ్ సిరీస్: వన్డేలు (3):** పుణె, ముంబయి, కాన్పూర్ **టీ20లు (3):** దిల్లీ, కటక్, రాజ్‌కోట్, **శ్రీలంక సిరీస్: టెస్టులు (3):** కోల్‌కతా, నాగ్‌పూర్, దిల్లీ **వన్డేలు (3):** ధర్మశాల, మొహాలి, వైజాగ్ **టీ20లు (3):** కొచ్చి/తిరువనంతపురం, ఇండోర్, ముంబయి

వ్యక్తిగతంగా అందరూ స్టార్ ఆటగాళ్లే. సత్తాఉన్న క్రీడాకారులే. కానీ జట్టుగా రాణించలేని పరిస్థితి. సమన్వయం కుదరని దుస్థితి. ఫలితమే.. తెలుగు టైటాన్స్ పరాజయాల హ్యాట్రిక్. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఐదో సీజన్‌లో సొంతగడ్డపై రాహుల్ చౌదరి బృందం వరుసగా మూడో మ్యాచ్‌లో చతికిలపడింది. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 18-31తో యూపీ యోధ చేతిలో చిత్తయింది.



రాహుల్ చౌదరిని చుట్టేసిన యూపీ ఆటగాళ్లు

టైటాన్స్ ఓటమి కూత

హ్యాట్రిక్ పరాజయం

యూపీ యోధ చేతిలో చిత్తు

ఈనాడు - హైదరాబాద్

ప్రొ కబడ్డీ ఆరంభ మ్యాచ్‌లో అదరగొట్టిన టైటాన్స్.. వరుసగా మూడో మ్యాచ్‌లో ఓటమితో నిరాశపరిచింది. చేసిన తప్పులే చేస్తూ చేజేతులా మ్యాచ్‌లను వదులుకుంటోంది. ప్రథమార్ధంలో సమర్థంగా ఆడుతున్న టైటాన్స్.. ద్వితీయార్ధంలో ఘోరంగా విఫలమవుతోంది. మంగళవారం ఓటమికి కూడా కారణం అదే. ప్రథమార్ధంలో 11-12తో యూపీకి గట్టి పోటీనిచ్చిన టైటాన్స్.. ద్వితీయార్ధంలో తేలిపోయి 13 పాయింట్ల తేడాతో ఓడింది. డిఫెన్స్‌లో సమన్వయలోపం, రైడింగ్‌లో కెప్టెన్ రాహుల్‌చౌదరిపై అతిగా ఆధారపడటం టైటాన్స్‌ను దెబ్బతీసింది.

పాయింట్ల కోసం రెండు జట్లు హోరాహోరీగా తలపడటంతో ప్రథమార్ధం ఆసక్తికరంగా, వేగంగా సాగింది. టైటాన్స్ జట్టులో రాహుల్, వికాస్.. యూపీ తరఫున కెప్టెన్ నితిన్ తోమర్, రిషాంక్ పాయింట్లతో చెలరేగారు. రైడింగ్‌లో ఇరుజట్లు సమంగా కనిపించినా.. డిఫెన్స్‌లో యూపీ మెరుగ్గా ఆడింది. ట్యాకిల్ పాయింట్లతో టైటాన్స్‌పై ఆధిక్యం సంపాదించింది. యూపీ ఆటగాడు నితేష్ అద్భుతమైన ట్యాకిల్స్‌తో టైటాన్స్ ఆటగాళ్ల పనిపట్టాడు. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన సురేందర్‌సింగ్ డూ ఆర్ డై రైడ్‌లో సూపర్ రైడ్‌తో 3 పాయింట్లు సాధించి యూపీ ఆధిక్యాన్ని 17-13కు పెంచాడు. ఈ రైడ్ యూపీలో ఉత్సాహం నింపగా.. టైటాన్స్‌ను నైరాశ్యంలోకి నెట్టింది. అక్కడ్నుంచి మ్యాచ్ యూపీ వైపు సాగింది. రైడర్లు, డిఫెండర్లు కలిసికట్టుగా రాణించడంతో యూపీ ఆధిక్యం పెరుగుతూ పోయింది. మరోవైపు టైటాన్స్ పూర్తిగా రాహుల్ పైనే ఆధారపడింది. అతను రైడ్‌కు వెళ్లినప్పుడే పాయింటు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. సీనియర్ ఆటగాడు రాకేశ్‌కుమార్ మరోసారి విఫలమయ్యాడు. తెలివిగా ఆడుతూ పాయింట్లు రాబట్టిన యూపీ ఒకదశలో 25-14తో 11 పాయింట్ల ఆధిక్యం సంపాదించింది. ఈ సమయంలో రాహుల్ చెలరేగి వరుస పాయింట్లు గెలవడంతో టైటాన్స్ 17-25తో పోటీనిచ్చేలా కనిపించింది. ఐతే నీలేష్ సాలుంకేను సూపర్ ట్యాకిల్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా యూపీ వైపు మొగ్గింది. ఈ మ్యాచ్‌లో టైటాన్స్ ఒకసారి ఆలౌటైంది. రాహుల్ ఏడు రైడ్ పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. యూపీ రైడర్లు నితిన్ (6), రిషాంక్ (5) మెరిశారు. నితేష్‌కుమార్ ఐదు ట్యాకిల్ పాయింట్లతో అదరగొట్టాడు.

గుజరాత్ బోణీ: పీకేఎల్‌లో తొలిసారిగా బరిలో దిగిన గుజరాత్ సూపర్‌జెయింట్స్ మొదటి మ్యాచ్‌లోనే అదరగొట్టింది. సుకేశ్ హెగ్డే సారథ్యం.. అనుభవంతో గుజరాత్ అద్భుతంగా రాణించింది. ఈ మ్యాచ్‌లో గుజరాత్ 26-20తో దబాంగ్ దిల్లీని చిత్తుచేసి పీకేఎల్‌లో బోణీకొట్టింది. ప్రథమార్ధం ముగిసేసరికి గుజరాత్ 15-5తో ఆధిక్యం సంపాదించింది. ఒకదశలో ప్రత్యర్థిపై 17 పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. రైడింగ్‌లో సుకేశ్ (3), సచిన్ (3).. డిఫెన్స్‌లో ఫజల్ (4) సత్తా చాటారు. ఐతే కెప్టెన్ మిరాజ్ షేక్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా అడుగుపెట్టిన శ్రీరామ్.. దిల్లీకి అండగా నిలిచాడు. ఏకపక్షంగా సాగుతున్న మ్యాచ్‌ను శ్రీరామ్ (5) తన దూకుడుతో ఆసక్తికరంగా మార్చాడు. రైడ్‌కు వెళ్లిన ప్రతిసారి పాయింటు గెల్చుకుంటూ గుజరాత్ ఆధిక్యాన్ని తగ్గించాడు. ఆనంద్ పాటిల్ (3) కూడా మెరవడంతో దిల్లీ వరుసగా పాయింట్లు సాధించింది. ఐతే దిల్లీ పుంజుకునేలోపే భారీ ఆధిక్యం సంపాదించిన గుజరాత్.. చివరికి విజేతగా నిలిచింది. ద్వితీయార్ధంలో గుజరాత్ (11) కంటే దిల్లీ (15) ఎక్కువ పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఇరుజట్లు ఒక్కోసారి ఆలౌటయ్యాయి.

ప్రొ కబడ్డీలో ఈనాడు		
	గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ × హరియాణా స్టీలర్స్ రాత్రి 8 నుంచి తెలుగు టైటాన్స్ × బెంగాల్ వారియర్స్ రాత్రి 9 నుంచి	వేదిక: హైదరాబాద్; ప్రసారం: స్టార్ స్పోర్ట్స్-2లో



డ్రెసెల్

వచ్చేశాడు నయా ఫెల్ఫ్స్

స్విమ్మింగ్... అనగానే ఠక్కున గుర్తొచ్చే పేరు మైకేల్ ఫెల్ప్స్. ఒలింపిక్స్‌లో 23 స్వర్ణ పతకాలు గెలిచి ఎవరికి అందనంత ఎత్తులో నిలిచిన మేరునగ ధీరుడు. మంచి నీళ్లు తాగినంత సులభంగా నీళ్లలో ఈదేసి రికార్డుల మీద రికార్డులు నెలకొల్పిన వీరుడు. ఈ అమెరికా దిగ్గజాన్ని గుర్తుకు తెచ్చే స్విమ్మర్ ఇప్పట్లో వస్తాడని ఎవరూ అనుకోలేదు. కానీ అదే అమెరికా నుంచి మరో స్విమ్మర్ వెలుగులోకొచ్చాడు. అతనే కాలెబ్ డ్రెసెల్. బుడాపెస్ట్ ఫినా ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా ఏడు స్వర్ణాలు గెలిచి ప్రకంపనలు సృష్టించాడీ కుర్రాడు. ఫెల్ప్స్ వారసుడిగా కితాబు అందుకుంటున్న డ్రెసెల్.. ఇప్పుడు పూల్‌లో పెద్ద సంచలనం.

ఈనాడు క్రీడావిభాగం

రియో ఒలింపిక్స్ ఫెల్ప్స్‌కు ఆఖరి పోటీలు కావడంతో అందరి దృష్టంతా అతని మీదే ఉంది. కానీ ఆ ఒలింపిక్స్‌లోనే డ్రెసెల్ మెరిశాడు. 4×100 మీ ఫ్రీస్టయిల్, 4×100 మీ రిలేలో ఫెల్ప్స్‌తో కలిసి అతను అమెరికా స్వర్ణాలు గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. అప్పుడు దిగ్గజ ఫెల్ప్స్ నీడలో ఉండిపోయిన డ్రెసెల్.. సీనియర్ విభాగంలో తాను పాల్గొన్న తొలి ఫినా ఛాంపియన్‌షిప్‌లో కళ్లుచెదిరే ప్రదర్శన చేశాడు. 50 మీ, 100 మీ ఫ్రీస్టయిల్, 100 మీ బటర్‌ఫ్లై, 4×100 మీ ఫ్రీస్టయిల్, 4×100 మీ మెడ్లే, 4×100 మీ మిక్స్‌డ్ ఫ్రీస్టయిల్, 4×100 మీ మిక్స్‌డ్ మెడ్లే విభాగాల్లో స్వర్ణాలు గెలిచి కూల్‌గా పూల్‌ను వేడెక్కించేశాడీ 20 ఏళ్ల కుర్రాడు. కేవలం రెండు గంటల వ్యవధిలో మూడు స్వర్ణాలు (50 మీ ఫ్రీస్టయిల్, 100 మీ బటర్‌ఫ్లై, మిక్స్‌డ్ 4×100 మీ రిలే) గెలిచి అబ్బురపరిచాడు. ఒక్క రోజులో మూడు స్వర్ణాలు గెలిచిన తొలి స్విమ్మర్ అతనే. అంతేకాదు ఫెల్ప్స్ తర్వాత ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఏడు స్వర్ణాలు గెలిచిన స్విమ్మర్‌గా కూడా ఘనత వహించాడు. 2007 మెల్‌బోర్న్ ఫినా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫెల్ప్స్ ఇలాగే ఏడు పసిడి పతకాలు నెగ్గాడు. ఫెల్ప్స్‌లా ఒక ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇంతగా ఆధిపత్యం చూపించిన అథ్లెట్ మరొకరు లేరని పండితులు డ్రెసెల్‌ను ఆకాశానికెత్తుతున్నారు. అయితే తాజా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మిక్స్‌డ్ ఈవెంట్లు ఉండడం కూడా డ్రెసెల్ ఏడు స్వర్ణాలు గెలవడానికి మరో కారణం. మెల్‌బోర్న్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫెల్ప్స్ సాధించిన ఏడు స్వర్ణాల్లో ఐదు వ్యక్తిగత ఈవెంట్లలో రాగా.. డ్రెసెల్‌కు మాత్రం ఏడింట్లో నాలుగు పసిడి పతకాలు టీమ్ విభాగంలో వచ్చాయి.

● డ్రెసెల్ ఇప్పటిదాకా 15 అంతర్జాతీయ పతకాలు గెలిస్తే అందులో 10 స్వర్ణాలున్నాయి

లక్ష్యం.. టోక్యో: రియో ఒలింపిక్స్‌లో రెండు టీమ్ పతకాలతో సరిపెట్టుకున్న డ్రెసెల్ ముందున్న లక్ష్యం 2020 టోక్యో ఒలింపిక్స్. ఫెల్ప్స్ మాదిరిగా ఒకే ఒలింపిక్స్‌లో ఎక్కువ పతకాలు గెలవాలన్నదే డ్రెసెల్ ధ్యేయం. బీజింగ్ ఒలింపిక్స్‌లో ఫెల్ప్స్ 8 స్వర్ణాలు గెలిచాడు. 100, 200 మీ రేసుల్లో గొప్పగా రాణించే డ్రెసెల్‌కు స్ప్రింట్ స్విమ్మర్‌గా పేరుంది. కెరీర్ ఆరంభం నుంచి అతనిది ఇదే జోరు. 2013 ఫినా జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆరు స్వర్ణాలు కైవసం చేసుకోవడమే కాక ఛాంపియన్‌షిప్ రికార్డు బద్దలు కొట్టాడతను. 2015 నుంచి సీనియర్ విభాగంలో పోటీపడుతున్న డ్రెసెల్.. తక్కువ సమయంలోనే 50 మీ ఫ్రీస్టయిల్‌లో టాప్-5 ర్యాంకు స్విమ్మర్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వీలైనన్ని ఎక్కువ పతకాలు గెలవడమే కాదు.. ఫెల్ప్స్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టాలన్నదే డ్రెసెల్ సంకల్పం.

మెరిసిన సిరాజ్, పాండే

అఫ్గాన్-ఎపై భారత్-ఎ ఘన విజయం


సిరాజ్

ప్రిటోరియా: బ్యాటింగ్‌లో మనీష్ పాండే (86; 87 బంతుల్లో 9×4, 1×6), రిషబ్ పంత్ (60; 59 బంతుల్లో 5×4, 1×6), బౌలింగ్‌లో యువ పేసర్ మహ్మద్ సిరాజ్ (3/49) మెరవడంతో మూడు దేశాల వన్డే టోర్నీలో భారత్-ఎ 113 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్-ఎను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్...50 ఓవర్లలో 5 వికెట్లకు 322 పరుగుల భారీ స్కోరు చేసింది. పాండే, పంత్‌లతో పాటు శ్రేయస్ అయ్యర్ (44), కృనాల్ పాండ్య (48) రాణించారు. మహ్మద్ సిరాజ్, సిద్దార్థ్ కౌల్ (2/35), వరుణ్ శంకర్ (2/21) ధాటికి అఫ్గాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులే చేయగలిగింది.



హరికృష్ణ.. టైటిల్‌కు చేరువలో


బీల్: భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ బీల్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లో టైటిల్ దిశగా అడుగులు వేస్తున్నాడు. మంగళవారం జరిగిన ఎనిమిదో రౌండ్లో అతను 58 ఎత్తుల్లో పొనొమారియోవ్‌ను ఓడించాడు. దీంతో మరో రౌండ్ మాత్రమే మిగిలున్న ఈ టోర్నీలో హరి 5.5 పాయింట్లతో హో ఇఫాన్‌తో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

గోపి స్ఫూర్తిప్రదాత


ఈనాడు, హైదరాబాద్: జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ గొప్ప స్ఫూర్తిప్రదాత అని భారత మహిళల క్రికెట్ జట్టు సారథి మిథాలీ రాజ్ తెలిపింది. అంకితభావం, క్రమశిక్షణతో శిక్షణనిస్తూ అంతర్జాతీయ క్రీడాకారుల్ని దేశానికి అందిస్తున్నాడని చెప్పింది. వన్డే క్రికెట్లో అత్యధిక పరుగులు సాధించడంతో పాటు ఇటీవలి ప్రపంచ కప్‌లో భారత జట్టును రన్నరప్‌గా నిలిపిన మిథాలీకి తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరినాథ్ మంగళవారం రూ.40 లక్షల విలువైన బీఎండబ్ల్యూ కారును బహుకరించాడు. గోపీచంద్ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపి, బయోలాజికల్ ఇవాన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల, మ్యాక్సివిజన్ ఛైర్మన్ డాక్టర్ వేలు, సహ ఛైర్మన్ డాక్టర్ కె.పి.రెడ్డి పాల్గొన్నారు.



మిథాలీకి బీఎండబ్ల్యూ కారు అందిస్తున్న చాముండేశ్వరి నాథ్, తదితరులు



చైనా వస్తువులు పనిచేయవు మా సత్తా ఏంటో చూపిస్తా..!



దిల్లీ: అసలు పంచ్‌లకు ముందు మాటల పంచ్‌లు పడుతున్నాయి. ఆగస్టు 5న జరిగే ప్రొఫెషనల్ పోరులో ఆసియా టైటిల్ కోసం పోటీపడనున్న భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్, చైనా నం.1 బాక్సర్ జుల్పికర్ మైమైటలి మాటల యుద్ధంతో వేడెక్కిస్తున్నారు. చైనా వస్తువులు ఎక్కువ కాలం పనిచేయవని విజేందర్ అంటే.. చైనా సత్తా ఏంటో చూపిస్తానంటూ హెచ్చరించాడు జుల్పికర్. మ్యాచ్ గురించి విజేందర్ మాట్లాడుతూ.. "మరో నాకౌట్ కోసం ప్రయత్నిస్తా. వీలైనంత త్వరగా మ్యాచ్ ముగిస్తాను. చైనా వస్తువులు ఎక్కువ కాలం పనిచేయవన్న సంగతి తెలిసిందేగా" అని అన్నాడు. ప్రతిగా జుల్పికర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. "చైనా సత్తా ఏంటో విజేందర్‌కు చూపిస్తాను. అతడికి గుణపాఠం నేర్పుతా. నేను పిల్లాడిని అనుకుంటున్నాడు. అతడికి నా గురించి పూర్తిగా తెలియదు. కాచుకో విజేందర్.. నీ దేశానికి వచ్చి.. నీ టైటిల్‌ను తీసుకెళ్లిపోతాను" అని అన్నాడు. విజేందర్ డబ్ల్యూబీఓ ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ ఛాంపియన్ కాగా.. జుల్పికర్ డబ్ల్యూబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ ఛాంపియన్. ముంబయిలో వీరిద్దరి మధ్య పోరులో గెలిచిన వారికి రెండు టైటిళ్లు సొంతమవుతాయి.

గాలెను మరిచిపోవాలి

మహేల జయవర్ధనె

గాలె టెస్టులో భారత్ ఆధిపత్యం సుస్పష్టం. తిరుగులేని ఆటతో విరాట్ సేన.. తొలి టెస్టును కైవసం చేసుకొని సిరీస్‌లో శుభారంభం చేసింది. ఈ సిరీస్‌లో భారత్ దూకుడుకు కళ్లెం వేయాలంటే శ్రీలంక వినూత్నంగా ఆలోచించాల్సిందే. 600 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడం అంత సులభమేమీ కాదు. దీనికి తోడు గుణరత్నె గాయం లంక అవకాశాలను మరింత దెబ్బతీసింది. భారత్ జోరుకు అడ్డుకట్ట వేయాలంటే లంక కూడా దూకుడుగా ఆడాల్సిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారీగా పరుగులు చేసి.. భారత్‌పై ఒత్తిడిని పెంచాలి.

భారత్ 6-5 వ్యూహానికి నేను పెద్ద అభిమానిని. ఈ కూర్పు నాయకుడిగా విరాట్ కోహ్లికి బోలెడన్ని ప్రత్యామ్నాయాలను కల్పిస్తోంది. మిడిలార్డర్లో సాహా-పాండ్య-జడేజా లాంటి బ్యాట్స్‌మెన్ ఉండడంతో మంచి పిచ్‌లపై కూడా 20 వికెట్లు తీసే బౌలర్లను ఎంచుకొనే స్వేచ్ఛ విరాట్ కోహ్లికి లభిస్తోంది. రెండో టెస్టుకు ముందు శ్రీలంక.. గాలె ఓటమిని మరిచిపోవాలి. తాజాగా సిద్ధమవ్వాలి. దూకుడుగా, తెలివిగా ఆడి భారత్‌పై ఒత్తిడి పెంచాలి.

సీసీఎంబీ వ్యవస్థాపకుడు పి.ఎం.భార్గవ కన్నుమూత

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపకుడు, భారతదేశ ఆధునిక జీవశాస్త్ర రూపశిల్పిగా గుర్తింపు పొందిన పి.ఎం.భార్గవ(89) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం హైదరాబాద్ ఉప్పల్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పరిశోధన సంస్థ సీసీఎంబీ ఏర్పాటులో క్రియాశీలకంగా వ్యవహరించిన భార్గవ 13 ఏళ్ల పాటు ఆ సంస్థకు సంచాలకుడిగా వ్యవహరించారు. పద్మభూషణ్ సహా 100కు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

సీసీఎంబీ రూపశిల్పి..: దేశంలో అద్భుత పరిశోధనలకు కీలక కేంద్రంగా ఉన్న సెంటర్ ఫర్ సెల్యులార్, మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) వ్యవస్థాపకుడు పి.ఎం.భార్గవ. వ్యవస్థాపక సంచాలకుడిగా 1977 ఏప్రిల్‌లో బాధ్యతలు స్వీకరించి 1990 ఫిబ్రవరి వరకూ ఆ పదవిలో కొనసాగారు. 1970ల్లోనే జెనెటిక్ ఇంజినీరింగ్ అనే పదాన్ని ఉపయోగించిన శాస్త్రవేత్త భార్గవ. 1986లోనే బయోటెక్నాలజీ శాఖను ఏర్పాటు చేయడానికి కృషి చేశారు. పీ-32 లేబుల్డ్ న్యూక్లియోటైడ్ మాలిక్యుల్ తయారీ కోసం అణుశక్తి విభాగం జౌనాకిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారు. భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) గుర్తింపునకు జాతీయ మార్గదర్శకాలను రూపొందించడంతో పాటు దేశంలో సంతాన సాఫల్య కేంద్రాల పర్యవేక్షణ, నియంత్రణ మార్గదర్శకాలనూ రూపొందించారు.

- జన్యుమార్పిడి(బీటీ) వంగడాలను దేశంలోకి తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బయోటెక్నాలజీ అథారిటీ ఆఫ్ ఇండియా బిల్లును వ్యతిరేకించారు.



సీసీఎంబీని జాతికి అంకితం చేసే కార్యక్రమంలో నాటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్, ప్రధాని రాజీవ్‌గాంధీలతో భార్గవ (పాతచిత్రం)

జీవిత చరిత్ర

పేరు: పుష్ప మిత్ర భార్గవ
జననం: 22 ఫిబ్రవరి 1928, రాజస్థాన్‌లోని అజ్‌మేర్.
తల్లిదండ్రులు: గాయత్రి భార్గవ, రామచంద్ర భార్గవ
భార్య: మనోరమ భార్గవ (ఏడాది క్రితం మరణించారు) కుమారుడు మోహిత్, కుమార్తె వినిత

అజ్‌మేర్‌లో పుట్టి.. హైదరాబాద్‌లో స్థిరపడి..

అజ్‌మేర్‌లో పుట్టిన భార్గవ వారణాసి, లఖ్‌నవూల్లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1944లో బీఎస్సీ, 1946లో ఎంఎస్సీ పూర్తి చేశారు. 21 ఏళ్లకే లక్నో విశ్వవిద్యాలయం నుంచి సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పొందారు. లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రం బోధించేవారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చారు. 23 ఏళ్ల వయసులోనే 14 పరిశోధనపత్రాలను ప్రచురించారు.

- పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌తో ప్రాజెక్ట్ అసోసియేట్‌గా అమెరికాలో క్యాన్సర్ పరిశోధనలో పాలుపంచుకున్నారు. యాంటీ డ్రగ్ ఆవిష్కరణలో కీలకంగా వ్యవహరించారు. బ్రిటన్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్‌లో పనిచేశారు. 1958లో హైదరాబాద్ వచ్చిన భార్గవ రీజినల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(ప్రస్తుతం ఐఐసీటీ)లో శాస్త్రవేత్తగా చేరారు.



పీఎం భార్గవ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న సీసీఎంబీ డైరెక్టర్ డా.రాకేష్‌మిశ్ర, మాజీ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు

పలువురి సంతాపం

భార్గవ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, సీపీఐ నాయకులు సురవరం సుధాకరరెడ్డి, కె.నారాయణ, రాష్ట్ర సీపీఎం, సీపీఐ కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, చాడ వెంకటరెడ్డి సంతాపం తెలిపారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేష్‌మిశ్ర, మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్జీసింగ్, శివాజీ, ఇతర శాస్త్రవేత్తలు భార్గవ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. భార్గవ పార్థివ దేహానికి ఈ నెల 4న జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. భార్గవ కుమారుడు మోహిత్ కెనడాలో ఉన్నారు. కుమార్తె వినీత ఆంధ్రప్రదేశ్‌లో ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు.

కొత్త పాస్‌పోర్టులోకి వీసా బదలాయింపు కుదరదు



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

2016లో బి1/బి2 వీసా జారీ అయింది. ఇటీవల భారతదేశంలో పాస్‌పోర్టును పోగొట్టుకున్నాను. దాని స్కాన్ కాపీ ఉంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అనంతరం నూతన పాస్‌పోర్టు పొందాను. దీనిపై మునుపటి వీసా స్టాంపింగ్ వేయించుకోటం ఎలా? - రవిచంద్ర ములుగు

అమెరికా ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం మీరు పోగొట్టుకున్న వీసా(పాస్‌పోర్టులోని వీసా స్టాంపింగ్)ను నూతన పాస్‌పోర్టుకు బదలాయించటం సాధ్యం కాదు. మీరు నూతన వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. డీఎస్-160ను భర్తీ చేసి ఎమ్మార్వీ ఫీజు చెల్లించండి. ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ)కింద అర్హత పొందితే దరఖాస్తుతోపాటు పోగొట్టుకున్న పాస్‌పోర్టు కాపీ, వీసా పేజీలు, పోలీసులు జారీ చేసిన ధ్రువపత్రాలను జతచేయండి. అర్హత పొందకపోతే వీసా ఇంటర్వ్యూ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి.

రెండున్నరేళ్ల వ్యవధిలో నా పర్యాటక వీసా దరఖాస్తును రెండు దఫాలు తిరస్కరించారు. మా సోదర సమానుడు(కజిన్) గ్రీన్‌కార్డుపై అమెరికాలో ఉంటున్నాడు. నా అమెరికా పర్యటనను ఆయనే ప్రాయోజితం చేస్తున్నారు. అమెరికాలో స్థిరపడాలన్న ఆలోచనేమీలేదు. నా వీసా తిరస్కారానికి కారణాలు తెలుసుకోవచ్చా? - ప్రదీప్ పులిపాక

వీసా దరఖాస్తు తిరస్కారానికి చాలా కారణాలుంటాయి. దరఖాస్తుదారుడు తాను దరఖాస్తు చేసుకున్న వీసా విభాగంలో అర్హతలు ఉండకపోవచ్చు. వీసా కేసుల అధారంగా అనర్హతకు కొన్ని విధానాలు ఉంటాయి. దరఖాస్తుదారుడి అర్హతలను ప్రస్ఫుటం చేసే అదనపు సమాచారాన్ని అందజేయటం ద్వారా కొన్ని రకాల వీసా తిరస్కారాల నుంచి అర్హత పొందవచ్చు. అర్హులని భావించి, మునుపటికన్నా అదనపు సమాచారం ఉందని భావిస్తే మీరు మరో దఫా వీసాకు దరఖాస్తు చేయండి. వీసా దరఖాస్తు తదితర సమాచారం కోసం https://www.ustraveldocs.com/ in ను చూడండి.

2016లో హెచ్1బి వీసా జారీ అయింది. వ్యక్తిగత కారణాలతో అప్పుడు ఉద్యోగంలో చేరలేదు. అదే సంస్థలో ప్రస్తుతం ఉద్యోగంలో చేరాలనుకుంటున్నాను. ఆ హెచ్1బి వీసాపై ప్రయాణం చేయవచ్చా? లేక హెచ్1బి ప్రక్రియను మళ్లీ నిర్వహించాలా? - శ్రీనివాసమూర్తి మంగళం

హెచ్1బి వీసాపై అభ్యర్థికి సంబంధించిన యూఎస్‌సీఐఎస్ ఆమోదిత, చెల్లుబాటయ్యే పిటిషన్‌తో కూడిన సమగ్ర సమాచారం ఉంటుంది. అందులో పిటిషన్ నంబరు, పిటిషనర్ పేరు, చెల్లుబాటు కాలం తదితర వివరాలు ఉంటాయి. మీరు అదే సంస్థలో చేరాలనుకుంటున్నారు కనుక, మీ పిటిషనర్‌ను సంప్రదించి పిటిషన్ నంబరులో ఏమైనా మార్పులున్నాయా? చెల్లుబాటయ్యే నూతన పిటిషన్ ఉందా? తదితర సమాచారాన్ని తెలుసుకోండి. మార్పులుంటే నూతన వీసా కోసం దరఖాస్తు చేసుకోండి.

అమెరికాలో అండర్ గ్రాడ్యుయేషన్ చేయాలనుకుంటున్నాను. ఉత్తమ విద్యా సంస్థలను గుర్తించటం ఎలా? ఆయా సంస్థల ప్రవేశ విధానాలను తెలుసుకోటం ఎలా? - కవిత చిన్నతాల

అమెరికాలో విద్యాభ్యాసం, వివిధ విద్యా సంస్థల కోర్సులకు సంబంధించిన వివరాల కోసం https://educationusa.state.gov ను చూడండి. విద్యార్థి వీసా(ఎఫ్1)కోసం దరఖాస్తు తదితర సమాచారానికి https://www.ustraveldocs.com/ in పరిశీలించండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను **support-india@ustraveldocs.co**కు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ **http://hyderabad.usconsulate.gov** ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితరసేవలకు సంబంధించిన ప్రశ్నలను **usvisa@eenadu.net**కు పంపగలరు.

నీతీశ్‌పై వ్యాజ్యం విచారణకు స్వీకరించిన సుప్రీం

దిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై విచారణకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది. విచారణాంశాల జాబితాలోకి రాగానే వ్యాజ్యాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది.

ఎవరిదో తప్పు.. పొంచి ఉన్న ముప్పు..!



తొట్టి వద్ద దాహం తీర్చుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలోని పురాతన రేకుల గదిలో 30 మంది చిన్నారులతో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఒకే గది ఉండటంతో నిర్వాహకులు అదే గదిలో గ్యాస్‌తో వంట చేస్తున్నారు. జరగరానిది జరిగితే పిల్లల ప్రాణాలకు ముప్పు తప్పదన్న ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు ఎస్.ఇటిక్యాల మండల పరిషత్తు పాఠశాలలో నీటి సదుపాయం లేకపోవడంతో.. అక్కడ నిర్మించిన తొట్టిలోని కలుషిత నీటినే విద్యార్థులు తాగుతున్నారు. అనారోగ్యాల బారినపడుతున్నారు. - ఈనాడు, సంగారెడ్డి



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న చిన్నారులు, గదిలోనే గ్యాస్ సిలిండర్(వృత్తంలో)

11 ఏళ్లలో హెచ్1బీలకు.. 21 లక్షల మంది దరఖాస్తు

వాషింగ్టన్: హెచ్1బీ కార్మిక వీసాలకు గత 11 ఏళ్లలో 21 లక్షల మందికిపైగా భారత సాంకేతిక నిపుణులు దరఖాస్తు చేసుకున్నట్లు అమెరికా వలసలు, పౌరసత్వ సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. 2007 నుంచి ఈ ఏడాది జూన్ వరకు వివరాలపై ఓ నివేదిక విడుదల చేసింది. తమకు 34 లక్షల దరఖాస్తులు వస్తే.. వీటిలో 21 లక్షలు భారత్‌వేనని పేర్కొంది. 11ఏళ్లలో తాము 26 లక్షల వీసాలు మంజూరుచేసినట్లు వెల్లడించింది. వీసాలు పొందిన భారతీయుల సగటు వార్షికవేతనం రూ.59.15 లక్షలుగా పేర్కొంది. వీరిలో ఎక్కువ మంది మాస్టర్స్, బ్యాచిలర్ డిగ్రీ పట్టా దారులేనని పేర్కొంది.

నివేదికలో ప్రధాన అంశాలు..

● దరఖాస్తుల్లో భారత్ తర్వాతి స్థానాల్లో చైనా (2,96,313), ఫిలిప్పీన్స్ (85,918), దక్షిణ కొరియా (77,359), కెనడా (66,228) ఉన్నాయి. ● వీసాలు పొందినవారిలో 23లక్షల మంది 25నుంచి 34 ఏళ్లలోపు వారే. వీరిలో 20లక్షల మంది ఐటీ నిపుణులే. ● 2,000 మంది 65 ఏళ్లు పైబడినవారికీ ఈ వీసాలను మంజూరు చేశారు. ప్రస్తుత ఏడాది సైతం 122 మంది వృద్ధులకు వీసాలిచ్చారు. ● కంప్యూటర్ ప్రోగ్రామింగ్ సేవల విభాగంలో రికార్డు స్థాయిలో 9.99 లక్షల వీసాలు మంజూరు చేశారు. కంప్యూటర్ సిస్టమ్స్ డిజైన్ (2.87 లక్షలు) విభాగం తర్వాతి స్థానంలో ఉంది. ● 11 ఏళ్లలో వీసాదారుల సగటు వేతనం గణనీయంగా పెరిగింది. 2007లో ఇది రూ.43.67 లక్షలు (68,157 డాలర్లు)గా ఉండేది.

డ్యామిట్.. 'తుపాకీ' అడ్డం తిరిగిందా..!

- 'విక్రమ్‌గౌడ్' కాల్పుల డ్రామాపై ఆధారాలు సేకరించిన పోలీసులు
- సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు నిర్ధారణ
- మధ్యప్రదేశ్‌లో కీలక నిందితుడి పట్టివేత

ఈనాడు, హైదరాబాద్: కాల్పుల ఘటనతో సానుభూతి పొందాలని భావించిన విక్రమ్‌గౌడ్ పథకం బెడిసికొట్టింది. హైదరాబాద్‌లో కలకలం రేపిన మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్ గౌడ్‌పై కాల్పుల ఘటన డ్రామాకు నగర పోలీసులు దాదాపు తెర దించడంతో..కాల్పుల నాటకం ఆడిన అతను మరిన్ని చిక్కులు కొనితెచ్చుకున్నట్లయింది. తనపై ఎవరో దుండగులు కాల్పులకు తెగబడ్డారంటూ అందర్నీ నమ్మించేందుకు విక్రమ్ ప్రయత్నించాడని ముందునుంచి అనుమానిస్తున్న పోలీసులు అయిదు రోజుల తర్వాత అందుకు తగ్గ ఆధారాలు సంపాదించారు. ఇందుకు ముగ్గురితో సుపారీ కుదుర్చుకున్నట్లూ తేల్చారు. తనపై తానే కాల్పులు జరుపుకున్నట్టు దాదాపు నిర్ధారణకు వచ్చారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకే విక్రమ్ ఈ కాల్పుల డ్రామా ఆడాడని నిర్ధారణకు వచ్చారు. అనంతపురానికి చెందిన సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కీలక ఆధారాలు పోలీసులకు లభించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..కాల్పుల ఘటన జరగడానికి కొద్దిసేపటి వరకు విక్రమ్..ఆ ముఠా సభ్యులతో నగరంలోని ఓ అతిథి గృహంలో మంతనాలు జరిపాడు. గుర్తుతెలియని వ్యక్తులే కాల్చారన్న వాతావరణాన్ని సృష్టించేందుకు తెల్లవారుజామున ముహూర్తాన్ని ఎంచుకున్నాడు. తనను తానే కాల్చుకున్న అనంతరం ఆ తుపాకీని వారికే ఇచ్చి పారిపొమ్మని చెప్పాడు.

తుపాకీ కోసం వేట: అలా పారిపోయే క్రమంలోనే దుండగులు తుపాకీని ఫిల్మ్‌నగర్‌లోని ఓ చెరువులో పడేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు నిందితులు ఈ విషయాన్ని బహిర్గతం చేయడంతో మంగళవారం ఆ చెరువువద్ద గాలించారు. ఆయుధం స్వాధీన సమాచారాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

నేడు హైదరాబాద్‌కు కీలక నిందితుడు: సుపారీ గ్యాంగ్‌లో కీలక నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బుధవారం అతడిని హైదరాబాద్ తీసుకురానున్నారు. ఐదు రోజులుగా చర్చనీయాంశంగా మారిన ఈ కేసు పూర్వాపరాలను పోలీసులు బుధవారం మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఆయుధ చట్టం కింద కేసులు: కాల్పుల కథ వెనక విక్రమ్ గౌడ్ కీలక సూత్రధారిగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు మంగళవారం రాత్రి ఈ కేసులో అతడినే ప్రధాన నిందితుడి(ఎ-1)గా చేర్చారు. అతడితోపాటు నందు, జలీల్‌ఖాన్‌ల పేర్లనూ నిందితుల జాబితాలో చేర్చినట్లు సమాచారం. వీరిపై ఐపీసీ 120, 120బి రెడ్ విత్ 27 ఆర్మ్స్ యాక్ట్, 420 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.



సురేశ్‌ప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న దత్తాత్రేయ, పద్మారావు, తెరాస ఎంపీలు

రెండు పడక గదుల ఇళ్లకు రైల్వే భూమివ్వండి

సురేశ్‌ప్రభుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం రైల్వే భూమి బదలాయించాలని రైల్వే మంత్రి సురేశ్‌ప్రభుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు సురేశ్‌ప్రభుకి తెలంగాణమంత్రి పద్మారావు, ఎంపీలు కవిత, వినోద్‌కుమార్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్, మల్లారెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. కేంద్రమంత్రి దత్తాత్రేయతోకలిసి వారు సురేశ్‌ప్రభుతో భేటీ అయ్యారు. మౌలాలి-తార్నాక వద్ద ఉన్న 12 ఎకరాల 60 గుంటల రైల్వే భూమిని రెండు పడక గదుల ఇళ్ల కోసం ఇవ్వాలని కోరారు. చర్లపల్లి వద్ద నిర్మించబోయే శాటిలైట్ టెర్మినల్‌కు కావాల్సిన భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పద్మారావు వివరించారు. దీనిపై ద.మ.రైల్వే అధికారులతో సురేశ్‌ప్రభు ఫోన్‌లో చర్చించారు.

జూడాల సమ్మె తాత్కాలిక విరమణ

- డీఎంఈతో చర్చలు సఫలం
- ఆర్ఎంవో సస్పెన్షన్, సూపరింటెండెంట్‌కు నోటీసు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యులపై దాడితో తలెత్తిన వివాదానికి తెరపడింది. రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు(డీఎంఈ)తో జూనియర్ వైద్యులు, టీజీజేడీఏ ప్రతినిధులు జరిపిన చర్చలు ఫలించాయి. 24గంటల్లో ఆసుపత్రిలో భద్రతను కట్టుదిట్టం చేస్తామని, జూడాలు లేవనెత్తిన సమస్యలు, ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని డీఎంఈ డా.కె.రమేష్‌రెడ్డి లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యులు ప్రకటించారు. 24గంటల్లో భద్రతను పెంచకపోతే మళ్లీ సమ్మెకు వెళ్తామని చెప్పారు. వైద్యులపై దాడికి పాల్పడినవారిని అరెస్ట్ చేసి శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతను కట్టుదిట్టంచేయాలని జూడాలు కోరారు. ఆసుపత్రిలో సీసీకెమెరాలు, బజర్ అలారంలు ఏర్పాటు చేయాలని, ఘటన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంవోపై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని డీఎంఈ హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నట్లు జూడా ప్రతినిధులు ప్రకటించారు. తెలంగాణ జూడాల సంఘం ఉస్మానియాయూనిట్ అధ్యక్షులు డా.విజయేందర్, టీజీజేడీఏ ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. డీఎంఈతో చర్చలకు ముందు ఉస్మానియా ఆసుపత్రిలో జూనియర్ వైద్యుల ఆందోళన రెండోరోజూ కొనసాగింది. సూపరింటెండెంట్, ఆర్ఎంవో దిష్టిబొమ్మలను దహనం చేశారు

భద్రత పెంచుతాం: ఉస్మానియాలో వైద్యులపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి ఆర్ఎంవో డా.మోయిన్ సిద్ధికీపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు డీఎంఈ డా.కె.రమేష్‌రెడ్డి తెలిపారు. సూపరింటెండెంట్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేస్తామన్నారు. వారు లేవనెత్తిన అంశాలన్నింటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 24 గంటల్లో భద్రతను పటిష్ఠం చేస్తామని తెలిపారు.

ఇస్లామిక్ స్టేట్.. వాతావరణ మార్పులు.. చైనా

- ఇవే భారత్‌కు ప్రధాన ముప్పులు!
- ప్యూ అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్: భారత్‌కు ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) పెను ముప్పుగా తాజా అధ్యయనం చెబుతోంది. వాతావరణ మార్పులు, దుందుడుకుగా వ్యవహరిస్తున్న చైనాలతోనూ ముప్పు పొంచివున్నట్లు వివరిస్తోంది. ప్యూ రీసెర్చ్ సంస్థ దీన్ని చేపట్టింది. దీనిలో పాల్గొన్నవారిలో 66 శాతం మంది ఐఎస్, 47 శాతం మంది వాతావరణ మార్పులను దేశానికి ప్రధాన ముప్పులుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. 44 శాతం మంది చైనా, 43 శాతం సైబర్ దాడులతోనూ ముప్పు పొంచివున్నట్లు అభిప్రాయపడ్డారు. సిక్కిం సరిహద్దుల్లోని డోక్లాం ప్రాంతంలో భారత్, చైనా సైన్యాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా పరిశోధన ఫలితాలు వెలువడ్డాయి.

నివేదికలో ప్రధాన అంశాలు: ఐఎస్‌ను భారత్, అమెరికాతోపాటు ఆసియా, ఐరోపాల్లోని 18 దేశాలవాసులు ప్రధాన ముప్పుగా పరిగణిస్తున్నారు.

- మన దేశానికి ముప్పు పొంచివున్న దేశాల జాబితాలో చైనా తర్వాత అమెరికా (19 శాతం), రష్యా (17 శాతం) నిలిచాయి.
- మరోవైపు దక్షిణ కొరియా (83 శాతం మంది), వియత్నాం (80 శాతం మంది)లోనూ చైనా ఆధిపత్యాన్ని ముప్పుగానే పరిగణిస్తున్నారు.
- అమెరికాలో సైతం 41 శాతం మంది చైనా దుందుడుకుతనంపై ఆందోళన వ్యక్తంచేశారు. స్పెయిన్ (51 శాతం), జపాన్ (64 శాతం), ఫిలిప్పీన్స్ (47 శాతం), ఘూనా (46 మంది)ల్లోనూ ఇదే పరిస్థితి.
- ఐరోపాలో ఎక్కువ దేశాలు ఐఎస్‌తోపాటు వాతావరణ మార్పులనూ ప్రధాన ముప్పుగానే భావిస్తున్నాయి.
- ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఐఎస్ పక్కన భూతాపం చేరింది. 52 శాతం మంది ఇక్కడ సైబర్ దాడులపైనా ఆందోళన పడుతున్నారు.

మరో రెండు డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు

వచ్చే వందేళ్లనాటి పరిస్థితులపై తాజా అధ్యయనం అంచనా

వాషింగ్టన్: వచ్చే 100 ఏళ్లలో భూమిపై రెండు నుంచి 4.9 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని తాజా అధ్యయనంలో తేలింది. ఉష్ణోగ్రతల కట్టడికి పారిస్ ఒప్పందంలో నిర్దేశించిన లక్ష్యం కంటే ఈ అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ శతాబ్దం చివరినాటికి రెండు డిగ్రీలు లేదా అంతకంటే తక్కువగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం కేవలం ఐదు శాతమేనని దీనిలో పరిశోధకులు తేల్చారు. 1.5 డిగ్రీల సెల్సియస్ (పారిస్ వాతావరణ మార్పుల లక్ష్యం) లేదా అంతకంటే తక్కువ పెరిగే అవకాశం ఒక్క శాతమేనని లెక్కగట్టారు. 'రెండు డిగ్రీలను లక్ష్యంగా పెట్టుకోవడం ఉత్తమమని మా విశ్లేషణలో తేలింది. అన్ని విధాలుగా కృషిచేస్తే దీన్ని 80 ఏళ్లలో సాధించొచ్చు'అని అమెరికాలోని వాషింగ్టన్ వర్సిటీ అధ్యాపకులు ఎడ్రియన్ రాఫెరీ తెలిపారు.

ప్రపంచ జనాభా, తలసరి స్థూల దేశీయోత్పత్తి, ఓ డాలరు ఆర్థిక వృద్ధి సమయంలో విడుదలయ్యే ఉద్గారాలపై పరిశోధనలో దృష్టి కేంద్రీకరించారు. ఈ అంశాలకు సంబంధించి గత 50 ఏళ్ల సమాచారాన్ని ప్రత్యేక గణన పద్ధతుల్లో విశ్లేషించారు. అనంతరం 2100 నాటి పరిస్థితులపై అంచనాలకు వచ్చారు.

సినీ రంగంలో సాంకేతికతకు ప్రాధాన్యం

- పై స్కోర్ యాప్ విడుదల సందర్భంగా మంత్రి తలసాని

మారేడుపల్లి, న్యూస్‌టుడే: సినిమా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యత సంతరించుకొని వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జయంత్‌కుమార్ రూపొందించిన పై స్కోర్ యాప్‌ను హైదరాబాద్‌లోని తన ఇంటి ఆవరణలో మంగళవారం తలసాని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో రోజువారి కార్యక్రమాలు ఎంతో సులభమవుతున్నాయన్నారు. అనంతరం యాప్ రూపకర్త జయంత్‌కుమార్ మాట్లాడుతూ.. పై స్కోర్ మొబైల్ యాప్ సహాయంతో గోడలపై ఉండే పోస్టర్లు, పత్రికల్లో వచ్చే సినిమా యాడ్స్‌ను స్కాన్ చేస్తే ఆ సినిమా ఏ సినిమాహాల్లో ప్రదర్శింపబడుతుందో తెలుస్తుందన్నారు. అంతే కాకుండా వాటికి సంబంధించి టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ యాప్‌తో సినిమా ఆడియో ప్రారంభం నుంచే టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. క్లౌడ్ ఫండింగ్ ద్వారా చిన్న, పెద్ద నిర్మాతలకు సినిమా చివరి దశలో ఉన్నప్పుడు టికెట్ బుకింగ్‌లతో వచ్చిన ఆదాయం వారికి ఆర్థికంగా సహాయపడుతుందన్నారు. యాప్‌కు సంబంధించి పేటెంట్‌ను పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవిబాబు, కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.



పై స్కోర్ యాప్ విడుదల చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

టిబెట్ పీఠభూమిపై ఎక్స్‌ప్రెస్ మార్గం ప్రారంభం

బీజింగ్: ప్రపంచంలోనే ఎత్తైన పీఠభూమి టిబెట్‌పై చైనా ఎక్స్‌ప్రెస్ రహదారి మార్గాన్ని ప్రారంభించింది. కింఘై ప్రావిన్సులోని గాంగ్చె కౌంటీని వుష నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించింది. 634.8 కి.మీ. పొడవైన ఈ మార్గం కోసం దాదాపు రూ.25.6వేల కోట్లను చైనా ఖర్చు చేసింది. సగటున 4వేల మీటర్ల ఎత్తులో ఈ రహదారి ఉంటుంది. రహదారిలో 36శాతం పెర్మాఫ్రాస్ట్ (మంచు) నేలపైనే నిర్మించారు. వాహనాల వల్ల ఏర్పడే ఉష్ణోగ్రత మార్పులకు ఈ నేల కరిగిపోతుంది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేలను స్థిరంగా ఉంచి.. నిర్మాణం చేపట్టారు. ఈ మార్గం ద్వారా యుషు, ప్రావిన్సు రాజధాని షినింగ్‌ల మధ్య ప్రయాణ సమయం.. 12 గంటల నుంచి 8 గంటలకు తగ్గింది.

చైనా మహాకుడ్యం కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గం

బీజింగ్: ప్రఖ్యాత మహాకుడ్యం (గ్రేట్ వాల్) కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గాన్ని చైనా నిర్మించనుంది. 2022లో శీతకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న బీజింగ్, ఝాంగ్‌జియాకు నగరాలను అనుసంధానించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా మహాకుడ్యానికి చెందిన బాడలింగ్ భాగం కింద 12 కి.మీ. పొడవైన సొరంగాన్ని తవ్వాలని చైనా ఇంజినీర్లు నిర్ణయించారు. అయితే మహాకుడ్యానికి ఎలాంటి నష్టమూ జరగకుండా 'కచ్చితత్వ సూక్ష్మపేలుళ్ల' సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నారు. దీని ద్వారా సొరంగం నిర్మాణం కోసం చాలా తక్కువ తీవ్రతతో పేలుళ్లను జరిపే వీలుంటుంది. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ ఇలాంటి 4,500 పేలుళ్లను జరిపినట్లు అధికారులు తెలిపారు. ఇటు కుడ్యం కిందే.. 102 మీటర్ల లోతున రికార్డు స్థాయిలో 36 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గంటకు 350 కి.మీ.ల వేగంతో రైళ్లు ప్రయాణించేలా ఈ మార్గాన్ని రూపొందిస్తున్నారు.

యాసిన్ భత్కల్‌పై అభియోగాల నమోదుకు కోర్టు ఆదేశాలు

దిల్లీ: జామా మసీదు పేలుళ్ల కేసు-2010లో ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రవాది యాసిన్ భత్కల్ సహా పది మందిపై అభియోగాల నమోదుకు దిల్లీ కోర్టు ఆదేశించింది. ఈ కేసుపై అదనపు సెషన్సుజడ్జి సిద్ధార్థ్ శర్మ మంగళవారం విచారణ చేపట్టారు. మరోవైపు అనుమానితులు ఇస్మాయిల్ అఫాఖ్, అబ్దుస్ సబూర్, రియాజ్ అహ్మద్ సయీదిలకు విముక్తి కల్పించారు. తదుపరి విచారణను 29కు వాయిదా వేశారు.

హఫీజ్ సయీద్ గృహ నిర్బంధం పొడిగింపు!

లాహోర్: ముంబయి పేలుళ్ల సూత్రధారి, జమాత్-ఉద్-దవా (జెయుడి) సారథి హఫీజ్ సయీద్ గృహనిర్బంధాన్ని మరో రెండునెలల పాటు పొడిగించారు. శాంతిభద్రతల అంశం నేపథ్యంలో ఈ పొడిగింపు జరిగింది. ఈ ఏడాది జనవరి 31నుంచీ సయీద్ గృహనిర్బంధంలో ఉన్నారు.

వాయుకాలుష్యంతో ఏటా మరో 60 వేల మరణాలు

వాషింగ్టన్: పర్యావరణ మార్పులను అరికట్టకపోతే తలెత్తే పెను నష్టాలను తాజా అధ్యయనమొకటి ఎత్తిచూపింది. ప్రస్తుత ధోరణి కొనసాగితే.. ప్రపంచవ్యాప్తంగా వాయుకాలుష్యం కారణంగా ఏటా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య 2030 నాటికి మరో 60 వేలు పెరుగుతుందని హెచ్చరించింది. 2100 నాటికి ఈ పెరుగుదల 2.6 లక్షలుగా ఉంటుందని సూచించింది. ఇప్పటికే వాయు కాలుష్యం కారణంగా ఏటా లక్షలాదిమంది అకాల మృత్యువాత పడుతున్న సంగతిని గుర్తుచేసింది. వాతావరణ మార్పులపై అధ్యయనం చేసే పలు ఉన్నతస్థాయి సంస్థల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా.. అమెరికాలోని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పులతో వాయు కాలుష్య కారకాల గాఢత పెరుగుతుందని వారు సూచించారు. ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కారణంగా ఓజోన్ వంటి కాలుష్య కారకాలు ఉత్పత్తయ్యే రసాయనిక చర్యలు వేగవంతమవుతాయని ఉదహరించారు. అధిక ఉష్ణోగ్రతల్లో చెట్ల నుంచి కర్బన కాలుష్య పదార్థాలు ఎక్కువగా విడుదలవుతాయని పేర్కొన్నారు. దీంతో మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00